www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 30-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 302 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 8.55 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తర రా. 10.07 తదుపరి హస్త; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.9.07-9.52, రా.10.17-11.07; అమృతఘడియలు: మ.1.58-3.46; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజ్యసభ ఎన్నికలు 27న

8వ తేదీన నోటిఫికేషన్ విడుదల

15వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

తెలంగాణ, ఏపీలో 3 సీట్ల చొప్పున ఖాళీ

ఏప్రిల్ 2తో ముగియనున్న బడుగు లింగయ్య, వద్దిరాజు, సంతోష్‌కుమార్ పదవీకాలం

2 కాంగ్రెస్‌కు, ఒకటి బీఆర్ఎస్‌కు దక్కే చాన్స్

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యుల ఎంపిక కోసం ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించేందుకు సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. వచ్చే నెల 8న నోటిఫికేషన్ విడుదల చేసి 15 వరకు నామినేషన్లను స్వీకరించనుంది. 16న నామినేషన్లను పరిశీలించనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 20వ తేదీ

మిగతా 14వ పేజీలో...

డిస్కమ్‌ల డైరెక్టర్లకు ఉద్వాసన

11 మందిలో ఇద్దరి నియామకమే చట్టబద్ధం

9 మందిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

కొత్త డైరెక్టర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల


మార్చి 1 దాకా దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా డిస్కమ్‌లలో డైరెక్టర్లుగా నియమితులైన వారికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)లో ఏడుగురు, ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)లో నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు తప్ప, మిగిలిన వారి నియామకం

మిగతా 12వ పేజీలో...



తెల్ల రేషన్‌కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ!



నిబంధనను సడలించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు

ఆరోగ్యశ్రీతో వాటి అనుసంధానం

ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపులు వేగవంతం

వైద్య కళాశాలల వద్దే నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీలు

బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తి సేవలపై దృష్టి

సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రుల్లో హౌస్‌కీపింగ్

వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం రేవంత్

హౌసింగ్ బోర్డు బకాయిలెన్ని?

దాని పరిధిలోని వెంచర్ల పరిస్థితి ఏంటి?

హౌసింగ్ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

1000 కోట్ల బకాయిలున్నాయన్న అధికార్లు

వాటన్నింటినీ వసూలు చేయాలన్న సీఎం

2004-14 మధ్య ఇందిరమ్మ ఇళ్లపై ఆరా



వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి దామోదర, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీకి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనను సడలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అదేవిధంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డుకు ఒక విశిష్ట సంఖ్యను కేటాయించాలని, దీని వల్ల అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్డులతో ఆరోగ్యశ్రీ సేవలను అనుసంధానించాలని సూచించారు. సోమవారం ఆయన సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ కార్డుకోసం తెల్ల రేషన్‌కార్డు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. "వైద్య కళాశాల ఉన్న చోట

మిగతా 13వ పేజీలో...

కల్యాణమస్తు పద్దు రూ. 3,200 కోట్లు?

తులం బంగారం హామీతో పెరిగిన బడ్జెట్ 13

తమిళనాడు తరహాలో అమలుకు యోచన

త్వరలోనే అధ్యయనానికి వెళ్లనున్న అధికారులు

బీసీ విదేశీ విద్యా నిధి పథకానికి మరిన్ని నిధులు

లబ్ధిదారుల సంఖ్యను ఐదింతలు పెంచే చాన్స్



'హెటిరో'కు భూ సంతర్పణపై దర్యాప్తు?

హైకోర్టు వద్దన్నా రూ.4 వేల కోట్ల విలువైన భూమి ధారాదత్తం

రూ.30 లక్షలకే లీజుకు కట్టబెట్టిన గత ప్రభుత్వం

బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథి ట్రస్టుకు 15 ఎకరాలు

ఏడాదికి ఎకరానికి రూ.2 లక్షల చొప్పున సాయిసింధు ఫౌండేషన్‌కు అప్పగింత

ఎన్నికలకు ముందు.. గత సర్కారు రహస్య జీవో

ఈ గలీజుపై కొత్త ప్రభుత్వం నజర్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో అత్యంత ఖరీదైన స్థలం అది..! హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలో ఉన్న 15 ఎకరాల భూమిని గత సర్కారు తమ ఎంపీకి కారు చౌకగా కట్టబెట్టింది. రూ.4 వేల కోట్ల విలువైన భూమిని.. ఏడాదికి ఎకరానికి రూ.2 లక్షల చొప్పున.. మొత్తం రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇచ్చింది. అంతేకాదు.. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయి సింధు ఫౌండేషన్‌కు ఎన్నికలకు ముందు గోప్యంగా జారీ చేసిన జీవో ద్వారా ఈ భూమిని ధారాదత్తం చేసింది. ఈ వ్యవహారంలో గత సర్కారు ఎంతలా దిగజారిందంటే.. హైకోర్టు జీవోను కొట్టివేసినా.. లీజు కేటాయింపులను రద్దు చేస్తూ.. పునఃపరిశీలించాలని ఆదేశించినా పెడచెవిన పెట్టింది. పైగా.. లీజు నిబంధనలకు సంబంధించిన జీవోలకు సవరణలు చేసి, కొత్త జీవో ద్వారా మళ్లీ పార్థసారథిరెడ్డి ట్రస్టీగా ఉన్న సంస్థకు భూములను కట్టబెట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై.. బీఆర్ఎస్(అప్పట్లో టీఆర్ఎస్) అధికార పగ్గాలు చేపట్టిన మూణ్నెల్లకే.. అంటే 2014 సెప్టెంబరులో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఎండీ పార్థసారథి రెడ్డి

మిగతా 13వ పేజీలో...

కేటీఆర్.. తీరు మార్చుకో! 13

- సీఎంపై వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి ధ్వజం
- ఆర్నెల్లలో కేసీఆర్ సీఎం ఎలా అవుతారు?: జీవన్‌రెడ్డి
- కేటీఆర్‌ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలి: బండి సుధాకర్
- బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బ కొట్టాల్సిందే: జగ్గారెడ్డి



మంత్రి కోమటిరెడ్డితో వాగ్వాదానికి దిగిన సందీప్‌రెడ్డిని వారిస్తున్న పోలీసులు

హామీల అమలేదీ? వీపులు పగుల్తాయ్!

యాదాద్రి జడ్పీ చైర్మన్, మంత్రి కోమటిరెడ్డి మధ్య వాగ్వాదం.. బీబీనగర్ సభలో ఉద్రిక్తత

రైతుబంధు పెంపు, రుణమాఫీ ఎందుకు చేయలేదన్న సందీప్‌రెడ్డి.. విరుచుకుపడ్డ మంత్రి

తండ్రి పేరుతోనే పదవి.. లేదంటే వార్డు మెంబర్‌గానూ గెలవలేవన్న కోమటిరెడ్డి

సర్కారుపై తప్పుగా మాట్లాడితే బీఆర్ఎస్ నేతల వీపులు పగుల్తాయని వ్యాఖ్య

రేవంత్ స్వశక్తితో సీఎం అయ్యారు.. ఆయన చిటికెన వేలుకు కూడా కేటీఆర్ సరిపోరు

'రైతుబంధు'పై తన వ్యాఖ్యలను వక్రీకరించారని కోమటిరెడ్డి వివరణ

వేదికపైనున్న జడ్పీ చైర్మన్‌పైకి దూసుకొచ్చిన మంత్రి అనుచరులు.. అడ్డుకున్న పోలీసులు

బీబీనగర్, జనవరి 29: యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్ఎస్ నేత, జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య సోమవారం తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వ్యవహారం ఇద్దరి మధ్య వ్యక్తిగత దూషణల వరకూ వెళ్లింది. జిల్లాలోని బీబీనగర్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి కోమటిరెడ్డి సోమవారం

మిగతా 12వ పేజీలో...

గవర్నర్‌ది గలీజ్ ప్రసంగం

కాంగ్రెస్ గల్లీ కార్యకర్తలా తమిళిసై వ్యాఖ్యలు

అభివృద్ధే ధ్యేయంగా పదేళ్ల పాటు పనిచేశాం

ఒకరిద్దరు బీఆర్ఎస్‌ను వీడినా నష్టమేమీ లేదు

వెళ్లే వారిని ఆపొద్దు.. ఆ స్థానంలో కొత్త వాళ్లు

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో వేటు వేద్దాం

రేవంత్.. రుణమాఫీపై సంతకం.. ఏమైంది?

పేదలైన భార్యాభర్తలిద్దరికీ 4 వేల పింఛన్ ఇవ్వాలి

బావాబామ్మర్దులం ప్రశ్నిస్తేనే రేవంత్ ఉక్కిరిబిక్కిరి

ఇక.. కమాండర్ కేసీఆర్ దిగితే ఎలా ఉంటుందో?

చేవెళ్ల, పరిగి కార్యకర్తల సమావేశాల్లో కేటీఆర్

సందీప్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

మంత్రి కోమటిరెడ్డిని నిలదీస్తాం: కేటీఆర్



చేవెళ్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 12

రేవంత్‌రెడ్డికి మంత్రిగా చేసిన అనుభవం కూడా లేదు. అందుకే సెక్రటేరియట్‌లో లంకె బిందెలున్నాయని వస్తే.. కుండలే ఉన్నాయంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. లంకె బిందెలు సెక్రటేరియట్‌లో ఎందుకుంటాయి? పాడుబడ్డ గడీలు, బావుల్లో ఉంటాయి. రాత్రిళ్లు దుప్పటి కప్పుకొని గడ్డపారలు, పారలు తీసుకెళ్లి తవ్వి వెతుకుతారు. ఇది కూడా తెలియని వాళ్ల చేతుల్లో రాష్ట్రం ఉంది. - కేటీఆర్



పొద్దుటూరి నర్సారెడ్డి ఇకలేరు 13

కాంగ్రెస్ దిగ్గజనేత(93) కన్నుమూత

3 సార్లు నిర్మల్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు.. ఒకసారి ఆదిలాబాద్ ఎంపీగా

ఏపీసీసీ అధ్యక్షుడిగానూ సేవలు

రేవంత్ సంతాపం.. ఇంటికి వెళ్లి నివాళి

మార్టగేజ్‌తో మడతెట్టేస్తాడు!

10% మార్టిగేజీ నిబంధనను అడ్డుపెట్టుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోకుండానే పొసెషన్‌లోకి

దర్యాప్తులో వెలుగులోకి శివబాలకృష్ణ లీలలు

10 రోజుల కస్టడీ కోరుతూ ఏసీబీ పిటిషన్ 14

ప్రజాకర్షకమేనా..!?

ఆదాయ పన్ను పరిమితి పెరిగేనా?

పార్లమెంటులో ఎల్లుండి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్

ఎన్డీయే-2 హయాంలో చివరి బడ్జెట్ ఇదే

ఎన్నికల ఏడాదిలో ప్రజాకర్షక నిర్ణయాలపై ఆశలు

సెక్షన్ 80సి కింద ఇచ్చే మినహాయింపుల్ని లక్షన్నర నుంచి 2.5 లక్షలకు పెంచాలని వినతి

ఈవీలకు ఊతమిచ్చే ఫేమ్-3 ప్రకటించే అవకాశం

రైతులకు 'పీఎం కిసాన్' మొత్తాన్ని పెంచే చాన్స్

హైదరాబాద్, జనవరి 29: ప్రస్తుత ప్రభుత్వ చివరి బడ్జెట్ పెట్టడానికి మరో రెండు రోజుల సమయమే మిగిలుంది. అయితే ఇది ఎన్నికల ఏడాది కావడంతో.. ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను కాకుండా తాత్కాలిక బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టబోతోంది. లెక్క ప్రకారమైతే తాత్కాలిక బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు తావుండకూడదు. కానీ.. ఎన్నికల సమయంలో ఓట్ల లెక్కలను దృష్టిలో పెట్టుకుని రూపొందించే లెక్క (బడ్జెట్) కాబట్టి ప్రభుత్వాలు తాత్కాలిక బడ్జెట్లలోనూ తాయిలాలు గుప్పించడం ఆనవాయితీగా మారి

మిగతా 2వ పేజీలో...



రాష్ట్రంపై కేంద్రం కనికరం చూపేనా? 14

కొత్త బడ్జెట్‌లో కోరిన గ్రాంట్లు ఇచ్చేనా?

ఇప్పటికే కేంద్రం దృష్టికి పలు డిమాండ్లు

'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా

వెనుకబడిన జిల్లాలకు రూ.1800 కోట్లు

మెట్రో రైలు రెండో దశ నిధులకు విజ్ఞప్తి

1న కేంద్ర బడ్జెట్‌పై భారీ ఆశలతో రాష్ట్రం

మోదీ మళ్లీ గెలిస్తే.. ఇవే చివరి ఎన్నికలు

నియంతృత్వంవైపే ఆయన మొగ్గు.. పుతిన్‌లా పాలించాలన్నదే బీజేపీ లక్ష్యం

ఆరెస్సెస్ భావజాలం విషపూరితం.. ప్రజలే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి: ఖర్గే



భువనేశ్వర్, జనవరి 29: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ప్రధాని మోదీ గెలిస్తే దేశానికి ఇవే చివరి ఎలక్షన్లు అవుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. బీజేపీ మరోసారి విజయం సాధిస్తే మోదీ నియంతృత్వంవైపే మొగ్గు చూపే అవకాశం ఉందని అన్నారు. రష్యాలో పుతిన్ పాలించినట్టుగా ఇక్కడ కూడా మోదీ ప్రభుత్వం ఉండాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి

మిగతా 2వ పేజీలో...

ప్రయోగశాలలో చేప మాంసం!

తయారీకి సీఎంఎఫ్ఆర్ఐ సంకల్పం

అదే రంగు, రుచి, పోషక విలువలు

ప్రైవేటు సంస్థతో ఒప్పందం 2

ఈ రంగంలో ముందంజ వేసిన దేశాలతో పోటీ పడే యత్నం



జ్ఞానవాపి శిలాశాసనంపై తెలుగువారి పేర్లు

మల్లన్న భట్టు, నారాయణ భట్టుగా గుర్తించిన ఏఎస్ఐ డైరెక్టర్

నారాయణ భట్టు పర్యవేక్షణలోనే కాశీ విశ్వనాథుని మందిర పునర్నిర్మాణం

2

ప్రయోగశాలలో చేప మాంసం తయారీ!



కొచ్చి, జనవరి 29 : సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ) ప్రయోగశాలలో చేప మాంసం తయారీ దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి. దేశంలో సముద్ర ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు చేపట్టారు. తద్వారా సముద్ర ఉత్పత్తులపై ఆధారపడడం తగ్గుతుందని, అలాగే దేశం కల్చర్డ్ మెరైన్ ఫిష్ మీట్(సముద్ర చేపల మాంసం) తయారీ రంగంలో ముందడుగు వేస్తుందని సోమవారం విడుదల చేసిన సీఎంఎఫ్ఆర్ఐ అధికారిక ప్రకటన వెల్లడించింది. చేపల్లోని ప్రత్యేక కణాలను సేకరించి వాటిని ప్రయోగశాలలో పెంచడం ద్వారా ఈ మాంసాన్ని ఉత్పత్తి చేస్తారు. ఇలా ఉత్పత్తి చేసిన మాంసం అసలు చేప మాంసం రంగు, రుచి, పోషక విలువలే కలిగి ఉంటుంది. తొలిదశలో ఖరీదైన కింగ్ ఫిష్, పాంఫ్రెట్, సీర్ ఫిష్ వంటి చేపల మాంసం తయారుచేయాలని నిర్ణయించారు. ఈమేరకు నీట్ మీట్ బయోటెక్ స్టార్టప్ సంస్థతో సీఎంఎఫ్ఆర్ఐ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. సీఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ ఎ. గోపాలకృష్ణన్, నీట్ మీట్ బయోటెక్ సీఈవో సందీప్ శర్మ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఖరీదైన సముద్ర చేపల కణజాలం అభివృద్ధిపై సీఎంఎఫ్ఆర్ఐ దృష్టి సారిస్తుంది. ఈ కణజాలం నుంచి చేప మాంసం తయారీకి కావాల్సిన సాంకేతికతతో నీట్ మీట్ తదుపరి ప్రక్రియలను చేపట్టి సదరు చేప మాంసం తయారుచేస్తుంది. ఈ రంగంలో ఇప్పటికే ముందున్న సింగపూర్, ఇజ్రాయెల్, యూఎస్ వంటి దేశాలతో పోటీ పడేందుకు ఈ ఒప్పందం కీలకమైందని గోపాలకృష్ణన్ అన్నారు.

బడికి వెళ్లకపోవడమనేది రోజుకు 10 సిగరెట్లు తాగినంత ప్రమాదం

» బడికెళ్లే ప్రతి ఏడాది ఆయుర్దాయంలో పెరుగుదల: లాన్సెట్

న్యూఢిల్లీ, జనవరి 29: "నిరక్షరాస్యులతో పోలిస్తే బడికి వెళ్లి చదువుకొని ప్రైమరీ స్కూల్ పాస్ అయిన వాళ్లలో మరణాల రేటు 13 శాతం తక్కువ. సెకండరీ స్కూల్ పాస్ అయితే మరణాల రేటు 25 శాతం తక్కువ. అదే, బడికి వెళ్లకపోతే అది మనిషి ఆరోగ్యంపై రోజుకు 5-6 పెగ్గుల మద్యం తాగినంత (లేదా) రోజుకు 10 సిగరెట్లను పదేళ్లపాటు తాగినంత ప్రభావం చూపిస్తుంది. విద్య కేవలం జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే కాదు. మనిషి ఆయుర్దాయాన్ని కూడా పెంచుతుంది" అని ఓ అధ్యయనంలో తేలింది. నార్వేయన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తల బృందం 59 దేశాలకు చెందిన సమాచారం ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. రోజూ బడికి/కాలేజీకి వెళ్లి చదువుకోవడం, చిన్నతనంలోనే బడి మానేయడం/మొత్తానికే వెళ్లకపోవడం.. ఈ రెండు సందర్భాల్లో మనిషి మానసిక, శారీరక ఆరోగ్యంపై ఎలా ప్రభావం పడుతుందో విశ్లేషించారు. ఒక వ్యక్తి స్కూల్/కాలేజీకి వెళ్లే ప్రతీ ఏడాది అతని ఆయుర్దాయం రెండేళ్లు పెరుగుతుందని తేల్చారు. అంటే 18ఏళ్ల పాటు ఓ వ్యక్తి విద్యా సంస్థకు వెళ్లి చదువుకుంటే అతని ఆయుర్దాయం నిరక్షరాస్యులతో పోలిస్తే 34శాతం ఎక్కువని పేర్కొన్నారు. ఈ అధ్యయనాన్ని లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు.

లోకం తీరు



బిహార్ స్పీకర్‌పై బీజేపీ అవిశ్వాసం

పాట్నా, జనవరి 29: బిహార్ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు బీజేపీ ప్రకటించింది. ఆదివారం ఎన్‌డీఏలో చేరి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ సోమవారం తొలి మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో నితీశ్‌తో పాటు ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన ఎనిమిది మంది మంత్రులూ పాల్గొన్నారు. వీరికి శాఖల కేటాయింపు కూడా అతి త్వరలోనే పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక ప్రస్తుత స్పీకర్, ఆర్జేడీ నేత అవధ బిహారీ చౌధరీపై బీజేపీ సభ్యులు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు ఇచ్చారు. ప్రస్తుత స్పీకర్‌ను తొలగించి ఆ పదవికి బీజేపీ సభ్యుడిని ఎన్నుకోనున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ప్రస్తుత బిహార్ అసెంబ్లీలో ఎన్‌డీఏకు 128 మంది సభ్యుల బలం ఉంది. ఈ కూటమికి మేజిక్ మార్కు కంటే ఆరుగురు సభ్యుల బలం అధికంగా ఉంది. ఇక ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మహాఘట్‌బంధన్‌కు 114 మంది సభ్యులున్నారు.

రాష్ట్రపతి ముర్ము పట్ల ఏకవచనంతో సంబోధన

» క్షమాపణలు చెప్పిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఏకవచనంతో సంబోధించిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆమెకు బహిరంగ క్షమాపణలు చెప్పారు. చిత్రదుర్గలో అణగారినవర్గాల చైతన్య సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం ప్రసంగిస్తూ... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అణగారినవర్గాలకు చెందినందుకే కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవం, అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలకు బీజేపీ ఆహ్వానించలేదని మండిపడ్డారు. ఈ సందర్భంలోనే రాష్ట్రపతి పేరును ప్రస్తావిస్తూ ఏకవచనంతో మాట్లాడారు. ఇది వైరల్ అయింది. సిద్దరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించాలని మాజీ సీఎం కుమారస్వామి డిమాండ్ చేశారు. వివాదం రాజుకోవడంతో సిద్దరామయ్య సోమవారం క్షమాపణలు చెప్పారు.

శ్రీకృష్ణ జన్మభూమి సర్వేపై స్టే కొనసాగింపు

న్యూఢిల్లీ, జనవరి 29: మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు ఆవరణ వివాదం విషయమై గతంలో ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. కోర్టు కమిషనర్ పర్యవేక్షణలో ఆ ఆవరణలో శాస్త్రీయ సర్వే జరపాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఈ నెల 16న సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఆ స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ ప్రథమ పక్షానికి వాయిదా వేసింది. ఈ విషయానికి సంబంధించిన మిగిలిన అన్ని పిటిషన్లను కూడా అదే రోజు చేపడుతామని తెలిపింది. ఆ లోగా లిఖితపూర్వక వాదనలను పూర్తి చేయాలని అన్ని పక్షాలను ఆదేశించింది.

అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్ విచారణను సోమవారం సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తదుపరి విచారణను మార్చి 11తో ప్రారంభమయ్యే వారంలో చేపడతామని పేర్కొంది. తన బెయిల్ పిటిషన్లను కింది కోర్టులు తిరస్కరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అభిషేక్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆయన దాదాపు 16 నెలలుగా జైలులో ఉన్నారని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారానికి సంబంధించిన ఇతర కేసులు తాము విన్నామని, అన్ని వాస్తవాలు తమకు తెలుసునని వ్యాఖ్యానించింది. ఆ కేసులతో పాటు దీనినీ మార్చిలో విచారిస్తామని తెలిపింది.

జాడ లేని ఝార్ఖండ్ సీఎం సోరెన్!

న్యూఢిల్లీ, జనవరి 29: ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అదృశ్యమయ్యారు! ఆయన ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదు! అవును.. ఈ విషయాన్ని ఈడీ అధికార వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ కేసులో సోరెన్‌ను విచారించేందుకు సోమవారం ఈడీ అధికారులు ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసానికి వెళ్లారు. అయితే ఆయన ఇంట్లో లేరని, అందుబాటులోకి కూడా రాలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆయన ఇంటి నుంచి బీఎండబ్ల్యూ కారు, కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాయి. కాగా, సీఎం సోరెన్.. తాను ఈ నెల 31న రాంచీలో విచారణకు అందుబాటులో ఉంటానంటూ ఈడీ అధికారులకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా, భూములు రాసిస్తే ఉద్యోగాలు కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ సోమవారం ఈడీ ఎదుట హాజరయ్యారు.

పైరెట్ల నుంచి 17 మందిని కాపాడిన నేవీ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం మరోసారి సత్తా చాటింది. సోమాలియా సముద్ర దొంగల(పైరెట్ల) చెర నుంచి ఇరాన్‌కు చెందిన 17 మంది మత్స్యకారులను రక్షించింది. సోమాలియా, గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో పహారా కాస్తున్న ఐఎన్ఎస్ సుమిత్ర యుద్ధ నౌకకు ఇరాన్ మత్స్యకారుల పడవ(ఇమ్యాన్) నుంచి సోమవారం.. సముద్రపు దొంగలు తమ పడవను స్వాధీనం చేసుకున్నారని, కాపాడాలని సమాచారం వచ్చింది. దీంతో, సుమిత్ర వెంటనే అక్కడికి చేరుకుంది. బోటుతో పాటు బందీలుగా చిక్కుకున్న 17మంది మత్స్యకారులను నేవీ సిబ్బంది విడిపించారు.

జ్ఞానవాపిలో లభించిన శిలాశాసనంపై తెలుగువారి పేర్లు

మల్లన్న భట్టు, నారాయణ భట్టుగా గుర్తించిన ఏఎస్ఐ డైరెక్టర్



న్యూఢిల్లీ, జనవరి 29: ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీ జిల్లాలో ఉన్న కాశీవిశ్వనాథుని ఆలయం సమీపంలోని జ్ఞానవాపి మసీదు ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో హిందూ దేవతల విగ్రహాలు బయల్పడిన విషయం తెలిసిందే. వీటితోపాటు తెలుగు లిపితో ఉన్న ఒక శిలా శాసనాన్ని కూడా భారత పురాతత్వ శాస్త్రవేత్తలు వెలికి తీశారు. తిరుపతికి చెందిన ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి ఆ శాసనంపై ఉన్న తెలుగు లిపిని డీకోడ్ చేశారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శిలాశాసనంపై 'మల్లన్న భట్టు, నారాయణ భట్టు' పేర్లు ఉన్నాయి. నారాయణ భట్టు కుమారుడే మల్లన్న భట్టు. వీరు తెలుగు బ్రాహ్మణులు. 1585లో పునర్నిర్మించిన కాశీవిశ్వనాథుని ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. 15వ శతాబ్దంలో జౌన్‌పూర్ సుల్తాన్ హుస్సేన్ షార్కి(1458-1505) కాశీవిశ్వనాథుని మందిరాన్ని కూల్చేశారు. తర్వాత కాలంలో రాజ్యం చేపట్టిన రాజా తోడర మల్లు ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించారు. దక్షిణ భారత దేశానికి చెందిన నిపుణులైన నారాయణ భట్టును సంప్రదించి ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారని చరిత్ర చెబుతోంది. నారాయణ భట్టు పర్యవేక్షణలోనే కాశీ విశ్వనాథుని మందిరం పునర్నిర్మితమైంది. తాజాగా లభించిన శిలాశాసనం ఈ విషయాన్ని నిర్ధారిస్తోందని మునిరత్నం రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాకర్షకమేనా..!?

(మొదటి పేజీ తరువాయి)



చాలాకాలమే అయింది. ఈ నేపథ్యంలోనే.. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న ఇంటెరిమ్ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలను మరీ ముఖ్యంగా ఓటర్లను ఆకట్టుకునే నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉందన్న ఆశ సగటు మధ్యతరగతి జీవుల్లో, పేదల్లో ఉంది.

సాధారణంగా బడ్జెట్ అనగానే చాలా మందికి గుర్తొచ్చేది.. ఆదాయ పన్ను శ్లాబులే! ఈసారైనా కేంద్రం దయతలచి పన్ను పరిమితిని పెంచితే బాగుండని కోరుకోవడం.. తీరా బడ్జెట్ చూశాక ఉసూరంటూ నిరాశకు గురి కావడం ఎప్పుడూ జరిగేదే. అయినా మళ్లీ కొత్త బడ్జెట్ ప్రకటిస్తున్నారనగానే ఆశలు చిగురించడమూ అంతే సహజం. ఈ క్రమంలోనే ఈసారి కూడా ఆదాయ పన్ను పరిమితి పెంపు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదాయపన్నుకు సంబంధించి ప్రస్తుతం పాత, కొత్త విధానాలు అమల్లో ఉన్నాయి. వీటిలో ఒక్కోదానికీ కనీస మినహాయింపు పరిమితి ఒక్కో విధంగా ఉంది. పాత పన్ను విధానంలో ఈ పరిమితి రూ.2.5 లక్షలుగా ఉండగా.. కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షలుగా ఉంది. ఈ రెండు పరిమితులనూ పెంచాలని వేతన జీవులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం పెంచుతుందని ఆశపడుతున్నారు.

ప్రామాణిక తగ్గింపు పరిమితి (స్టాండర్డ్ డిడక్షన్ లిమిట్)ని ప్రస్తుతం ఉన్న 50 వేల నుంచి రూ.లక్షకు పెంచే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు.. హెచ్ఆర్ఏ మినహాయింపు, ఆరోగ్య బీమా ప్రీమియం తగ్గింపు పరిమితిని కూడా కేంద్రం పెంచుతుందని ఆశిస్తున్నారు.

జాతీయ పింఛను పథకం పరిమితిని కూడా పాత, కొత్త పన్ను విధానాలు రెండింటిలోనూ రూ.లక్షకు పెంచే అవకాశం ఉందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. చాలా మంది ఇప్పటికీ పాత పన్ను విధానంలోనే ఉన్నారని.. రెండింటిలోనూ ఈ పరిమితిని పెంచితే చాలా మంది కొత్త పన్ను విధానం వైపు మారే అవకాశం ఉందని టాటా పెన్షన్ మేనేజ్‌మెంట్ సీఈవో కురియన్ జోస్ అభిప్రాయపడ్డారు.

గృహరుణ కిస్తీల కింద నెలనెలా వేలాది రూపాయలు చెల్లించే వేతన జీవులు చాలామంది కొత్త పన్ను విధానం వైపు మొగ్గుచూపకపోవడానికి కారణం గృహ రుణ వడ్డీల మినహాయింపులే. ఈ నేపథ్యంలో.. ఆ మినహాయింపును కొత్త పన్ను విధానానికీ వర్తింపజేసే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేసే క్రమంలో.. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఫేమ్)' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫేమ్-1, ఫేమ్-2 పేరిట రెండు దఫాలుగా ఈ పథకం కింద ఈవీల కొనుగోళ్లపై ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఫేమ్-2 కాలపరిమితి ఈ ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ఫేమ్-3ని ప్రకటించనున్నట్టు కేంద్ర భారీ పరిశ్రమలశాఖ ఇటీవలే వెల్లడించింది.

జీవితబీమా ప్రీమియంలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గిస్తే బీమా తీసుకునేవారి సంఖ్య పెరుగుతుందని ఆ రంగానికి చెందిన నిపుణులు కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఆ దిశగా ఒక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు అంచనా.

,ఇవే కాదు, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉత్పత్తి రంగాలకు సంబంధించి కూడా ప్రజలను ఆకట్టుకునే విధంగా పలు కీలక నిర్ణయాలను ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

- పన్ను మినహాయింపుల్లో చాలా మంది కోరేది.. సెక్షన్ 80సీ కింద ఇస్తున్న మినహాయింపు పరిమితి పెంపు. రూ.లక్షగా ఉన్న ఈ పరిమితిని.. 2014-15 బడ్జెట్‌లో రూ.1.5 లక్షలకు పెంచారు. అప్పట్నుంచీ ఈ పరిమితిలో ఎలాంటి మార్పూ లేదు. కనీసం ఈసారైనా ఈ పరిమితిని రూ.2 లక్షలకు ప్రభుత్వం పెంచుతుందన్న ఆశాభావం వేతనజీవుల్లో వ్యక్తమవుతోంది. తొమ్మిదేళ్లుగా పెరిగిన ధరలను, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుంటే.. ఈ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచాలని ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ట్యాక్స్ పార్ట్‌నర్ సురభి మార్వా అభిప్రాయపడ్డారు.
- వేతన జీవులే కాదు.. ఎన్నికల ఏడాది బడ్జెట్‌లో రైతన్నలకూ పెద్ద పీట వేయడం ప్రభుత్వాలకు అలవాటే. ఈ క్రమంలోనే, 2019లో ఎన్నికలకు ముందు ఆర్థికమంత్రిగా తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్.. రైతుల కోసం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే కోవలో ఈసారి కూడా దేశవ్యాప్తంగా ఉన్న రైతులను ఆకట్టుకునేలా ఈ పథకం కింద ఇస్తున్న మొత్తాన్ని పెంచుతూ ప్రకటన చేసే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి.

మాల్దీవుల అధ్యక్షుడిపై అభిశంసన!



మాలె, జనవరి 29: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు పార్లమెంటులో మెజారిటీ ఉన్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎండీపీ(మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ) సిద్ధమైంది. కేబినెట్‌లోకి కొత్తగా నలుగురు సభ్యులను తీసుకోడానికి ఆమోదం తెలిపే విషయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పార్లమెంటులో ఘర్షణ జరిగిన తర్వాతి రోజే చైనా అనుకూల దేశాధ్యక్షుడిపై అభిశంసనకు ప్రధాన ప్రతిపక్షం సిద్ధమవడం గమనార్హం. అభిశంసన తీర్మానానికి అవసరమైనన్ని సంతకాలను డెమొక్రాట్ల భాగస్వామ్యంతో ఎండీపీ సేకరించింది. పార్లమెంటులో మొత్తం 87 మంది సభ్యులుండగా, ప్రతిపక్ష ఎండీపీ, డెమొక్రాట్లకు సంయుక్తంగా 56 మంది సభ్యుల బలముంది. పార్లమెంటులో 56 ఓట్లతో దేశాధ్యక్షుడిని అభిశంసించవచ్చని రాజ్యాంగంతోపాటు, పార్లమెంటు స్టాండింగ్ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సోమవారం ఎండీపీ పార్లమెంటరీ గ్రూప్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా, కొత్తగా కేబినెట్‌లోకి తీసుకోవాలనుకున్న నలుగురిలో ఒకరి నియామకానికి పార్లమెంటు సోమవారం ఆమోదం తెలిపింది. ఆర్థిక మంత్రి అలీ హైదర్ అహ్మద్ నియామకాన్ని 37-32 ఆధిక్యంతో పార్లమెంటు ఆమోదించిందని స్థానిక మీడియా తెలిపింది. గతేడాది జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో భారత అనుకూల ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ ఓటమి పాలయ్యారు. అనంతరం అధ్యక్ష పగ్గాలు చేపట్టిన చైనా అనుకూల ముయిజ్జు మార్చి 15 నాటికి తమ దేశం నుంచి సైనిక దళాలను ఉపసంహరించుకోవాలని భారత్‌ను కోరారు.

వారంలో దేశవ్యాప్తంగా సీఏఏ అమలు

» కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ వెల్లడి

కోల్‌కతా, జనవరి 29: వారం రోజుల్లో దేశవ్యాప్తంగా సీఏఏ(పౌరసత్వ సవరణ చట్టం)ను అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించారు. సోమవారం కోల్‌కతాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడు రోజుల్లో సీఏఏ అమలు చేస్తామనేది తన గ్యారెంటీ అని నొక్కి చెప్పారు. ఆదివారం కూడా పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా కాక్‌ద్వీప్‌లో నిర్వహించిన బహిరంగ సభలో శాంతను ఠాకూర్ మాట్లాడుతూ 'మీకు ఓటరు, ఆధార్‌కార్డులు ఉన్నట్లైతే మీరు ఈ దేశ పౌరులే అని, మీరు ఓటు వేయొచ్చని ఈ రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అదే నిజమైతే ఇక్కడ వేలమంది ఎందుకు ఓటు హక్కు కోల్పోయారో ముఖ్యమంత్రి(మమతా బెనర్జీ) సమాధానం చెప్పాలి? భవిష్యత్తు తరాల భద్రత కోసం సీఏఏను అమలు చేస్తున్నాం' అన్నారు. అయితే, ఇది ఎన్నికల నేపథ్యంలో చేసిన ప్రకటన అని, పశ్చిమబెంగాల్‌లో సీఏఏ అమలును అడ్డుకుంటామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 'లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ సీఏఏ అంశాన్ని లేవనెత్తుతోంది. ఇది ఎన్నికల దృష్ట్యా చేసిన ప్రకటనే' అని ఆ పార్టీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ కొట్టిపారేశారు. 'ఎప్పటిలాగే బీజేపీ సీఏఏ ద్వారా పాత ఎత్తుగడలనే ఉపయోగిస్తోంది. రాష్ట్రంలో సీఏఏను అమలు చేయబోమని మా పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టంగా చెప్పారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ సీఏఏ అంశాన్ని లేవనెత్తుతోందని కూచ్‌బెహార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మమత నిందించారు.

మోదీ మళ్లీ గెలిస్తే ఇవే చివరి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)



దేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం రానున్న ఎన్నికలేనని హెచ్చరించారు. సోమవారం ఇక్కడ జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రసంగించిన ఆయన ఆర్ఎస్ఎస్-బీజేపీలపై ఘాటు విమర్శలు చేశారు. వాటి సిద్ధాంతాలు విషపూరితమని, అందువల్ల వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రతిపక్షాలను బెదిరించడం ద్వారా మోదీ పాలనను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈడీ, ఆదాయపు పన్ను విభాగాలు బీజేపీ చేతిలో ఆయుధాలుగా మారాయని విమర్శించారు. బీజేపీ-ఆరెస్సెస్ సిద్ధాంతాలను వ్యతిరేకించే రాజకీయ నాయకులను వారి సొంత పార్టీలను వీడేలా బెదిరిస్తోందని ఆరోపించారు. బీజేపీ, ఆరెస్సెస్‌లను వ్యతిరేకిస్తున్నందుకు రాహుల్ గాంధీకి కూడా బెదిరింపులు వస్తున్నాయని ఖర్గే చెప్పారు. అయితే రాహుల్ వాటిని లెక్కచేయడం లేదని, దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని చెప్పారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇండియా కూటమిని విడిచిపెట్టడంపై స్పందిస్తూ ఒక్కరు వెళ్లిపోయినంత మాత్రాన ఎన్నికలపై ప్రభావం పడదని అన్నారు.

70 ఏళ్లలో దేశానికి కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ ప్రధాని మోదీ చేస్తున్న విమర్శలపైనా ఖర్గే ఘాటుగా స్పందించారు. "మీరు గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రధాని కాగలిగారంటే కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడం వల్లనే సాధ్యమయింది. మరి మీరేమో ప్రజాస్వామ్య, రాజ్యాంగ మూల సూత్రాలనే నాశనం చేస్తున్నారు" అని విమర్శించారు. మోదీని అబద్ధాలకోరు అని అభివర్ణించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 లక్షల ఖాళీలు ఉన్నా భర్తీ చేయడం లేదని విమర్శించారు.

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పైనా విమర్శలు చేశారు. ఒడిశాలో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, కర్మాగారాల జాబితాను వివరిస్తూ రాష్ట్రానికి నవీన్ ఏమి చేశారని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూకు, బిజూ పట్నాయక్‌కు మంచి స్నేహం ఉండేదని, కానీ నవీన్ పట్నాయక్ ఇప్పుడు బీజేపీ సిద్ధాంతాలను నమ్ముతున్నారని అన్నారు. ఒడిశాలో బీజేపీది, బిజూ జనతాదళ్‌ది ప్రేమ వివాహం అని వ్యాఖ్యానించారు.

సంఘ్, బీజేపీ సిద్ధాంతాలతో హింస, విద్వేషాల వ్యాప్తి

కిషన్‌గంజ్ (బిహార్), జనవరి 29: ఆరెస్సెస్, బీజేపీల సిద్ధాంతాలు దేశంలో హింస, విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎన్‌డీఏ పాలనలో వివిధ మతాలు, కులాలకు చెందిన ప్రజలు కొట్టుకుంటున్నారని ఆరోపించారు. 'ఇండియా కూటమి' ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్.. ప్రతిపక్షాలతో తెగతెంపులు చేసుకుని ఎన్‌డీఏలో చేరి ఆదివారం మళ్లీ సీఎం పగ్గాలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' బెంగాల్ నుంచి సోమవారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో ప్రవేశించింది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాగా, ఇటీవల వైరల్ అయిన ఓ వీడియోలో రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ బెంగాల్ బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారిపై కాంగ్రెస్ నేతలు సిలిగురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారత్‌జోడో న్యాయ యాత్ర సోమవారం బిహార్ నుంచి బెంగాల్‌లో ప్రవేశించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సువేందు ప్రవర్తన అంగీకారయోగ్యంకాదని, ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత సువంకర్ సర్కార్ డిమాండ్ చేశారు.

పరీక్షల వేళ పిల్లలపై ఒత్తిడి వద్దు

వాళ్లను ఇతరులతో పోల్చడం మానుకోవాలి

» 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, జనవరి 29: పరీక్షల సమయంలో ఒత్తిళ్లను తట్టుకునేలా పిల్లల్లో ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను తమ సొంత విజిటింగ్ కార్డులుగా భావించవద్దని కోరారు. పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ సోమవారం 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. పిల్లల్లో ఒత్తిడిని దూరం చేసి ధైర్యం చెప్పాలన్నారు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతరులతో పోలుస్తూ ఉంటారని.. ఇలాంటివి మానుకోవాలని ప్రధాని మోదీ కోరారు. ఇది వారిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. "తల్లిదండ్రులు తమ పిల్లల రిపోర్ట్ కార్డులను వారి విజిటింగ్ కార్డులుగా భావిస్తున్నారు. ఎవరినైనా కలిసినప్పుడు, ఎక్కడికైనా వెళ్లినప్పుడు వారి పిల్లల గురించి గొప్పగా చెబుతున్నారు. అది సరైనది కాదు" అని మోదీ అన్నారు. ప్రిపరేషన్ సమయంలో చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమంగా మెరుగవ్వాలని, తద్వారా పరీక్షలకు ముందే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావొచ్చని విద్యార్థులకు సూచించారు.

సవాల్‌నే చాలెంజ్ చేసే స్వభావం నాది

జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును చాలెంజ్ చేయడం తన నైజమని మోదీ చెప్పారు. సంక్షోభాలు తొలగిపోవడానికి, పరిస్థితులు మెరుగవడానికి వేచి చూడాలని చాలామంది నమ్ముతారని, అలాంటి వారు జీవితంలో ఏమీ సాధించలేరని అన్నారు. "పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయిలే అని ఎదురుచూస్తూ కూర్చోలేను. నేను ప్రతి సవాల్‌నూ సవాల్ చేస్తా. కొత్త విషయాలు నేర్చుకుంటా. సరికొత్త వ్యూహాలు రూపొందిస్తా. ఇది నా అభివృద్ధికి దోహదపడుతుంది" అని మోదీ చెప్పారు..

మొబైల్ వాడకం తగ్గించండి

మొబైల్ ఫోన్ చూస్తూ సమయాన్ని మర్చిపోకూడదని మోదీ విద్యార్థులకు సూచించారు. అవసరం ఉన్నంత వరకే ఫోన్ వినియోగించాలని, స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉండొద్దని చెప్పారు. తాను నిద్రకు ఉపక్రమించిన 30 సెకన్లలోనే గాఢనిద్రలోకి జారుకుంటానని, అలాగే విద్యార్థులు కూడా తమ నిద్రకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

'జేఈఈ' నా వల్ల కాదు

లేఖ రాసి 'కోటా'లో విద్యార్థిని ఆత్మహత్య

రాజస్థాన్‌లోని కోటాలో ఒత్తిడితో మరో విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. 'జేఈఈ' నావల్ల కాదు.. చదవలేకపోతున్నానంటూ లేఖ రాసి ఉరేసుకుంది. ఝులావర్ జిల్లాకు చెందిన నిహారిక(18) కుటుంబం మూడేళ్లుగా కోటాలో నివాసం ఉంటోంది. నిహారిక మంగళవారం జేఈఈ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ క్రమంలో ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. "అమ్మా, నాన్న నన్ను క్షమించండి. నేను ఓడిపోయాను. జేఈఈ నావల్ల కాదు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. నాకున్న చివరి ఆప్షన్ ఇదే" అంటూ లేఖ రాసి ఇంట్లోనే ఉరేసుకుంది.

14లక్షల మంది ఇండియన్లకు యూఎస్ వీసాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అమెరికా గతేడాది (2023) భారతీయులకు రికార్డు స్థాయిలో వీసాలను జారీ చేసింది. దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్‌లు అన్ని కేటగిరీలు కలిపి ఏకంగా 14 లక్షల వీసాలను జారీ చేశాయి. ఇందులో 1.40 లక్షల విద్యార్థి వీసాలు ఉన్నాయి. ఇది ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేనంత ఎక్కువని.. వరుసగా మూడో ఏడాది కూడా ప్రపంచ రికార్డు నెలకొల్పామని యూఎస్ ఎంబసీ పేర్కొంది. 2022తో పోల్చితే వీసా దరఖాస్తుదారుల్లో 60% పెరుగుదల నమోదైందని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మంది అమెరికా వీసా దరఖాస్తుదారుల్లో ఒకరు భారత్ నుంచే ఉన్నారని వివరించింది. ఉద్యోగ వీసాలకు కూడా అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని.. భారతీయులకు 3.80 లక్షల వీసాలు మంజూరు చేసినట్లు వివరించింది. గతేడాది రికార్డుస్థాయిలో వీసాల జారీ వెనక హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కీలక పాత్ర పోషించిందని యూఎస్ ఎంబసీ వర్గాలు పేర్కొన్నాయి.

అమెరికాలో భారతీయ విద్యార్థి దారుణ హత్య

న్యూయార్క్, జనవరి 29: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థి ఓ దుండగుడి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. నిరాశ్రయుడని జాలి చూపి.. తిండి పెట్టడమే విద్యార్థి చేసిన పాపమైంది. హరియాణాకు చెందిన వివేక్ సైనీ(25) అమెరికాలో ఇటీవల ఎంబీఏ పూర్తి చేశాడు. జార్జియా రాష్ట్రం లిథోనియాలోని చెవ్రాన్ ఫుడ్ మార్ట్‌లో పార్ట్ టైం క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ఆ స్టోర్‌కు నిరాశ్రయుడు, డ్రగ్స్‌కు బానిసైన జులియన్(53) వచ్చాడు. అప్పటి నుంచి అతడు రోజూ రాత్రి స్టోర్‌లోనే కూర్చుని ఉండేవాడు. బయట చలిగా ఉండటంతో సైనీ, ఇతర స్టోర్ సిబ్బంది కూడా వెళ్లిపోమని చెప్పలేదు. అయితే, ఈ నెల 16న అర్ధరాత్రి జులియన్‌ను బయటికి వెళ్లిపోవాలని సైనీ చెప్పాడు. కోపోద్రిక్తుడైన జులియన్.. వెనక నుంచి సైనీ తలపై సుత్తితో దాడి చేశాడు. దాదాపు 50సార్లు తల, ముఖంపై కొట్టాడు. దీంతో సైనీ అక్కడికక్కడే చనిపోయాడు.



యాదాద్రిభువనగిరి జిల్లాలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సర్పంచులు

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి


» పదవీ కాలాన్ని పొడిగించాలి.. యాదాద్రి జిల్లాలో సర్పంచుల ధర్నా

చౌటుప్పల్/చౌటుప్పల్ టౌన్, జనవరి 29: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, అలాగే పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు తమ పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతూ యాదాద్రిభువనగిరి జిల్లాలో సర్పంచులు ధర్నా చేపట్టారు. సోమవారం విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ, కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి లక్షలాది రూపాయలను తాము వడ్డీలకు తెచ్చి అప్పులపాలయ్యామని, దీంతో కొంతమంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 31న సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున పంచాయతీ ఎన్నికలు జరిగి, నూతన పాలకవర్గాలు కొలువుదీరే వరకు తమ పదవీ కాలాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు. సర్పంచుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ సమస్యలు పరిష్కరించాలని యాదయ్యగౌడ్ కోరారు.

శ్రీవారి భక్తులకు బంగారు మంగళసూత్రాలు

లక్ష్మీకాసులు కూడా..

విక్రయించాలని టీటీడీ నిర్ణయం



తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు బంగారు మంగళసూత్రాలు విక్రయించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. ధర్మప్రచారంలో భాగంగా బంగారు మంగళ సూత్రాలను తయారు చేసి, శ్రీవారిపాదాల వద్ద ఉంచి భక్తులకు విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమలలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, కొంతమంది సభ్యులతో కలిసి కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడారు. 5, 10 గ్రాముల బరువుతో దాదాపు నాలుగైదు డిజైన్లలో బంగారు మంగళసూత్రాల విక్రయాలు జరుగుతాయని, వీటితో పాటు లక్ష్మీకాసులను కూడా తయారు చేసి లాభాపేక్ష లేకుండా భక్తులకు విక్రయిస్తామన్నారు. గతంలో 32 వేల మందికి సామూహిక వివాహాలు జరిపినప్పుడు మంగళసూత్రాలను అందిస్తే ఏ ఒక్కరూ మతం మారలేదన్నారు. మత మార్పిళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,141.74 కోట్ల అంచనాలతో ఆమోదించినట్టు చైర్మన్ కరుణాకర రెడ్డి వెల్లడించారు.

మరికొన్ని నిర్ణయాలు

- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 26 స్థానికాలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో నూతన పోస్టులకోసం ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయం.
- ఆకాశగంగ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదం
- తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శ్రీపద్మావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌గా పేరు మార్పు
- నారాయణవనంలో అతి ప్రాచీనమైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్లు మంజూరు

నిండు జీవితాలు పల్టీ!

డివైడర్‌ను ఢీకొని ఆవలివైపు పడ్డ కారు.. పల్టీకొట్టిన ఆ కారును ఢీకొన్న లారీ

» 50 అడుగుల దూరం ఈడ్చుకెళ్లిన వైనం

» కారు నుజ్జునుజ్జు.. ఆరుగురి దుర్మరణం

» మృతుల్లో ఇద్దరు చిన్నారులు.. మిర్యాలగూడలో ఘోరం

» దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన





మహేశ్, జ్యోతి, రిషిత, మచ్చేందర్, మాధవి, లియాన్స్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: ఎంత ఘోర రోడ్డు ప్రమాదమో!? జరిగిన తీరు స్ఫురణకొస్తే ఒళ్లంతా గగుర్పాటు.. మనసంతా బాధతో కకావికలం!! రోడ్డుపై దూసుకెళుతున్న కారొకటి.. ఎదురుగా వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసేయత్నంలో డివైడర్‌ను ఢీకొట్టి ఆవలివైపు పల్టీకొట్టింది. ఆవైపున వెళుతున్న లారీ, ఆ పాల్టీకొట్టిన కారును ఢీకొట్టింది. ఇంత బీభత్సమైన ప్రమాదంలో కారు లోపల ఉన్న వారిలో ఎవరు గనక ప్రాణాలతో మిగులుతారు? కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి ఆరుగురూ మృత్యువాతపడ్డారు. మృతుల్లో ఇద్దరు పదేళ్లలోపు చిన్నారులుండటం మరీ విషాదం. ఆదివారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వద్ద ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది. మృతులంతా రెండు కుటుంబాలకు చెందిన వారు. దైవదర్శనం చేసుకొని మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి ఆరుగురూ తిరిగిరానిలోకాలకు వెళ్లడంతో బంధువులు కంటికీ మంటికీ ధారగా రోదిస్తున్నారు. నుజ్జునుజ్జయిన కారు.. ఛిద్రమైన మృతదేహాలు.. రోడ్డుపై నెత్తుటి మరకలతో ప్రమాదస్థలి బీభత్సంగా మారింది. డీఎస్పీ వెంకటగిరి వెల్లడించిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామానికి చెందిన చెరుపల్లి మహేశ్, ఆయన కుటుంబసభ్యులు, ఆయన తోడల్లుడు బొమ్మ మచ్చేందర్, ఆయన కుటుంబసభ్యులు, మహేశ్ మరో ఇద్దరు స్నేహితుల కుటుంబసభ్యులు రెండు వేర్వేరు కార్లలో ఈనెల 26న మిర్యాలగూడ నుంచి ఆధ్యాత్మిక, విహార యాత్రకు బయలుదేరారు. ఏపీ రాష్ట్రంలోని పెనుగంచిప్రోలు, విజయవాడ, మోపిదేవి, కోటప్పకొండ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. మచిలీపట్నం బీచ్‌లో కాసేపు సరదాగా గడిపి.. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. అద్దంకి-నార్కట్‌పల్లి మధ్యలో దామరచర్ల మండలం కొండ్రపోలు వద్ద దాబాలో భోజనం చేశారు. అనంతరం అక్కడి నుంచి అంతా బయలుదేరారు. నందిపాడులోని మహేశ్ ఇంటికి మరికొద్దిసేపట్లో చేరుకుంటారనగా ఘోరం జరిగింది. మిర్యాలగూడలోని కృష్ణమానస కాలనీ వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రోడ్డుపై మహేశ్, మచ్చేందర్ కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ముందుగా వెళ్తున్న ఓ లారీని మహేశ్ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ వేగంలోనే డివైడర్‌ను దాటుకొని పల్టీ కొట్టింది. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి ఏపీ రాష్ట్రం గుంటూరు వైపు వెళ్తున్న పొట్టులారీ, కారును వేగంగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహేశ్ (32), ఆయన భార్య జ్యోతి (30) కుమార్తె రిషిత(6), యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన ఆయన తోడల్లుడు మచ్చేందర్ (29), కుమారుడు లియాన్స్ (2)తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మచ్చేందర్ భార్య మాధవి (24)ని స్థానికుల సాయంతో పోలీసులు తొలుత ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మాధవి కూడా మృతిచెందింది. దైవదర్శనం కోసం వెళ్లిన రెండు కుటుంబాలు విగతజీవులుగా మారడాన్ని స్థానికులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వస్థలాలకు తరలించగా, రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన ఎర్రబంగారం

» ఒక్కరోజే సుమారు 50 వేల బస్తాల పంట రాక

ఖమ్మం మార్కెట్, జనవరి 29: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం(మిర్చి) పోటెత్తింది. సోమవారం ఒక్కరోజే సుమారు 50 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్ ఒక్కరోజులో ఇంత భారీ మొత్తంలో పంట మార్కెట్‌కు రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌లో తేజా రకం డీలక్స్ ఎండు మిరపను క్వింటాలు రూ.21,300గా జెండాపాట ధర నిర్ణయించారు. అయితే వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు కనిష్ఠంగా రూ.14,000కు, నమూనా రకాలను క్వింటాలు రూ.19,000 వరకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి రకాలనుబట్టి క్వింటాలు రూ.7,500 నుంచి రూ.12,000 వరకు కొనుగోలు చేశారు.

ఏసీబీకి చిక్కిన ఖమ్మం పోలీస్‌స్టేషన్ రైటర్

ఖమ్మంక్రైం, జనవరి 29: ఓ కుటుంబం ఆర్థిక వివాదం విషయంలో లంచం తీసుకుంటూ ఖమ్మం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో రైటర్(హెడ్‌కానిస్టేబుల్)గా విధులు నిర్వహిస్తున్న పి. కోటేశ్వరరావు సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఖమ్మం నగరానికి చెందిన రామారావు ఆయన కుమారులు విజయ్, విష్ణులకు, కుమార్తెకు మధ్య ఆర్థిక వివాదం నడుస్తోంది. గతేడాది రామారావు కుమార్తె తండ్రితో పాటు అతడి కుమారులపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదైంది. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించగా వారికి 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు రామారావు, అతడి కుమారులు టూటౌన్ స్టేషన్ రైటర్ కోటేశ్వరరావును కలవగా రూ.50వేలు డిమాండ్ చేశారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు రూ.50వేలు లంచం తీసుకుంటుండగా కోటేశ్వరరావును పట్టుకున్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ రమేష్ విలేకరులకు వెల్లడించారు.

ఆ సవరణలతో సహకార రంగం నిర్వీర్యం

» సహకార ధర్మ పీఠం వ్యవస్థాపకుడు భూమయ్య

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సహకార రంగంలో తీసుకొచ్చిన చట్ట సవరణలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేలా ఉన్నాయని సహకార ధర్మ పీఠం వ్యవస్థాపకుడు సంబారపు భూమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సవరణలపై ప్రజలను చైతన్యపరిచేందుకు, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న సెక్షన్లను ఉపసంహరించుకునేందుకు 2023 డిసెంబరు 28 నుంచి 2024 మార్చి 24 వరకు సహకార్ ధర్మ్ రక్షక్ మహాభారత్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో 60 శాతం ప్రజల స్వతంత్ర ఆర్థిక వ్యవస్థకు మూలమైన సహకార సంస్థలు కేంద్రం చేసిన సవరణల వల్ల ప్రైవేటు రంగం పాలయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేజీబీవీ, సమగ్ర శిక్ష కాంట్రాక్టు .. సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలి: యూటీఎఫ్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా శాఖలో కేంద్ర ప్రాయోజిత పథకం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలను అమలుచేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, సీనియర్ నాయకుడు మాణిక్‌రెడ్డి సోమవారం డిప్యూటీ సీఎంను కలుసుకుని వినతి పత్రాన్ని సమర్పించారు. వచ్చే నెలలో జరగనున్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశంలో సిబ్బందికి మినిమం టైం స్కేల్, కనీస వేతనం అమలు చేసే విధంగా ప్రతిపాదనలను సమర్పించాలని కోరారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు కూడా కనీస వేతనం అమలు చేయాలన్నారు. ట్రెజరీలో ఆమోదం పొంది ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని అభ్యర్థించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

» మాదిగ హక్కుల దండోరా

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం మాదిగల ఊపిరి అయిన ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర మాదిగ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో ఉషా మెహ్రా కమిషన్, రామచంద్ర కమిషన్ ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన నివేదికలను అప్పటి యూపీఏ ప్రభుత్వం అంగీకరించిందని.. ఆ నివేదిక ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సరిగ్గా ఎన్నికలకు 70 రోజుల ముందు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

ఐఆర్ఆర్ కేసులో

జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

చంద్రబాబు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఎలైన్‌మెంట్ వ్యవహారంలో జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆంధ్ర హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. 2022 నవంబరు 7న రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన ఇలాంటి అప్పీళ్లను కోర్టు తిరస్కరించిన విషయాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గుర్తుచేసింది. అయితే హైకోర్టు తప్పుడు కారణాలతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని ఏపీ ప్రభుత్వ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్, న్యాయవాది మహ్‌ఫూజ్ నజ్కీ వాదనలు వినిపించారు. చంద్రబాబుతో పాటు ఆయన సహచరులిద్దరు దర్యాప్తును తప్పించుకుని తిరుగుతున్నారని, మాజీ సీఎం దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారని రంజిత్ కుమార్ తెలిపారు. సీఐడీ అధికారులను చంద్రబాబు కుమారుడు, ఆయన సహచరులు బెదిరింపులకు గురిచేశారని.. తాము అధికారంలోకి వస్తే అంతు చూస్తామన్నారని పేర్కొన్నారు. ఉదయం కేసు విచారణ ప్రారంభం కాగానే... జస్టిస్ ఖన్నా రాష్ట్రప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. '17ఏ సెక్షన్ ఈ కేసుకు కూడా వర్తిస్తుందా? 2014లో వచ్చిన ఆరోపణలివి. కానీ 2018లో దర్యాప్తు ప్రారంభమైంది. ఒకవేళ 17ఏ వర్తింపజేస్తే సముచిత అనుమతి తీసుకోకుండా కేసు పెట్టినట్లు అవుతుంది' అని పేర్కొన్నారు. రంజిత్‌కుమార్ స్పందిస్తూ.. చంద్రబాబుపై సెక్షన్ 420 కింద మోసం సహా ఐపీసీ ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. 'ఇక్కడ సెక్షన్ 420 ఎలా వర్తిస్తుంది? అలా కుదరదు. దానిని వర్తింపజేయడం మీకూ ఇబ్బందే' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. వేరే ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా ప్రస్తావించి.. వివరాలను సమర్పించాలని కోరారు. ఐఆర్ఆర్ కేసులో తొలుత చంద్రబాబుకు నోటీసు జారీచేయాలని ధర్మాసనం భావించింది. అయితే ఇదే కేసులో మాజీ మంత్రి పి.నారాయణ, ఇతర నిందితుల ముందస్తు బెయిల్ రద్దుచేయాలని రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ)ను 2022 నవంబరు 7న సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఒకే ఎఫ్ఐఆర్‌లో రాష్ట్రప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించినప్పుడు ఆదే తీర్పును తామెందుకు అనుసరించకూడదని ధర్మాసనం అడుగగా.. ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సమాధానం చెప్పలేకపోయారు. 'అవే ఆదేశాలను ఈ కేసులో ఎందుకు అనుసరించకూడదు? అదే ఆరోపణ.. అదే ఎఫ్ఐఆర్.. అవే సత్యాలు.. ఇప్పటికే ఓ ఎస్ఎల్‌పీని రద్దుచేసినందున.. తాజా పిటిషన్‌ను అనుమతించలేం. నోటీసు జారీచేయం' అని తేల్చిచెప్పింది. జగన్ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే తమ ఆదేశాలు దర్యాప్తును ఏ మాత్రం ప్రభావితం చేయవని.. హైకోర్టు వ్యాఖ్యలతో సంబంధం లేకుండా దర్యాప్తు సంస్థ విచారణను కొనసాగించుకోవచ్చని తెలిపింది. ప్రతివాది (చంద్రబాబు) దర్యాప్తునకు సహకరించకపోతే బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం దిగువ కోర్టులను ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళ

మెట్టింటి వారు వేధిస్తున్నారు... రక్షించండి

» జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట చంటిబిడ్డతో మహిళ నిరసన

» భర్తతో పాటు అతని కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గద్వాల న్యూటౌన్, జనవరి 29: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తతో పాటు అతని కుటుంబసభ్యులు తనని తీవ్రంగా వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట చంటి బిడ్డతో నిరసన చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌కు చెందిన ఓ మహిళ 2023లో ఉండవల్లికి చెందిన సురేశ్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఓ పాప జన్మించింది. అయితే కొన్ని రోజుల నుంచి సురేశ్‌తో పాటు అతని కుటుంబసభ్యులు తనను తీవ్రంగా వేధిస్తున్నారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తనకు తెలియకుండా రూ. 15 లక్షలకు తన తండ్రితో సెటిల్ చేసినట్లు తెలిసిందని పేర్కొంది. ఇటీవలే మామ, బావ నుంచి తనకు లైంగిక వేధింపులు కూడా ఎదురవుతున్నట్లు తెలిపింది. ఆదివారం భర్త.. అతని కుటుంబసభ్యులు తనపై దాడి చేసి ఇంటినుంచి బయటకు గెంటివేశారని, రాత్రి మొత్తం చంటిబిడ్డతో చలిలో ఇంటిబయటే కూర్చున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. అందుకే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చానని, అయితే ఆయన కూడా తన బాధను విని ఎస్పీ కార్యాలయం దగ్గరకు వెళ్లమని చెప్పారని తెలిపింది. అక్కడ న్యాయం జరగకనే మీ దగ్గరకు వచ్చానని చెప్పినా వినిపించుకోలేదని, అందుకే నిరసన తెలుపుతున్నట్లు వెల్లడించింది. దాదాపు గంటకు పైగా అలాగే బయట కూర్చుండిపోయింది. తనకు న్యాయం జరగకుంటే చంటిబిడ్డతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో ఈ విషయానికి సంబంధించి పూర్తి విచారణ చేయాల్సిందిగా అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఆరు గ్యారెంటీలు విప్లవాత్మక నిర్ణయం

» ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ప్రశంసలు



ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్‌తో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు చాలా బాగున్నాయని భారత్‌లో ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ప్రశంసించారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న హైకమిషనర్ సోమవారం బెంగళూరులోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ హిలరీతో కలిసి విహబ్ కార్యాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి ప్రస్తావించారు. ఈ గ్యారంటీలు విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి ప్రశంసించారు. ఈ పథకం మహిళా సాధికారతకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకున్న అనువైన వాతావరణం గురించి వారికి మంత్రి వివరించారు. రాష్ట్రానికి తమ దేశం నుంచి పెట్టుబడులను ప్రోత్సహించడానికి చొరవ తీసుకుంటామని ఫిలిప్ గ్రీన్ తెలిపారు. కాగా విహబ్‌తో ఆస్ట్రేలియా ప్రభుత్వం భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వెనుకబడినవర్గాల మహిళలు, ఎల్జీబీటీఐక్యూ సమూహానికి స్టార్ట్-ఎక్స్ పేరుతో 13వారాల ఆంత్రప్రెన్యూర్‌షిప్ శిక్షణ నిర్వహించనున్నారు.

2.32 కోట్ల హుండీ ఆదాయం

» 25రోజుల్లో యాదాద్రికి సమకూరిన మొత్తం



లక్ష్మీనృసింహుల కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 29: యాదగిరిగుట్ట ప్రధానాలయ ఖజానాకు 25రోజుల్లో రూ. 2.32కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. ఈ నెల 4నుంచి 28వ తేదీవరకు నృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ 2,32,22,689 నగదు, 230 గ్రాముల మిశ్రమ బంగారం, 4.420 కిలోగ్రాముల మిశ్రమ వెండి సమకూరింది. విదేశీ కరెన్సీ రూపంలో 593 అమెరికన్ డాలర్లు, 65 యూఏఈ దిర్హామ్స్, 65 ఆస్ట్రేలియా డాలర్స్, 220 కెనడా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 122 సౌత్ ఆఫ్రికన్ రాండ్లు, 15 యూరప్ యూరోలు, 400 ఒమన్ రియాల్, 2 మలేషియా రింగిట్స్, 23 కతార్ రియాల్, 100 థాయిలాండ్ భాట్, 5 న్యూజిలాండ్ డాలర్లు, 1000 డెన్మార్క్ డ్యానిష్ క్రోన్, 10,00,000 వియత్నాం డాన్లు హుండీల్లో కానుకల రూపంలో రావటంతో ఆలయ ఖజానాలో జమచేశామని దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి హోమం, నిత్యతిరు కల్యాణోత్సవ పర్వాలు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజ లు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ప్రధానాలయంలో కొలువుదీరిన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, ముఖమండపంలోని స్ఫటి క మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకం చేశారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. రూ.2,85,407 ఆదాయం సమకూరింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పల్టీపుత్రుడు

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ని గిట్టనివారంతా 'పాటలీపుత్రం పల్టీ-పుత్రుడు' అంటారు గానీ, ఆయన దగ్గర ఏదో సమ్మోహన శక్తి ఉంది. ఆయన ఫిరాయించినప్పుడల్లా కూటములు ప్రేమగా కౌగలించుకుంటాయి, అప్పటివరకూ శత్రువుగా చూసిన పార్టీలు జతచేరతాయి. ఆయన అసలు రంగు ఏమిటోగానీ, ఎప్పటిలాగానే ఆయన మళ్ళీ రంగు మార్చాడు. బీజేపీతో చేయికలిపి, ఎన్డీయే తీర్థం తీసుకొని తొమ్మిదోసారి బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. పదేళ్ళలో ఐదోసారి గోడదూకిన ఆయనను ఊసరవెల్లితో పోల్చుతున్నారు కొందరు. కానీ, నితీశ్‌కు తలుపులు మూసేశామని, ఎప్పటికీ అవి తెరుచుకోవని స్వయంగా అమిత్‌షాయే అప్పట్లో ప్రకటించారు. ఎవరికీ ఎప్పటికీ శాశ్వతంగా తలుపులు మూతబడి ఉండవని బిహార్ బీజేపీ నాయకులు రెండురోజుల క్రితమే ఆ వ్యాఖ్యను సరిదిద్దారు.

చావనైనా చస్తాను కానీ, మళ్ళీ బీజేపీతో చేయికలపను అని నితీశ్‌కుమార్ రెండునెలలక్రితం చేసిన వ్యాఖ్య కూడా ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తోంది. ఇప్పుడు బీజేపీతో చేయికలపడం ద్వారా రాజకీయంగా ఆయనకు జరిగేది కూడా ఇదేనని కొందరి వాదన. మహాగఠ్బంధనంలో ఉండగా బీజేపీమీద ఆయన చేయని వ్యాఖ్యలేదు, యుద్ధం లేదు. విపక్షనాయకుల్లో అంతకఠినంగా కమలాన్ని చిత్రవధచేసిన నాయకుడు కూడా ఎవరూ ఉండకపోవచ్చు. ఆ మాటలన్నీ ఏట్లోపారేసి ఆయన వచ్చాడు సరే, బీజేపీ మళ్ళీ ఎందుకు ఆలింగనం చేసుకుంది? అన్నది ప్రశ్న. 'ఇండియా' కూటమిలో ఆయనకు సముచితస్థానం దక్కలేదని, కూటమి పెద్దగా ఆయన పేరు రాకుండా కాంగ్రెస్ కుట్రపన్నిందని నితీశ్ మద్దతుదారులు అంటున్నారు. అవినీతికి మారుపేరైన ఆర్జేడీతో అధికారం పంచుకోవడం వల్ల తమ సుశాసన్‌బాబుకు చెడ్డపేరు వస్తున్నదని, లాలూ కుమారులు ఇద్దరూ చక్రం తిప్పుతున్నారని, ముఖ్యమంత్రికి తెలియకుండా నిర్ణయాలు జరిగిపోతున్నాయని, ఇది నితీశ్‌కు అవమానకరంగా ఉన్నదని వారివాదన. ఇప్పుడు బీజేపీతో చేయికలిపి నితీశ్ మరింత స్వేచ్ఛగా ఉండగలరా? చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి తన ఓట్లకు బీజేపీ చిల్లుబెడుతోందని గతంలో విమర్శించిన నితీశ్ ఇప్పుడు ఆయనతోనే కలిసి పనిచేయబోతున్నారు. తనకు వెన్నుపోటు పొడిచిన జితిన్‌రామ్ మాంఝీ కూడా మరోపక్కన ఉన్నాడు. లోక్‌సభ ఎన్నికల్లో తగినన్ని స్థానాలు సాధించడానికి బిహార్ బీజేపీకి అవసరం. నలభైస్థానాలున్న బిహార్‌లోనే కాదు, ఎనభైస్థానాలున్న యూపీలోనూ ఓబీసీలు, దళితుల్లోని నిమ్నవర్గాల ఓట్లను దృష్టిలో పెట్టుకొని నితీశ్‌ను ఆలింగనం చేసుకుంది. గోడ గెంతడానికి ఇండియా కూటమినో, ఆర్జేడీనో నితీశ్ తిట్టిపోయవచ్చు గానీ, ఇప్పుడు ఆయన పదవి పూర్తిగా బీజేపీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివుంది. తెప్పతగలేయడంలోనూ, షిండేలను సృష్టించడంలోనూ ఆ పార్టీ నాలుగాకులు ఎక్కువే చదివింది. లోక్‌సభ ఎన్నికల్లో తన అవసరం తీరిపోయాక నితీశ్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించవలసిన అవసరం దానికి లేదు. 2025 బిహార్ ఎన్నికలవరకూ తనపార్టీ ముఖ్యమంత్రికోసం ఎదురుచూడాల్సిన గతి దానికి పట్టలేదు.

నూటయాభైస్థానాలనుంచి క్రమంగా యాభైస్థానాలకు పడిపోయి, గత అసెంబ్లీ ఎన్నికల తరువాత రాష్ట్రంలో మూడవ రాజకీయశక్తిగా మిగిలిపోయిన నితీశ్ పార్టీ ఈ గోడదూకుడు తరువాత మెరుగుపడుతుందా? ఎన్డీయే లాభపడుతుందేమో కానీ, నితీశ్ పార్టీ మరింత శుష్కించవచ్చునని కొందరి జోస్యం. ఆయన నిష్క్రమణతో ఇండియా కూటమి పరువుపోయింది. పర్యటనలతో సమావేశాలతో విపక్షాలను గుదిగుచ్చి కూటమికి కాస్తంత ఊపునిచ్చిన ఆయన దానికి దూరంకావడం బీజేపీకి ముఖ్యం. ఇండియా కూటమి సైద్ధాంతికంగా ఎంత బలహీనమైనదో, ఆయా ప్రాంతీయపార్టీల నాయకులు ఎంతటి స్వార్థపరులో, తమ రాజకీయ మనుగడకోసం వెన్నుపోట్లకు సైతం ఎలా సిద్ధపడతారో నితీశ్ ఉదాహరణగా నిరూపించవచ్చు. నాలుగుసార్లు భేటీ అయి, నితీశ్‌తో వేదిక పంచుకున్నప్పటికీ కాంగ్రెస్ ఆయనను పూర్తిగా నమ్మలేదని ఇటీవలి దాని చర్యలు చెబుతున్నాయి. అయినా, కూటమికి తగిలిన ఈ పెద్ద ఎదురుదెబ్బనీ, ఆ పాపాన్నీ భరించకతప్పదు. లాలూపార్టీ నితీశ్‌ను ఎందుకు, ఏ పరిస్థితుల్లో నమ్మిందో, నమ్మినట్టు నటించిందో తెలియదు కానీ, ఇప్పుడు దానికి నితీశ్ భారం తొలగిపోయింది. మిగతా సగం కాలమైనా నేరుగా ఏలాలన్న దాని ఆశ నెరవేరలేదు కానీ, గత ఎన్నికల్లో అత్యధికస్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ తన మిత్రులతో కలిసి బలంగా పోరాడవచ్చు. ప్రజలు పాపపుణ్యాలను నిర్ణయిస్తారు, గుణపాఠాలూ నేర్పుతారు.


కర్పూరీ బాటలో మోదీ

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రతి ఏడాదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తున్న 'పద్మ' పురస్కారాలకు వన్నె లభిస్తోంది. సమాజానికి అనితరమైన సేవలు చేస్తున్న, నిత్యం ప్రజల మధ్య గడుపుతున్న అణగారిన వర్గాలకు చెందిన వారైనప్పటికీ తలెత్తుకుని జీవిస్తున్న ఎందరో గుర్తింపు పొందని మహానుభావులకు 'పద్మ' పురస్కారాలు లభిస్తున్నాయి. వీరితో ఏదీ ఆశించకుండా నిస్వార్థంగా ప్రజలకు తమ వంతు సేవలు చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులనూ ప్రభుత్వం గుర్తిస్తోంది. పురుషస్వామ్య సమాజంలో అన్ని ఆటుపోట్లను తట్టుకుని మహిళా సాధికారికతకు నిజమైన సంకేతంగా నిలుస్తున్న స్త్రీమూర్తులను కూడా మోదీ ప్రభుత్వం గౌరవిస్తోంది. మహిళ అయినప్పటికీ మావటి వృత్తిని చేపట్టి మహా గజేంద్రాన్ని లొంగదీసుకోగల అస్సాంకు చెందిన పర్బతి బారువా, మావోయిస్టుల దురాగతాలను పట్టించుకోకుండా ఛత్తీస్‌గఢ్‌లో అణగారిన బిర్హోర్, పహాడీ కోర్వా ఆదివాసీల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన జాగేశ్వర్ యాదవ్, హర్యానాలో నిరాశ్రయులు, అనాథలు, మహిళలు, దివ్యాంగుల జీవితాలను మెరుగుపరిచేందుకు తోడ్పడుతున్న గుర్వీందర్ సింగ్, దుఖు మాజీ, దక్షిణ అండమాన్‌లో సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసిన కె. చెల్లమ్మ, అరుణాచల్‌ప్రదేశ్‌లో మూలికా వైద్యంలో నైపుణ్యం సంపాదించి పదివేల మందికి వైద్య చికిత్సనందించిన యానుంగ్ జామో లెగో, కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా జెను కురుబా ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సోమన్న, మహారాష్ట్రలో అంతర్జాతీయ మల్లకంభం క్రీడను పునరుద్ధరించి శిక్షణను అందిస్తున్న ఉదయ్ విశ్వనాథ దేశ పాండే, బిహార్‌లో సామాజిక అస్పృశ్యతను అధిగమించి, గోండా చిత్రకళకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చి అనేక దేశాల్లో ప్రదర్శనలు జరిపిన దుసద్ జాతికి చెందిన భార్యాభర్తలు శాంతిదేవి పశ్వాన్, శివన్ పశ్వాన్‌తో పాటు అనేకమంది కళాకారులు, విద్వాంసులు ఈ ఏడాది భారత ప్రభుత్వ ఉన్నత పురస్కారాలకు ఎంపికయ్యారు. నిత్యం ప్రజల మధ్య గడిపే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్ లభించడం ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయి.



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 'పద్మ' పురస్కారాలంటే పైరవీకార్లు, అస్మదీయులను అందలమెక్కించడమనే ప్రచారం ఉండేది. దానివల్ల 'పద్మ' పురస్కారాల విలువ తగ్గింది. కాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పురస్కారాల విలువను పెంచారు. ఈ ఏడాది బిహార్‌కు చెందిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం కూడా ఇలాంటిదే. ఠాకూర్—నాయీ వంటి అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన కర్పూరీ ఠాకూర్ మరణించి 36 సంవత్సరాలైనప్పటికీ ఈ దేశంలో సామాజిక న్యాయానికి నాంది పలికిన నేత అన్న విషయాన్ని ప్రధానమంత్రి మరిచిపోలేదు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ గురించి తొలుత ఆలోచించింది కర్పూరీ ఠాకూరే. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన విషయం అడుగడుగునా గుర్తించి, బలహీనవర్గాల పరిస్థితి ఎంతో దుర్భరంగా ఉన్న సమయంలో వారి గురించి ఆలోచించి సాహసోపేత చర్యలను చేపట్టిన కర్పూరీ ఠాకూర్ భారత రాజకీయాలకు చేసినంత సేవ మరే నాయకుడూ చేపట్టలేదు. ఆయన ఆదర్శాల ఆధారంగానే తాను తన ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నట్లు మోదీ బహిరంగంగా ప్రకటించారు. ఇవాళ వెనుకబడిన వర్గాలకు తాము పరిరక్షకులమని, కుల జనగణన చేపట్టి వారిని ఉద్ధరిస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు తమ ఆరు దశాబ్దాల పాలనలో కర్పూరీ ఠాకూర్‌ను ఎందుకు మరిచిపోయారు? కర్పూరీ ఠాకూర్ వల్ల రాజకీయాల్లో పైకి ఎదిగి, తాము వారి శిష్యులమని చెప్పుకుని కీలక పదవులు చేపట్టి, చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటున్న నేతలు ఆయనను ఎందుకు గౌరవించలేదు?



వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ గురించి తొలుత ఆలోచించింది కర్పూరీ ఠాకూరే. ఆయన ఆదర్శాల ఆధారంగానే తాను ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నట్లు మోదీ బహిరంగంగా ప్రకటించారు. ఇవాళ వెనుకబడిన వర్గాలకు తాము పరిరక్షకులమని, కుల జనగణన చేపట్టి వారిని ఉద్ధరిస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు తమ ఆరు దశాబ్దాల పాలనలో కర్పూరీ ఠాకూర్‌ను ఎందుకు మరిచిపోయారు?

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సమాజంలో తీవ్రంగా వెనుకబడిన వర్గాల గురించి యోచిస్తోంది. బిహార్, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఆ వర్గాల్లో రాజ్యాధికారం లభించని వెనుకబడిన వర్గాల నేతలను బీజేపీ అక్కున చేర్చుకుంది. బిహార్‌లో కుల జనగణన జరిపి 36 శాతం అత్యంత వెనుకబడిన వర్గాల వారే ఉన్నారని తేల్చారు. కాని ఆ రాష్ట్రంలో గత కొన్ని దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల్లో కొందరు మాత్రమే అధికంగా ప్రయోజనం పొందారు. రిజర్వేషన్ వ్యవస్థ సామాజిక న్యాయం కొంతవరకు మాత్రమే చేయగలదు. కాని వారికి రిజర్వేషన్ మాత్రమే కాకుండా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉన్నదని మోదీ మాత్రమే గుర్తించారు. ఎందుకంటే ఆయన కూడా కర్పూరీ ఠాకూర్ లాగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకుడు. వెనుకబడిన వర్గాలు చదువుకోవడం ద్వారానే వారు జీవితంలో పైకి ఎదగగలరని కర్పూరీ ఠాకూర్ భావించారు. మాతృభాషలోనే వారు చదువుకునేందుకు ప్రోత్సాహం కల్పించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కూడా పరోక్షంగా ఆయన రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. వెనుకబడిన వర్గాలకే కాక, షెడ్యూల్డు కులాలు, ఆదివాసీలకు కూడా ఆయన చేయూతనిచ్చారు. మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా తొలుత రిజర్వేషన్ కల్పించింది ఆయనే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ దిశగా అనేక చర్యలు చేపట్టారు. అనేకమంది ఓబీసీ నేతలను ముఖ్యమంత్రి పదవుల్లో నియమించారు.

అంతేకాదు కర్పూరీ ఠాకూర్ ఈ దేశ రాజకీయాల్లో బలహీనవర్గాలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని గుర్తించి తిరుగుబాటు చేసిన తొలి తరం నాయకుల్లో ఒకరు. తొలుత సోషలిస్టు పార్టీ నుంచి, తర్వాత జనతా పార్టీ నుంచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. రెండుసార్లూ ఆయనను ముఖ్యమంత్రి చేసిన సంయుక్త విధాయక్ దళ్‌కూ, జనతా పార్టీకి బీజేపీ పూర్వరూపమైన జనసంఘ్ మద్దతునిచ్చింది. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత, ఆయన అండదండలతో నాయకులైన వారు నిర్విణ్ణులయ్యారు. కర్పూరీ ఠాకూర్ నా రాజకీయ సైద్ధాంతిక గురువు. ఆయనకు భారతరత్న ఎప్పుడో రావాల్సి ఉంది.. అని అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆర్జేడీ నేత లాలూప్రసాద్ యాదవ్ అన్నారు. సామాజిక న్యాయానికి కాగడా చూపిన జననాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, బీజేపీకి కృతజ్ఞతలు చెబుతున్నాను. ఆయనకు కాంగ్రెస్ హయాంలో భారతరత్న రాలేదు.. అని జేడీ(యు) నేత ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ అన్నారు. మరి లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్.. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఎందుకు ఇప్పించలేకపోయారు? తాను యూపీఏ హయాంలో నాలుగుసార్లు కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని లేఖ రాశానని ప్రకటించిన నితీష్‌కుమార్ ఇప్పుడు కాంగ్రెస్, ఆర్జేడీలతో చేతులు కలిపినందుకు పశ్చాత్తాపపడి ఆ పార్టీల దుష్ట కౌగిలి నుంచి తప్పించుకొని మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. దేశంలో ఇలా చాలామంది నేతలకు జ్ఞానోదయం కలుగుతోంది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ప్రజాస్వామ్య దేవుడు కాదు, రాముడే సర్వోన్నతుడు!

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ. భారతావని అంతా రామమయం. కాషాయ జెండాలు రెపరెపలాడుతూ కనిపించాయి, రాముడు, నరేంద్రమోదీ, స్థానిక బీజేపీ నాయకుల చిత్రాలతో పోస్టర్లు ఎల్లెడలా వెలిశాయి. జై శ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. భారతదేశ చరిత్రలో ఇదొక విలక్షణ సందర్భం. దానితో పూర్తిగా మమేకమైనవారు లేదా విభేదించే వారి సంగతి అలా ఉంచి, ఒక భిన్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి ప్రస్తావిస్తాను. జీవితం, సంప్రదాయం, మనుగడ గురించి నాకు విలువైన విషయాలు నేర్పిన ఆ ప్రాణప్రతిష్ఠ 49 ఏళ్లక్రితం ఆంధ్రప్రదేశ్‌లోని ఒక కుగ్రామంలో జరిగింది.

జూలై 1975 మా అమ్మ సినీనటి జమున, మా నాన్న విజయవాడ సమీపంలోని దుగ్గిరాల గ్రామానికి తమ ఆర్థిక సహకారంతో నిర్మించిన నవగ్రహ ఆలయం ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు. నన్నూ తీసుకువెళ్లారు. పిల్లవాడిని కావడంతో అది నాకు జ్ఞాపకం కూడా లేదు. కానీ, కొద్ది రోజుల క్రితం నేను మళ్లీ దుగ్గిరాలకు నా కుటుంబంతో వెళ్లాను. దివంగతురాలైన మా అమ్మ బాల్య స్నేహితురాలని పలుకరించి, ఆమెకు నా కుటుంబాన్ని చూపించడానికి. అమ్మ చదువుకున్న స్కూలు, ఉన్న ఇల్లుతో పాటు ఆ నవగ్రహ ఆలయాన్ని కూడా మేం సందర్శించాం. ఆలయ కుడ్యం పక్కన శిలాఫలకంపై మా తల్లిదండ్రుల పేర్లు ఇప్పటికీ ఉన్నాయి. ఇతర దాతలు తమ వంతు విరాళాలు ఇవ్వకపోతే ఆ సొమ్మును మా తల్లిదండ్రులే ఇచ్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయించారని మా అమ్మ బాల్య స్నేహితురాలు చెప్పారు. మా అమ్మానాన్న అభ్యుదయ ఆలోచనాపరులా కాదా అన్నది నాకు ఇదమిత్థంగా తెలియదు. బహుశా కాకపోవచ్చు. అయితే దుగ్గిరాల పట్ల తమ అభిమానాన్ని చాటుకునేందుకు ఆ గ్రామ జీవితంలో అంతర్భాగమైన ఒక కార్యాన్ని వారు నిర్వర్తించారు. మరి, ఆస్పత్రులు, పాఠశాలలు, పరికరాల మాటేమిటి? అటువంటి లౌకికసేవల్లో కూడా అమ్మ ఎంతోకొంత చేయివేసింది. ఆమె బాల్య స్నేహితురాలు అవన్నీ చేసి, ప్రస్తుతం ఒక ధాన్యకేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నారు.

వ్యక్తుల ఉదారత, వితరణ శీలత, మానవత దృక్పథాన్ని నేను గౌరవిస్తాను, అభిమానిస్తాను. అయితే మన ఆధునిక సంవేదనలు, 'శాస్త్రీయ దృష్టి' ఎందుకు మనలను ఆలయాలు నిర్మించేవారిని, ఆరాధనలకు, ప్రాణప్రతిష్ఠలకు నిధులు సమకూర్చేవారిని తిరోగామిశక్తులుగా, అవన్నీ నిరుపయోగమైన పనులుగా ఎందుకు చూస్తున్నాయి? దుగ్గిరాల ఆలయాన్ని, నా తల్లిదండ్రులు అందించిన సహాయాన్ని ఆచరణాత్మక దృక్కోణం నుంచి చూస్తే, ఆ కోవెల వేలాది ప్రజల జీవితాలకు కేంద్రంగా ఉంది. నిరుద్యోగులు తమకు ఉద్యోగం వచ్చేలా చూడాలని ఒక గ్రహాన్ని పూజిస్తారు. దీర్ఘకాలిక రుజాగ్రస్తులు ఉపశమనం కోసం మరో గ్రహానికి నైవేద్యం సమర్పిస్తారు; యువ దంపతులు మంచి బిడ్డలకోసం ప్రార్థిస్తారు. దైవాలు, గ్రహాలు (విజ్ఞాన శాస్త్రం కూడా) తమ కోరికలు నెరవేరేందుకు తోడ్పడతాయన్నది వారి నమ్మకం. మా అమ్మా నాన్నా 1975లో కేవలం ప్రాణ ప్రతిష్ఠ కోసమే అంతదూరం వెళ్లారు. మా అమ్మ స్నేహితురాలు అదే విషయాన్ని నొక్కి చెప్పారు. నా తల్లిదండ్రులు ఇప్పుడు లేకపోవచ్చు కానీ, క్రతువులు, విగ్రహాల రూపంలో వారి దృఢ విశ్వాసం ఒక కొండలా నిలిచిపోయింది. ఒక దైవ సంకల్పపు దృఢత్వాన్నీ సంతరించుకున్నది. మన ముందుతరాల్లో జీవించిన వ్యక్తుల జీవితాలూ, వారు నిర్వర్తించిన కార్యాలూ తరం తరం మనకు సంక్రమిస్తూ వస్తాయి. అందుకే మన కుటుంబ పూర్వీకులను, మనలను కన్న ఊరిలో ఎన్నో నిండు జీవితం జీవించి వెళ్లిపోయిన వారిని గుర్తు చేసుకుంటాం. మన బతుకుపోరులో వారినుంచి స్ఫూర్తి పొందుతాం. వ్యక్తులలానే సమాజాలూ, దేశాలూ, జాతులూ, నాగరికతలూనూ.



చెప్పవచ్చిన దేమిటంటే, మన జాతి, నాగరికత ఇప్పుడు అదే విధమైన భావోద్వేగంలో ఉన్నది. ఒక విలక్షణ స్ఫూర్తిని ఆవాహన చేసుకొంటూ, వర్తమాన సమస్యలను అధిగమించేందుకు అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరంతో శక్తిని పొందుతోంది. పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తును ఆవాహన చేసుకొంటోంది. వ్యక్తుల జీవితాలతో పోల్చినప్పుడు ఒక జాతి జీవనం సువిశాలమైనది. అనంత విషయాలు అందులో మిళితమై ఉంటాయి. ఈ దృష్ట్యా ఇప్పుడు మనలను ఒక కొత్త శక్తి చైతన్యీకరిస్తున్నది.

ఇక, రామమందిర నిర్మాణంతో కొందరికి రాజకీయప్రయోజనాలు దక్కలేదా? అనే ధర్మ సందేహం మీ మనసులను తొలిచివేస్తుందా? ఈ రోజుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం బహిరంగ ప్రదేశాలలో విగ్రహ ప్రతిష్ఠలు జరపనిదెవరు? మిమ్ములను విభ్రాంతపరిచే స్థాయిలో స్మారకాలను నిర్మించనిదెవరు?

గత కొద్ది రోజులుగా తెలుగు భూమిలోని పలు ప్రఖ్యాత దేవాలయాలను నేను సందర్శించాను. తెలుగు ప్రజల్లో దైవ భక్తికి కొదవలేదు. నేను వెళ్లిన ప్రతీ చోటా అశేష భక్త జనసందోహాన్ని చూశాను. వారిలో 'కులీన' వ్యక్తులు తక్కువ. అందరూ ముక్తకంఠంతో దైవస్తుతి చేశారు, గీతాలు ఆలపించారు, ఆనంద పారవశ్యంలో ఓలలాడుతూ సెల్ఫీలూ తీసుకున్నారు. విజయవాడకు సమీపంలో ఉన్న ప్రాచీన ఉండవల్లి గుహల ముందు ఒక యువకుడు కాషాయ జెండాను ఆ చివర నుంచి ఈ చివరకు ఊపుతూ 'జైశ్రీరామ్' అని నినదిస్తున్నాడు. నేను ఆ జెండా తీసుకొని అటూ ఇటూ తిప్పుతూంటే ఆ కుర్రాడు వీడియో తీశాడు. 'ఊహాత్మక జనసమూహాలు'? 'గుంపుల భ్రాంతి?' కావచ్చు కానీ సామాజిక శాస్త్రాల భావనలు, సిద్ధాంతాలు వస్తాయి, పోతాయి. వాటికి ఆవల, వాటన్నిటికీ అతీతంగా వేల్పులు నిశ్చలంగా నిలబడి వుంటారు. వారి ఉనికి సుస్థిరమైనది, స్ఫూర్తిమంతమైనది.

పుణ్యక్షేత్రాలు, పవిత్ర స్థలాలు తరతరాల జ్ఞాపకాలు. ప్రకృతికి సంబంధించిన గౌరవనీయమైన స్థలాలు. ఇటీవల ఓ అమెరికన్ ట్విట్టర్‌లో పాశ్చాత్య యువత 'ప్రకృతి'ని అధ్యయనం చేయడం లేదని, 'పర్యావరణం' గురించే మాట్లాడుతున్నారని ఓ వ్యాఖ్యచేశారు. ప్రకృతి అనే పదానికి ఉన్న సున్నితమైన అర్థాలు, అంతరార్థాలను విస్మరించి, దానిని ఒక నిరింద్రియ, 'యంత్రం'లాంటి వ్యవస్థగా మాత్రమే చూస్తున్నారు.

ఒకదేశపు ప్రత్యేకతను, సహజ కాల పవిత్రతను దేశీయ లేదా మూలవాసీ సంస్కృతులు మరిచిపోవు. శాస్త్రీయ దృష్టిని అలవరచుకోవాలని తొందరపెట్టే వారు ముహూర్తం, వాస్తును పరిహసించడం పరిపాటి. అయితే క్రూర ఏకేశ్వరోపాసన సంప్రదాయాలు విస్తరించకముందు యావత్ప్రపంచమూ అనుసరించిన పద్ధతులు అవి. ఇప్పుడు మనలను ఆవహించిన రామభక్తి అంతకంతకూ అంతరించిపోతున్న ఆ పురాతన జ్ఞాపకాన్ని మళ్లీ మన మనస్సుల్లో నింపుకోవాలనే ఆరాటమే. ఎందుకు ఆ తమకం? ఎందుకంటే మనం ఇప్పుడు ఒక విధ్వంసమైన, అనాగరికమైన- సాంస్కృతికంగా పర్యావరణ పరంగా ఒక విషపూరిత ఆధునికీకరణ దశలో ఉన్నాం. మనం లేదా కనీసం మన కులీనవర్గాలు వేల్పుల విగ్రహ భంజనం, మానవుల ఆరాధనా కార్యకలాపాలతో ఉన్నారు.

ఆసేతు శీతాచలం దైవ ఉన్మాదం ఆవహించి ఉన్న సమయంలో నేను ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నాను? గత కొద్దిరోజులుగా నేను వెళ్లిన ప్రతి గ్రామంలోను మిక్కిలిగా కనిపించిన విగ్రహాలు సంప్రదాయ వేల్పులవి కావు, అవి నేటి లేదా నిన్న మొన్నటి రాజకీయ నాయకులవే. నా తల్లిదండ్రులు ప్రతిష్ఠించిన నవగ్రహ ఆలయం ప్రహరీ గోడ ఆవల నుంచి గాంధీ విగ్రహం కనిపిస్తోంది. పక్కన మరో నాయకుని విగ్రహమున్నది. ఆ ప్రాంతంలోని ప్రతిపల్లెలోను రాజశేఖరరెడ్డి, ఎన్‌టి రామారావు విగ్రహాలున్నాయి. అంబేడ్కర్ విగ్రహాలూ పెద్దసంఖ్యలో కనిపించాయి. గుజరాత్‌లో ప్రతిష్ఠించిన సర్దార్ పటేల్ విగ్రహాన్ని నేను ఇంకా చూడలేదు కానీ, హైదరాబాద్‌లోని నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని చూశాను. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్నీ చూశాను. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన రోజున ఆ చారిత్రాత్మక సంఘటన ప్రత్యక్షవీక్షణానికి వీలుగా గుంటూరు -విజయవాడ హైవేపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అటువంటి సందర్భాల్లో వివిఐపీల రాకపోకలకు ఎకరాలకు ఎకరాలలో చెట్లను కొట్టివేయడం కూడా జరుగుతోంది. మనం ప్రజాస్వామ్య దేవుడిని ఆరాధిస్తున్నాం, ఆయన ప్రతినిధులు తామే భగవంతుడిలాగా ప్రవర్తిస్తుంటే, అంగీకరిస్తున్నాం. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కొత్త వైభవోపేత సచివాలయాన్ని కొద్దికాలం క్రితం చూసినప్పుడు కొద్దిమంది సామాన్యులు గేట్ల వద్ద నిలబడి కనిపించారు. అదే ఒక దేవాలయమై ఉన్నట్టయితే ఆ గుడి పూజారులు వారిని బయటకు నెట్టివేసి ఉంటారని కొందరికైనా అనిపించేది. అయితే అది ప్రజాస్వామ్య దేవుడిది కావడంతో ఎవరూ ఆ రీతిలో ఆలోచించరు కూడా. ఇక, ఆ గేట్ల వెనుక ఒక విశాల, బహిరంగ ఖాళీ ప్రదేశం ఉంది. భవనం దాకా వాహనాలు నేరుగా వెళ్లేందుకు ఒక అధునాతన మార్గం ఉంది. ప్రజాస్వామ్య దేవుళ్లు తాము సౌఖ్యంగా పొయ్యేందుకు ఎకరాల వైశాల్యంలోని వందలాది చెట్లను ఇట్టే కూల్చివేయగలరు. ఇదొక ఉన్మాద పరిస్థితి. అయినా దీన్ని మార్చేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను మీ గ్రామంలోనే సమావేశపరిచి, ఓటు వేయించుకోవడానికి నాయకుడు మందగా తీసుకువెళ్లడానికి మనం నిశ్చయంగా అనుమతిస్తాం.

పీడకులు, పేచీకోరు పాలకులు, మూర్ఖులు, నియంతలు, ఉన్మాదులు వస్తారు పోతారు. అయితే మాతృమూర్తులు తమ బిడ్డల శ్రేయస్సుకోసం నవగ్రహ పూజలు ఎప్పటికీ నిర్వహిస్తూనే ఉంటారు. తండ్రి ఇరుముడితో శబరిమల మెట్లు ఎక్కుతూనే ఉంటాడు. రాముడు, కృష్ణుడు, గణేశ్, హనుమాన్, లక్ష్మీ, సరస్వతి, ఇంకా ఎంతోమంది సుప్రసిద్ధ, అప్రసిద్ధ దేవతలు, వేల్పులు మన సమస్త అస్తిత్వాన్ని నిర్ణయిస్తున్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో దేవుళ్ళకు స్థానం లేదని, ఒకే ఒక్క నిజమైన దేవుడు—మత లేదా లౌకిక దేవుడు మాత్రమే ఉండాలని శతాబ్దాలుగా కొందరు కత్తులు ఝుళిపిస్తున్నారు. ఈ వాదనను మన బహు దేవతారాధన భూమి నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. మీ రాజ్యాంగం, మీ ప్రజాస్వామ్యం, మీ పవిత్ర గంథం—ఇవేవీ మా రాముడిని మించి సమున్నతమైనవి కావు. వ్యవహరించాల్సి వస్తే దాని ఆధారంగా వ్యవహరించండి.

● -వంశీ జూలూరి
మీడియా స్టడీస్ ప్రొఫెసర్, శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్సిటీ

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తేనే మనుగడ

అసెంబ్లీ ఎన్నికలైనాక తెలంగాణ గ్రామాల్లో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకుందామని మహబూబాబాద్ దగ్గర ఉన్న శనిగరం గ్రామానికి వెళ్లాను. టీ కొట్టు దగ్గర కూర్చున్న కొందరిని పలకరిస్తే, చాలా విషయాలు మనసు విప్పి చెప్పారు. ఎన్నికల తరువాత గ్రామంలో పరిస్థితి ఎలా ఉంది అన్న ప్రశ్నకు అందరూ ఒక్కసారిగా చాలా ప్రశాంతంగా ఉంది సార్ అని సమాధానం ఇచ్చారు. వారి మొహంలో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపించింది. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో దొరలను జనగామ ప్రైవేటుస్టేషన్‌లో ఉరికించి చంపి, దొరల పెత్తనం మీద కసి తీర్చుకున్నట్టుగా అనిపించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మీద అంత కసి ఉందని వారి మాటల్లో తెలిసింది. ఎన్నికల్లో ఓటుకు డబ్బులు ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓటుకు 1500 ఇవ్వగా, కాంగ్రెస్ అభ్యర్థి 1200 ఇచ్చారు. కానీ ఓటు కాంగ్రెస్‌కే వేశారు. ఒకామె అసలు పైసలు ఇవ్వకున్నా కాంగ్రెస్‌కే ఓటేసే వాళ్లం అంటూ పెద్దగా నవ్వుకుంటూ చెప్పింది. గత లోకల్ ఎమ్మెల్యే, ఎంపీ పేరు చెప్పగానే వారి మొహాల్లో ఎక్కడలేని కోపం కనిపించింది. గత పదేళ్లలో ఒక్కసారి కూడా వారు ఊరికి రాలేదట. భూకబ్జాలు చేయడం తప్ప, ప్రజల సమస్యల్ని ఏనాడు పట్టించుకోలేదని చెప్పారు. అసలు ఇప్పుడు పథకాల లబ్ధి గూర్చి ప్రజలు ఆలోచించడం లేదు. గుండె బరువో ఏదో దిగిపోయిందని, పీడ విరగడైందని భావిస్తున్నారు.

టీకొట్లో పరిచయమైన మాదిగ కొమురయ్యను తీసుకొని దళితగూడెం వెళ్లాను. అక్కడ దాదాపు 70 ఇళ్లున్నాయి. 20 ఏళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు ఎక్కడికక్కడ పగిలిపోయి ఉంది. 1980 దశకంలో నిర్మించిన ఇందిరమ్మ పెంకుటిళ్లు శిథిలావస్థలో ఉన్నాయి. కొందరు వాటిని పడగొట్టి సొంత ఖర్చుతో కట్టుకున్నారు. అక్కడ పేదరికం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నలభై కుటుంబాలకు పావు ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు భూమి ఉంది. మిగతా వారు కూలీ మీదనే బతుకు సాగిస్తున్నారు. ఎవరికీ చదువు పెద్దగా లేనందున చెప్పుకోదగ్గ ఉద్యోగంలో లేరు.

గూడెం—ఊరు సంబంధాలు సాధారణంగానే ఉన్నాయి. ఊరిలో మూడు పేద రెడ్లు, ఐదు ముస్లిం కుటుంబాలు, మిగతావి బీసీ, లంబాడ ఇళ్లు. ఊళ్లో అన్ని పండగలు, జాతర్లలో అందరూ పాలు పంచుకుంటారు. ఈ ఊరిలో రాజకీయ చైతన్యానికి కొదవలేదు. వాస్తవంగా శనిగరం ఒక కమ్యూనిస్టు గ్రామం. ఇప్పుడు అన్ని పార్టీలూ ఆ గ్రామంలో ప్రవేశించాయి. పువ్వు పార్టీ కూడా ఒక మాదిగ కుటుంబంలో ప్రవేశించింది. కమ్యూనిస్టు పార్టీ ఎందుకు దూరమైందన్న ప్రశ్నకు కొమురయ్య మాటల్లో చెప్పాలంటే— పాత రోజుల్లో నాయకులు నిస్వార్థంగా ప్రాణత్యాగం చేసి, ప్రజలకు అండగా నిలబడ్డారు. ఇప్పుడు అంతా స్వార్థపర నాయకులు పుట్టుకొచ్చారు. ప్రజలు ఇప్పటి కమ్యూనిస్టులను నమ్మే పరిస్థితి లేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గూడెంలో పెద్దగా ఒరిగిందేమీ లేదు. వృద్ధాప్య పింఛన్లు తప్ప లబ్ధిపొందిన పథకాలు ఏవీ లేవు. ఒక్క కుటుంబానికి దళిత బంధు పథకం మాత్రం వచ్చింది. గత ప్రభుత్వంపై గూడెం వాసులు కోపంగా ఉన్నారు. వారి పాలన ప్రజల్ని అంతగా గాయపరిచిందని చెప్పారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజలు ఎన్నో ఆశలతో పాల్గొన్నారు. టీఆర్ఎస్ నాయకుడు కె. చంద్రశేఖరరావు (కేసీఆర్) తన ప్రసంగాల్లో ప్రజలు ఆశల రెక్కలు తొడిగారు. తెలంగాణ వచ్చాక ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఏదో ఒక వాగ్దానం చేసి ఆరంభంలో హడావుడి చేయడం, తరువాత పట్టించుకోకపోవడం పరిపాటి అయింది. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం జరిగింది. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కొద్దికాలంలోనే వాటిని తుంగలో తొక్కారు. కేసీఆర్ కుటుంబం— ప్రభుత్వాన్ని తమ కుటుంబ వ్యవహారంగా మార్చేసింది. పోయిందనుకున్న దొరల పాలన మళ్లీ కేసీఆర్ కుటుంబం రూపంలో వచ్చిందన్న అభిప్రాయం ప్రజల్లో కలిగింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కేసీఆర్ కాళ్మొక్కుడు చూసి ప్రజలు చీదరించుకున్నారు. కుటుంబసభ్యుల శాఖలు తప్ప, మిగతావారి శాఖలు నామమాత్రంగా సాగాయి. హోం మినిస్టర్ హోంగార్డును కూడా బదిలీ చేయలేడన్న విషయం కింది దాకా వెళ్లిపోయింది.



కేసీఆర్ ప్రభుత్వం ప్రజల్ని పౌరులుగా కాక కేవలం ఓటర్లుగానే చూసింది. వారు అడగకుండానే జనాదరణ పథకాలు ప్రకటించి ప్రజల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆ పథకాలేవీ ప్రజల్లో గుణాత్మక మార్పు తేలేదు. విద్య, నిరుద్యోగం తెలంగాణలో ప్రధాన సమస్యలు. గత పదేళ్లలో పాఠశాల విద్య, ఉన్నత విద్య పూర్తిగా ధ్వంసమయ్యాయి. నాణ్యమైన విద్యతోనే నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చునన్న సోయి లేకపోయింది.
కేసీఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే హైదరాబాద్ అభివృద్ధిలో తెలంగాణ గ్రామీణ ప్రజలకు ఎటువంటి స్థానమూ లేదు.

కేసీఆర్ ప్రభుత్వం చేష్టలన్నీ ప్రజాస్వామ్యాన్ని కించపరిచేవిగా ఉండేవి. రెండవసారి ప్రభుత్వం ఏర్పాటైనాక పరిస్థితి మరింత దిగజారింది. సచివాలయాన్ని కూల్చేశారు, ప్రగతి భవన్ గేట్లు మూసుకున్నాయి. ఏ శాఖ ఎక్కడుందో ప్రజలకే కాదు, మంత్రులకు కూడా తెలియని ఒక దుర్భర పరిస్థితి ఏర్పడింది. ప్రజలు ఎక్కడికి వెళ్లి తమ సమస్యలు చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. తమ శాఖల పనితీరుపై మంత్రులు సమీక్షలు చేయలేని పరిస్థితి దాపురించింది.

ధరణి పోర్టల్ తెచ్చిన అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. తమ భూముల్ని ప్రజలు రెవెన్యూ అధికారులకు డబ్బులిచ్చి పోర్టల్‌లో ఎక్కించుకునే దౌర్భాగ్యం ఏర్పడింది. ధరణి అసలు మతలబు ప్రజలకు మొదట అర్థం కాలేదు. ఎప్పుడైతే ఊర్లొంచి వెళ్లిపోయిన దొరలు తిరిగి వచ్చి ఈ భూములు మావి అన్నారో అప్పుడు అర్థమైంది. ఈ ధరణిని దొరల కోసం తీసుకొచ్చారని. రాష్ట్రంలో ధరణి ఒక పెద్ద భూదందాకు తెరలేపింది. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాత రికార్డుల్ని ధ్వంసం చేసి, ప్రభుత్వ, ప్రజల భూముల్ని అమ్ముకున్నారు. ప్రభుత్వ పథకాలలో వచ్చే కమీషన్ కంటే ఈ దందా కోట్లు తెచ్చిపెడుతుందని అందరూ దీన్నే ఆశ్రయించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఇది మరింత విస్తృతంగా జరిగింది. ప్రజల్లో తమ భూముల పట్ల అభద్రతా భావం కలిగించింది.


ప్రజలు ఈ పరిణామాన్ని దిగమింగుకుంటూ వచ్చారు. రాష్ట్రంలో ఒక నిస్సహాయ పరిస్థితి ఏర్పడింది. ప్రశ్నించినవారు జైలు పాలయ్యారు. మరోవైపు కేసీఆర్ ప్రతిపక్షాలను బలహీనపరచి అసెంబ్లీలో తనకు ఎదురులేకుండా చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు కేవలం కేసీఆర్‌కు నచ్చిన బిల్లులు, బడ్జెట్ ఆమోదించుకోవడానికి మాత్రమే జరిగేవి. ప్రజా సమస్యల మీద చర్చలు మచ్చుకైనా కానరాలేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజల్ని పౌరులుగా కాక కేవలం ఓటర్లుగానే చూసింది. వారు అడగకుండానే జనాదరణ పథకాలు ప్రకటించి ప్రజల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆ పథకాలేవీ ప్రజల్లో గుణాత్మక మార్పు తేలేదు. విద్య, నిరుద్యోగం తెలంగాణలో ప్రధాన సమస్యలు. గత పదేళ్లలో పాఠశాల విద్య, ఉన్నత విద్య పూర్తిగా ధ్వంసమయ్యాయి. నాణ్యమైన విద్యతోనే నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చునన్న సోయి లేకపోయింది.

కేసీఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే హైదరాబాద్ అభివృద్ధిలో తెలంగాణ గ్రామీణ ప్రజలకు ఎటువంటి స్థానమూ లేదు. ఇక్కడ వెలసిన బహుళ అంతస్తుల భవనాలను అభివృద్ధి నమూనాలుగా చూపిస్తారు. కానీ వీటిలో పనిచేసే ఉద్యోగులు, లేదా వీటిని కట్టిన కూలీలు కూడా బయటివారే. తెలంగాణ యువతకి ఈ బహుళ అంతస్తుల భవనాల్లో ఉద్యోగాలు సంపాదించుకునే నైపుణ్యం లేదు. యువతకు ఆ నైపుణ్యాన్ని కలిగించే ప్రయత్నం గత ప్రభుత్వం చేయలేదు.

తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికే ఆదర్శమన్న ప్రచారంతో కేసీఆర్ ఎన్నికలకు వెళ్లారు. కానీ ప్రజలు దానికి కనెక్ట్ కాలేదు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఆగమవుతారని, అణచివేస్తుందని కేసీఆర్ చెప్పారు. కానీ ప్రజలు వినలేదు. ప్రజలకు తెలుసు ఇందిరమ్మ రాజ్యం అంటే ఏమిటో.. అది దొరలని అణచివేసింది, భూసంస్కరణల్ని తెచ్చి పేదలకు భూముల్ని పంచింది. ఉండడానికి ఇళ్లు కట్టించింది, బ్యాంకుల్ని జాతీయం చేసింది, ప్రజల్ని వడ్డీవ్యాపారుల నుంచి కాపాడింది. అన్నింటికీ మించి సోషలిజం, సెక్యులరిజం భావాల్ని రాజ్యాంగంలో చేర్చింది. తెలంగాణలో రెండు గ్లాసుల వ్యవస్థను రూపుమాపింది.. ఇవన్నీ ప్రజల జ్ఞాపకాల్లో పచ్చిగానే ఉన్నాయి. అందుకే ప్రజలు ఇందిరమ్మ రాజ్యానికే పట్టం కట్టారు.

ఓడిపోయిన తరువాత కూడా కేసీఆర్ వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదు. ఓటమి మీద జరిగిన సమీక్షలన్నీ తమను తాము సమాధానపరచుకునే విధంగానే ఉన్నాయి. సమస్యల లోతుల్లోకి వెళ్లడం లేదు. ఇందిరా పార్కులో ధర్నాచౌక్‌ను ఎత్తేసిన నాడే ఆ పార్టీ పతనం మొదలైంది. పార్టీ పేరు మార్పుతో తెలంగాణలో తన ఉనికినే కోల్పోయింది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో కేసీఆర్ పార్టీ మనుగడ సాగించడం చారిత్రక అవసరం. ప్రజాస్వామ్య విలువల మీద పార్టీ పునర్నిర్మాణం జరిగితేనే అది సాధ్యం. ప్రాంతీయ పార్టీలు ప్రాంతాల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఉన్నప్పుడే అవి మనుగడ సాగిస్తాయి. అందుకు తమిళ పార్టీలే ఉదాహరణ.

గాంధీ నడయాడిన నేల ఇదేనా?



గాంధీజీని ఎవరు, ఎప్పుడు ఏ కోణంలో చూసినా ఒక ఉత్తమ వ్యక్తిత్వ లక్షణాల ఫలిత పుష్పంగానే సమ్మోహ రూపం అనిపిస్తుంటారు. నూతన ఉత్తేజాన్నిస్తుంది. నేటితరానికే కాదు భవిష్యత్ తరాలకూ ఆయన మార్గదర్శకుడు... మోడరన్ మేనేజ్‌మెంట్ గురు. ఆయన శ్వాస.. సత్యం అహింస. ఆయన ధ్యాస.. పేదరికం, అంటరానితనం, నిరక్షరాస్యత నిర్మూలన... దురలవాట్లకు దూరంగా ఉండే సభ్య సమాజం... వీటన్నింటి సమాహారమైన గ్రామీణ భారతావని. ఆయన కలలుగన్న గ్రామస్వరాజ్య సంపూర్ణ స్వరూపమిదే. మనసా, వాచా, కర్మణా ఆచరించటం ఆయన నైజం. నీతి నిజాయితీ, కృషి, పట్టుదల, దృఢసంకల్పం, ఆధ్యాత్మికత, నిశిత పరిశీలన, నిరంతర కృషి, నిర్భయం, నిగ్రహం, నైతికత, ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, సరళ స్వభావం, సేవాదృక్పథం.. వంటి సద్గుణాలు గల విశిష్ట వ్యక్తిత్వం ఆయనకే సొంతం. కర్తవ్యం పట్ల అపురూపమైన ప్రేమ. సమాజంలో అన్యాయాన్ని ఎదుర్కొనవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. ముఖ్యంగా యువత పోరాట పటిమ, సామాజిక స్పృహ కల్గి ఉండాలన్నది ఆయన దృఢ విశ్వాసం. వీటన్నిటికంటే మరీ ముఖ్యమైనది మాతృభూమిపై మమకారం ఉండాలన్న ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు. నాడు అంతగా సమాచార వ్యవస్థ, ప్రచార సాధనాలు లేకున్నా, ఏకత్వభావాలు గల భిన్న సమూహాల సమన్వయం, ఆయన ఆశయసిద్ధికి సంఘీభావం తెలిపాయి. మార్పు కోరుకుంటే అది నీ నుండే ప్రారంభం కావాలన్న ఆయన పిలుపునకు, ఆశయాలకు, విలువలకు ప్రేరేపితులై భోగభాగ్యాలు, సిరిసంపదలు త్యజించి ఆయన బాటన నడిచారు. ఆ తరం దాదాపు అంతరించి పోయింది. ప్రస్తుత సమాజంలో విపరీత పోకడలు చూస్తూ గాంధీజీ నడయాడిన నేల ఇదేనా.. అంటూ మధనపడవలసి వస్తోంది. ఒక సమిష్టి లక్ష్యం సాధించాలంటే గాంధీజీ సిద్ధాంతాలు తెలుసుకోవాలి, అర్థం చేసుకుని ఆచరించాలి.

– హేమసుందర్ అట్టాడ


వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి



- బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో చాన్స్ ఇవ్వకుండా ఎత్తుగడలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- మంత్రులు కొండా, పొంగులేటికి వరంగల్, మహబూబాబాద్ స్థానాల బాధ్యతలు
- ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు

వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇంచార్జులుగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు, కీలక నేతలకు అప్పగించింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో విజయంపై సమీక్షలు నిర్వహిస్తు పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. దీంతో ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ కసరత్తు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీ సీట్లపైనే హస్తం ఫోకస్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, కనీసం 12 స్థానాలైన గెలువాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీగా మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఇటీవల స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో సమీక్ష కూడా నిర్వహించారు. రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాలు రూపొందించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6,63,556 ఓట్లు పొందగా, బీఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 2,41,987 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో ఈసారి వరంగల్ ఎంపీ సెగ్మెంట్‌లో పాగా వేయడం పెద్ద కష్టం కాదనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లను పొందగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు పోలయ్యాయి. ఇక బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 2,30,188 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో కాంగ్రెస్‌కు భారీగా ఓటు బ్యాంకు పెరగడంతో ఎంపీ ఎన్నికల్లో గెలుపై ధీమాగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోటీ ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది.

అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీ కొంత ప్రభావం చూపించింది. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తుంది. అయితే పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ కూడా అడుగుతుంది. అయితే దీనిపై ఎలాంటి స్పష్టత లేకున్నప్పటికీ రెండు ఎంపీ సీట్లను మాత్రం పక్కాగా గెలుచుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై...

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి డిసెంబరు 9న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జూన్ 8వ తేదీ వరకు ఉప ఎన్నికకు గడువుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఏప్రిల్ నెల లేదంటే జూన్ మొదటి వారంలోనే ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా, నల్లొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్లొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.

2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్

మిగతా 7వ పేజీలో..

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ నియోజకవర్గాలు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	07	6,63,556	4,33,368	1,56,638
మహబూబాబాద్	07	6,85,897	4,43,910	34,431

కాంగ్రెస్‌కు తొలి సవాల్...

గత ఏడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్ ఎదుర్కొనుంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో తన మిత్రపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలు జాడ లేకుండా పోయాయి. అయితే ఇది ఒక వర్గానికి సంబంధించిన ఎన్నికలే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఫిబ్రవరిలో మరో హామీని కూడా అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. మార్చి, ఏప్రిల్ నాటికి మిగతా రెండు హామీలను కూడా అమలు చేసి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ ఉంది. పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపుతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు ఇచ్చే తీర్పు ఇదే కావటంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి.



కాంగ్రెస్ విషపూరిత ప్రచారంతోనే ఓడిపోయాం

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సుబేదారి, జనవరి 29 : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ విషపూరిత ప్రచారం చేయడంతోనే ఓడిపోయామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమిని సమీక్షించుకుని రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వకుండా రైతులకు నోట్లో అరటిపండు పెట్టిందన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయడం అసాధ్యమన్నారు. 100 రోజుల్లో కాకుంటే కనీసం 5 సంవత్సరాలలోనైనా మీ హామీలు అమలు చేయాలన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9వ తేదీన రైతుబంధును రైతుల అకౌంట్లో వేస్తామని చెప్పి ఇంకా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 50రోజులలోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో విషప్రచారం చేయడం వల్లే గెలిచిందన్నారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గంలోని సర్పంచ్‌లను సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజల పక్షాన పోరాడుతానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారి తీసిన పరిస్థితులను సమీక్షించుకుని తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా కోప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీతో పాటు పెద్ద సంఖ్యలో వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్ రావు | పి.మోహన్‌రెడ్డి | పి.సంధ్యారాణి | పి.గణపతి

ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

- నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన
- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త వారికి త్వరలో నోటిఫికేషన్

7


భీమదేవరపల్లి మండలం మల్లారంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు
- గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు
- రాష్ట్రంలో 3వేల కొత్త బస్సులు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

8

కొత్త పంథాలో జీడబ్ల్యూఎంసీ సేవలు

- ఇకపై ప్రతి బుధవారం రెవెన్యూ పరిష్కార మేళా...
- ఆస్తి పన్ను, సవరణ తదితర సమస్యలపై పరిష్కార మార్గాల సూచన
- ప్రజలకు సత్వర సేవలు



జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 29 : వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రజలకు రెవెన్యూ పరమైన సేవల పరిష్కారం, విస్తరణ కోసం కొత్త పంథాను చేపట్టింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రజలకు ఉపయుక్తం అయ్యే నిర్ణయాన్ని తీసుకుంటూ ఈ మేరకు సేవల విస్తరణ చర్యలు చేపట్టారు. గతంలో లేని విధంగా జీడబ్ల్యూఎంసీ రెవెన్యూ విభాగ పరమైన సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ పరిష్కార మేళాను చేపడుతోంది. ప్రతీ బుధవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో మేళాను అధికారులు నిర్వహిస్తారు. కమిషనర్‌తో పాటు రెవెన్యూ విభాగ అధికారులు మేళాలో పాల్గొని ప్రజలకు సేవలు అందిస్తారు.

మేళా సేవలు ఇలా...

రెవెన్యూ మేళాలో ఈ విభాగానికి సంబంధించిన అన్ని సేవలపై అధికారులు ప్రజలకు వివరిస్తారు. ప్రజల సందేహాలతో పాటు సమస్యల పరిష్కార మార్గాల సూచన, చర్యలు చేపడతారు. ఈ విధానం ద్వారా పెండింగ్ లేకుండా సత్వర చర్యలు అందించాలనే లక్ష్యంతో మేళాను చేపట్టాలనే కొత్త నిర్ణయాన్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తీసుకున్నారు. రెవెన్యూ పరమైన ఆస్తి పన్ను విధింపు, సవరణ, ఇంటి నెంబరు కేటాయింపు, ఇంటి యజమాని పేరు మార్పిడి, ఇంటి నెంబరు సవరణ, ఖాళీ స్థలానికి పన్ను మదింపు, ఖాళీ స్థలం పన్నును ఇంటి పన్నుగా మార్చడం తదితర సేవలు ప్రజలకు అందుతాయి.

అక్రమాలకు తెరపడే మార్గం

వరంగల్ మహానగర పాలక సంస్థ అందించే రెవెన్యూ పరమైన సేవలపై వాస్తవానికి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ సేవలు అందించేందుకు జీడబ్ల్యూఎంసీలోని కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంటి నెంబరు కేటాయింపు, ఆస్తి మార్పిడి తదితర సేవల కోసం ప్రజల నుంచి పెద్ద ఎత్తున్న అక్రమంగా డబ్బులు దండుకుంటూ సేవలు అందచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కూడా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అందినంత ముట్టజెప్పితే చాలు అక్రమాన్ని సక్రమం చేస్తూ ఇంటి నెంబర్లు తదితర పనులను ఇట్టే చేస్తున్నారు.

గతంలోని అనుభవాలే నిదర్శనం

బల్దియా రెవెన్యూ విభాగం ఎంత లోపభూయిష్టంగా ఉందనేందుకు గత అనుభవాలు, నిదర్శనాలే సాక్ష్యభూతాలుగా నిలుస్తాయి. కొందరు ఆర్ఐల దోపిడీతో ప్రభుత్వ భూములు, జీడబ్ల్యూఎంసీ స్థలాలు కూడా అన్యాక్రాంతమైయ్యాయి. దర్జాగా వాటికి ఇంటి నెంబర్లు కేటాయింపు కూడా జరిగింది. వీటికి టౌన్ ప్లానింగ్ విభాగం నిర్మాణ అనుమతులు కూడా జారీ చేశారు. దేశాయిపేట రోడ్డులోని ప్రభుత్వ స్థలానికి ఓ ఆర్ఐ గతంలో డబ్బులు దండుకొని నెంబరు కేటాయించారు. ప్రహరీ నిర్మాణం జరగడం, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా అనుమతులు జారీచేయడం జరిగింది. ఈ విషయం బయట పడడం, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకు వెళ్లడం జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఆర్ఐపై చర్యలు చేపట్టడం ఆ తరువాత సదరు ఆర్ఐ మరో సందర్భంలో లంచం పుచ్చుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం జరిగింది. ఇదిలా ఉంటే ఇంటి నెంబరు కేటాయింపు నుంచి ప్రతీ రెవెన్యూ సేవల కోసం అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి ముక్కు పిండి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలాంటి అక్రమాలకు కొంత వరకు పరిష్కార మేళాతో చెక్ పడే అవకాశం ఉంది. అంతే కాకుండా ప్రజలకు రెవెన్యూ సేవలపై పూర్తి అవగాహన కలగడం, మధ్య దళారులను ఆశ్రయించకుండా ఉండేందుకు రెవెన్యూ పరిష్కార మేళా ఉపయుక్తం కానుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి.


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 29 : ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఇంటర్మీడియేట్ ప్రాక్టీకల్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్ ప్రాక్టీకల్స్‌కు జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాక్టీకల్ పరీక్షల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎ.గోపాల్‌ను అడిగి తెలుసు కున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15 వరకు ప్రాక్టీకల్స్ ఒక రోజు రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని డీఐఈవో వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవి.గణేష్, సీఐ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ధరమ్‌సింగ్, పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ పి.అశోక్, డివిజనల్ పంచాయతీ అధికారి బి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- సమస్యలు వినతులకే పరిమితమవుతున్నాయి
- బల్దియా ప్రజావాణిలో ప్రజల ఆవేదన


ప్రజావాణిలో కమిషనర్‌కు విన్నవిస్తున్న 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకన్న

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 29 : మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ నగర వాసులు వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులకు విన్నవించారు. సమస్యలపై వినతులు అందజేస్తే అవి అక్కడికే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండలోని జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి జరిగింది. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు మౌలిక సదుపాయాలపై ఏకరువు పెట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే తమ ఇబ్బందులు తెలుస్తాయంటూ వాపోయారు. సమస్యలను వినతుల రూపంలో తెలియచేశారు. తక్షణమే పరిష్కార మార్గాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతులు స్వీకరించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు పరిష్కార ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో మొత్తం 103 వినతులు సమర్పితమయ్యాయి.

- హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని రామక్రిష్ణకాలనీలోని ఎఫ్‌టీఎల్ పరిధిని ఆనుకుని ఉన్న స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రాన్ని అందచేశారు. అదే విధంగా 10వ డివిజన్‌కు కేటాయించిన పారిశుధ్య కార్మికుల్లో ఆరుగురు పనులకు రావడం లేదని, వీరి స్థానంలో ఇతరులను కూడా కేటాయించలేదని కమిషనర్‌కు వివరించారు. తక్షణమే కార్మికులను కేటాయించాలని కార్పొరేటర్ వెంకన్న విజ్ఞప్తి చేశారు.
- హసన్‌పర్తి సర్వే నెంబరు 156లో గల తమ భూమిలో వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్‌తో పాటు ఇతర నిర్మాణాలు జరుగుతున్నట్లు రాయబారపు రమేశ్‌బాబు, చంద్రమోహన్, వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. ఈ భూమిలో వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లించి ఇతర నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.
- 57వ డివిజన్ గోకుల్‌నగర్‌లో నాలాను ఆక్రమించి జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ కాలనీ వాసి భాస్కర్ తదిత రులు విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
- హనుమకొండలోని కుడా ఎన్‌క్లేవ్ నుంచి వంద పీట్ల రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రహదారిని పునర్ నిర్మించాలని స్థానికులు దేవేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీదేవి, రామచంద్రం తదితరులు కోరారు. గతంలో వరదల కారణంగా రోడ్డు దెబ్బతిందని పేర్కొన్నారు.
- హనుమకొండ అమరావతినగర్‌లో డ్రెయినేజీ కాలువలు నిర్మించాలని కోరుతూ స్థానికులు శశికళ, సరితారాణి, సారంగపాణివిన్నవించారు.
- హనుమకొండ మున్నూరుకాపు శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని కాపువాడ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు సుంకరి లవ్‌కుమార్, పల్లెల రాజా, అధ్యక్షుడు బక్కి వేణుగోపాల్, ప్రధాన

మిగతా 8వ పేజీలో..

ముగిసిన అన్నారం ఉర్సు


దర్గాలో పూజలు చేస్తున్న ముజావర్లు

పర్వతగిరి, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు చివరి రోజైన సోమవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన వేడుకల్లో చివరి రోజు ఖత్‌మల్ ఖురానా (ఖురాన్ పఠనం)తో ముగిసాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్కాలర్స్ వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, ప్రశాంత్

కేయూ క్యాంపస్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇప్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి కేయూ పరిశోధకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉషన్‌నాయక్, కళ్లెపల్లి ప్రశాంత్‌ల నేతృత్వంలో సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ..వర్సిటీల పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతకు ఫెల్లోషిప్‌లు దోహదపడుతాయని అన్నారు. ఒడిస్సా, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు సీఎం రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకం క్రింద ఫెల్లోషిప్‌లు ఇస్తున్నాయని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కుర్సా నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ జానకి రామ్, కోశాధికారి అంగడి సతీశ్, ఈసీ మెంబర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య


మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు, జనవరి 29: హనుమకొండ ఫాతిమానగర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఐనవోలులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఫాతిమానగర్ బాలవికాస్‌లో జరుగుతాయని తెలిపారు.

ఈ సమావేశాల్లో కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. 31న బహిరంగ సభ ఉంటుందని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ కార్మిక ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసమావేశాల్లో బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేన, ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎన్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య, మేకిరి మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ఆచార్య రమేశ్

మరణ సందేశం పుస్తకావిష్కరణ

వడ్డేపల్లి, జనవరి 29: సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ రాసిన మరణ సందేశం పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్ సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆవిష్కరించారు. తొలుత జర్నలిస్టు గౌరీ లంకేష్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రమేశ్ మాట్లాడుతూ మరణ సందేశం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు.

ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, అంతడుపుల శ్రీనివాస్, బండి మొగిలి, ప్రజాసంఘాల నాయకులు నల్లెల్ల రాజయ్య, రమేశ్‌రాజా, కోగిల చంద్రమౌళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

▸▸ 5వ పేజీ తరువాయి

నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తీన్మార్ మల్లన్న, కోదండరాంలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండడంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. తన నియోజకవర్గ పరిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. పది రోజులుగా పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన ఎంపీ, ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవటంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది.



టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన

- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) ఎట్టకేలకు ప్రక్షాళన మొదలైంది. గత పదేళ్లుగా పాతుకు పోయిన నలుగురు డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌పీడీసీఎల్‌తో పాటు టీఎస్ఎస్పీడీసీఎల్‌లోని ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగించారు. దీంతో ఒక్క కలంపోటుతో మొత్తం పదకొండు మంది డైరెక్టర్లు ఇంటిదారి పట్టారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టుగా ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇక వీటికి మంచి రోజులు వచ్చినట్టేనని విద్యుత్ వినియోగదారులు, వాటిలో పని చేస్తున్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన షురూ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న ప్రత్యేకం కథనం వచ్చింది. చెప్పినట్టుగానే డైరెక్టర్ల తొలగింపు జరిగింది.

వేటు పడిన డైరెక్టర్లు

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో వేటు పడిన డైరెక్టర్లలో బి.వెంకటేశ్వర్ రావు (హెచ్ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు), పి.సంధ్యారాణి (కమర్షియల్), పి గణపతి (ఐపీసీ అండ్ ఆర్ఏసీ) ఉన్నారు. బి.వెంకటేశ్వర్ రావు మినహా మిగతా ముగ్గురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నలుగురు నిబంధనలకు వ్యతిరేకంగా చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నందు వల్లనే వారిని తొలగించినట్టు పేర్కొన్నారు. బి.వెంకటేశ్వర్ రావు (డైరెక్టర్ హెచ్ఆర్) 2013 జులై 31న నియమితులయ్యారు. 10 సంవత్సరాల 5 నెలల పాటు కొనసాగారు. వెంకటేశ్వర్ రావు 2007లో సీఈగా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత అయిదేళ్లకు డైరెక్టర్ అయి అప్పటి నుంచి కొనసాగుతూ వస్తున్నారు. పి.మోహన్‌రెడ్డి (డైరెక్టర్ -పాజెక్టులు) 2018 సెప్టెంబరు 5 తేదీన నియమితులయ్యారు. 5 సంవత్సరాల 4 నెలలుగా ఆయన కొనసాగుతు న్నారు. ఈయన 2006లో సీఈగా రిటైర్ అయ్యారు. మోహన్‌రెడ్డికి 2009లో ఒక సారి, 2011లో రెండో సారి, 2018లో ముచ్చ టగా మూడో సారి ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.పి.సంధ్యారాణి (డైరెక్టర్-కమర్షియల్) 2018 సెప్టెం బరు 5న నియమితులయ్యారు. ఆమె కూడా 5 సంవత్సరాల 4 నెలలుగా కొనసా గుతున్నారు. ఈమే 2021లో సీఈగా రిటైర్ అయ్యారు. అయితే 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగి హోదా లో డైరెక్టర్ గా కొనసాగుతూ వచ్చారు. అలాగే పి.గణపతి (డైరెక్టర్- ఐపీసీ అండ్ ఆర్ఏసీ) కూడా 2018 సెప్టెంబరు 5న నిమితులై గత 5 ఏళ్ళ 4 నాలుగు నెలలుగా కొనసాగుతు న్నారు. ఈయన 2014 ఆగస్టులో రిటైర్ కావలసి ఉన్నది. 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగిగా డైరెక్టర్ హోదాలో కొనసాగుతూ వచ్చారు.



గత సీఎండీ గోపాల్‌రావుతో ప్రస్తుతం తొలగింప బడిన డైరెక్టర్లు

నాలుగేళ్లు మించకూడదు

సాధారణంగా ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లుగా విద్యుత్ సంస్థల్లో సీఈ హోదాలో రిటైర్ అయిన వారిని లేదా ఇంకా రెండేళ్లలో రిటైర్ కానున్న ఇన్‌సర్వీస్ ఉద్యోగులను డైరెక్టర్లుగా నియమిస్తారు. డైరెక్టర్లను తొలుత రెండేళ్ల కాలపరిమితితో మాత్రమే నియమించాలి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి వారి కాలపరిమితిని మరో ఏడాది పొడిగించవచ్చు. గరిష్ఠంగా రెండు సార్లు మాత్రమే వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి. ఏ డైరెక్టర్ అయిన నాలుగేళ్లకు మించి పని చేయరాదు. కానీ ఎన్‌పీడీసీఎల్‌లో ఇందుకు విరు ద్ధంగా డైరెక్టర్లకు ఇష్టారీతిన పొడిగింపులు ఇస్తూ వెళ్లారు. వెంకటేశ్వర్‌రావు (డైరెక్టర్-హెచ్ఆర్‌ఏ) గత పదేళ్లుగా కొన సాగుతున్నారు. ఆయన పదవీ కాలంలో నలుగురు సీఎండీలు మారారు. ఎన్‌పీడీసీఎల్‌లో మొత్తం అయిదుగురు డైరెక్టర్లలో ఈ నలుగురు పోను మరో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఎకౌంట్స్)గా పని చేస్తున్న తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్ మాత్రమే. అంతకు ముందు పని చేసిన డైరెక్టర్ పదవీ కాలం ముగియడంతో ఆయన బాధ్యతలను తిరుపతి రెడ్డికి అప్పగించారు.

టీఎస్ఎస్పీడీసీఎల్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)లోనూ ప్రస్తుతం సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న మరో ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగిస్తూ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. జె.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్-ఆపరేషన్స్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్-ప్రాజెక్టులు), కె రాములు (డైరెక్టర్ కమర్షియల్, డీపీఈ, అసెస్‌మెంట్ అండ్ ఎనర్జీ ఆడిట్), జి.పర్వతం (డైరెక్టర్-హెచ్ఆర్ అండ్ ఐఆర్) సీహెచ్ మదన్ మోహన్ (డైరెక్టర్ పీఅండ్ఎంఎం) ఎస్.స్వామిరెడ్డి (డైరెక్టర్-ఐపీసీ అండ్ ఆర్ఏసీ), గంపా గోపాల్ (డైరెక్టర్,ఈ ఆడిట్, డీపీఈ అండ్ అసెస్‌మెంట్) వీరిలో ఉన్నారు. వీరిలో జె.శ్రీనివాస్ రెడ్డి 9 సంవత్సరాలు 2 నెలలుగా, టి శ్రీనివాస్ 10 సంవత్సరాల 5 నెలలుగా కొనసాగుతున్నారు. మిగతా వారంతా 5 సంవత్సరాల 5 నెలలుగా పని చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకం త్వరలో జరగవచ్చునని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

మహాజాతరను విజయవంతం చేద్దాం..

- అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, జనవరి 29 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహాజాతరను విజయవంతం చేసేందుకు అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఈవో రాజేందర్ ఆధ్వర్యంలో మేడారంలో ఈ సమావేశం జరిగింది. మహాజాతరను విజయవంతం చేయడా నికి చేపడుతున్న కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూజారులు, అధికారులు సమన్వయంగా జాతరను విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

పూజా కార్యక్రమాలు, వాటికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును అడిగి తెలుసుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా పగిడిద్దరాజును తీసుకొచ్చే సమయంలో పోలీసు రోప్ పార్టీల ద్వారా భద్రత కల్పించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవార్లను తీసుకొచ్చే సమయంలో మూడంచల భద్రత అవసరం ఉంటుందన్నారు. వనదేవతల పూజారులకు ఎండోమెంట్ ద్వారా శాశ్వత గదులు కేటాయించాలన్నారు. దేవస్థానం కోసం కేటయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పూజారులకు వసతి, సౌకర్యాలు కల్పిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, పూజారులు వెంకటేశ్వరు, గోవర్ధన్, ప్రభకర్, నర్సింగరావు, భోజరావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణచందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సన్నద్ధం : ఎస్పీ శబరీశ్

ములుగు, జనవరి 29: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను విజయవం తంగా జరిపించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమ వుతోందని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడతామని అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కుంభమేళా స్థాయిలో జరిగే మేడారం జాతర నిర్వహణ బాధ్యత పోలీసు శాఖ ద్వారా తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామ న్నారు. గత జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, భక్తులు, వీఐపీల రక్షణపై దృష్టి సారించామని తెలిపారు. సాధ్యమైనంత వరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జాతర నిర్వహణలో ప్రజలు పోలీసు శాఖకు సహకారం అందించాలని ఆయన కోరారు.





దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు దరఖాస్తు ఫారాలను ఆయన పట్టభద్రులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల్లోని పట్టభద్రులందరు ఓటు నమోదు ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, ఉపేందర్‌రెడ్డి, రాజు, అశోక్‌రావు, రాజు, చంద్రమోహన్, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజేందంర్‌రెడ్డి, సోమేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ సిటీ, జనవరి 29: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుచేస్తున్న యాసంగి వరిలో కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతి పెరుగుతుండటంతో రైతులు తీసుకోవాల్సిన పలు సస్యరక్షణ చర్యలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, యు. నాగభూషణం, ఎం.విశ్వతేజ క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి వరి పొలాలు, నారుమళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు, సూచనాలు అందజేశారు. పురుగుల ఉధృతిని గమనిం చడానికి దీపపు ఎర, సోలార్ ఎర, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వరి పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసి అందులో వారానికి బుట్టలో 25-30 పురుగులు పడినప్పుడు పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



నారాయణగిరిలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు



ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

టీచర్‌గా మారిన అడిషనల్ కలెక్టర్

- పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై ప్రశ్నలు

భీమదేవరపల్లి, జనవరి 29 : జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా టీచర్ అవతారం ఎత్తారు. సోమవారం ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులను తెలుగు, గణితంలో వివిధ ప్రశ్నలు అడిగారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచనలు చేశారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉద్యోగ లక్ష్యం దిశగా ఎంచుకొని అందుకు తగ్గట్టు చదువుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం భీమదేవరపల్లిలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందులో ఏర్పాటు చేయాలని లైబ్రేరియన్ వాగు శివాజీకి సూచించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంరయ్య, విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచందర్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

నేడు కేయూలో ప్రాంగణ నియామకాలకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 29: కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని లురస్ ల్యాబ్ రిసెర్చ్ అనలిస్టులుగా పనిచేసేందుకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ క్వాలిటీ అనలటిక్స్/ఫార్మా అనలటిక్స్ పూర్తి చేసిన వారు ప్రసుత్తం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాలని, ఏడాదికి రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అకాడమిక్ ధృవపత్రాలు, సంబంధిత కళాశాల ఐడీ కార్డుతో నేరుగా ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 12

కేయూ క్యాంపస్, జనవరి 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 12 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

రాంనగర్ జీపీ భవనం ప్రారంభం

ఐనవోలు, జనవరి 29: రాంనగర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, సర్పంచ్ బోయినపల్లి శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, ఉప సర్పంచ్ ఈద సుధాకర్, వార్డు సభ్యులు, పీఆర్ డీఈ దయాకరచారి, ఏఈ కార్తిక్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీ వైస్ చైర్మన్, సర్పంచ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

లక్ష్య సాధనే పనితనానికి కొలమానం

బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 29 : లక్ష్యాల సాధనే పనితనానికి కొలమానమని ఈ మేరకు అంకితభావంతో పని చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. డివిజన్లలో మెరుగైన పారిశుధ్య సేవలు అందాలని ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. డివిజన్‌కు కేటాయించిన కార్మికులు, సిబ్బంది ఖచ్చితంగా డివిజన్లలో ఉండాలన్నారు. తనిఖీల్లో ఇందుకు విరుద్ధంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బంది విధిగా బయోమెట్రిక్ హాజరును పాటించాలన్నారు. కమర్షియల్ నిర్మాణాల పార్కింగ్ ఆక్రమణల నివేదికలు సిద్ధం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగం పన్నుల లక్ష్యాలను సాధించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజులను డిమాండ్ మేరకు వసూలు చేయాలని, పెండింగ్ ఫైళ్లు లేకుండా క్లియర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు అనిసూర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్ర తదితరుల పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 29 : జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొంటున్నట్లు బల్దియా కార్మిక సంఘాల ప్రతినిధులు తెలియచేశారు. ఈ మేరకు సోమవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందచేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెతో పాటు గ్రామీణ బంద్‌లో పాల్గొననున్నట్లు వివరించారు. పారిశుధ్య కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అందించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలనే తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మెలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు టి.ఉప్పలయ్య, భిక్షపతి, ధర్మరాజు, బాబు, ప్రకాశ్, మహేశ్, రఘు, రాజేశ్ పాల్గొన్నారు.

8న మెట్టుగుట్టపై వేలం పాటలు

మడికొండ, జనవరి 29: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మడికొండలోని మెట్టుగుట్టపై గల పవిత్ర పుణ్యక్షేత్రమైన మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో దుకాణముల నిర్వహణకు ఫిబ్రవరి 8న ఉదయం 11 గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈవో శేషభారతి సోమవారం తెలిపారు. లడ్డు, పులిహోర, కొబ్బరికాయలు, పంచామృతాలు, అమ్ముకొనేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు, చెరుకు బండి నడుపుకొనుటకు, వాహన పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారు దేవస్థాన కార్యాలయంలో ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఈవో పేర్కొన్నారు.

పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గం

మడికొండ, జనవరి 29: మడికొండకు చెందిన పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం సంఘం భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా కామని మల్లేష్, కార్యదర్శిగా కోమాకుల సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా నామని సదానందం, కోశాధికారిగా పొట్లబత్తిని లక్ష్మణ్, సహాయకార్యదర్శిగా పోతరాజు ప్రకాశ్ ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి నామని కుమారస్వామి తెలిపారు. ఎన్నికల నిర్వహణ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నల్ల ప్రభాకర్, డాక్టర్ తుమ్మ యాదగిరి, బిల్ల లింగయ్య, నామని రామ్మోహన్‌రావు, కేటిక సదానందం, కన్నె మల్లేశం, వంగ రమేష్, చిదురాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నల్ల రాజేందర్, నామని శివ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

కేయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్

ఐనవోలు, జనవరి 29 : చదువును మించిన ఆస్తి లేదని చదువు బంగారు భవిష్యత్‌ను కల్పిస్తుందని కేయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. పున్నేలు ఏకశిల ఈ-టెక్నో పాఠశాలలో ఏకశిల విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు సోమవారం చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్ ఛాన్స్‌లర్ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు కాకుండా మంచి విద్యను అందిస్తే అదే తరగని ఆస్తిగా నిలుస్తుందని తెలిపారు. కష్టపడి చదివి విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం గెలుపుకాదని ఆ గెలుపు నలుగురికీ ఉపయోగించినప్పుడే అదే అసలైన విజయమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న మామునూరు 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం చాలా అమూల్యమైనదని మంచి అలవాట్లు సత్ప్రవర్తన కలిగి భారతపౌరుడిగా దేశానికి సేవచేయాలన్నారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిల విద్యాసంస్థలు నిత్యనూతన ఒరవడితో మంచి ఫలితాలను సాధిస్తూ ఒక ప్రత్యేకతో ముందుకు వెళ్లడం జరుగుతోందన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఏకశిల విద్యాసంస్థలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేశాయి. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరక్టర్ బేతి కొండల్ రెడ్డి, ఎథికల్ కెరిర్ గైడెన్స్ చైర్మన్ జి. శివప్రసాద్, తేజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్ వివి రమణరెడ్డి, ఏశిల పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జి మహ్మద్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పున్నేలు ఏకశిల పాఠశాలలో జ్యోతిప్రజ్వాలన చేస్తున్న కేయూ వైస్ ఛాన్స్‌లర్ రమేష్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

సుబేదారి, జనవరి 29: జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ సంవత్సర కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, ఈశ్వర్, సాయి, ప్రదీప్, శిరీష, సందీప్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ నాయకులు

వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 29 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 102 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. జీడబ్ల్యూఎంసీ 15, ఆర్డీవో 8, ఎంజీఎం 10, ఎక్సైజ్ శాఖ 1, జిల్లా సంక్షేమశాఖ 1, తహసీల్దార్ 36, ఎంపీడీవో 6, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి 4, డీఈవో 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమునిపాదం జలపాతాన్ని సందర్శించిన డీఎఫ్‌వోలు

గూడూరు, జనవరి 29: గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతాన్ని మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్పన దంపతులు సోమవారం సందర్శించారు. జలపాతంలో జాలువారుతున్న వాటర్ ఫాల్స్‌ను వీక్షించారు. అటవీ ప్రాంతంలో పర్యటించారు. భీమునిపాదం అభివృద్ధిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధిపై ఇరువురు డీఎఫ్‌వోలు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో సురేష్, డీఆర్వో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



భీమునిపాదంలో ఉన్న జలపాతాన్ని సందర్శించిన డీఎఫ్‌వో రవికిరణ్-అర్పన దంపతులు

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

3 వేల కొత్త బస్సుల ఏర్పాటు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, జనవరి 29 : రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించిన పల్లె దావఖానను ఆయన ప్రారంభించారు. గట్లనర్సింగాపూర్, మల్లారం, రసూల్‌పల్లి గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. చంటయ్యపల్లికి రహదారి నిర్మాణం, గట్లనర్సింగాపూర్ నుంచి బొల్లోనిపల్లెకు రహదారి నిర్మాణం కోసం ఆయన శంకుస్థాపనలు చేశారు

ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ.. ముల్కనూర్‌లోని ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ విస్తృతమైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉపాధిహామీ నిధులతో ఒకొక్క గ్రామపంచాయతీకి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాల్లో వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యల లేకుండా చూస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ. 5 కోట్లతో తాగునీటి సమస్య లేకుండా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొత్తగా 3 వేల ఆర్టీసీ బస్సులు...

రాష్ట్రంలో ఆర్టీసీకి మరో మూడు వేల కొత్త బస్సులను త్వరలో కొనుగోలు చేయనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ముల్కనూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే వెయ్యి బస్సులను కొనుగోలు చేసి రాష్ట్రంలోని వివిధ ఆర్టీసీ డిపోలకు పంపించామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 12 కోట్ల జీరో టికెట్లను జారీ చేశామన్నారు. ఆర్టీసీలో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకొని త్వరలో డ్రైవర్, కండక్టర్ పోస్టులతో పాటు ఇతర పోస్టులకు ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వంద రోజు లు కాకముందే మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతున్నాడని అభివృద్ధితోనే ఆయన మాటలకు సమాధానం ఇస్తామన్నారు.

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండల, జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయంగా ఉందని, మండలాలు, జిల్లాల విభజనపై అధ్యయనానికి పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఒక కమిటీని వేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, ఎంపీడీవో భాస్క ర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ స్పెల్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

వేలేరు (ధర్మసాగర్) జనవరి 29: వేలేరు మండలంలో సోమవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో మండల స్థాయిలో స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వేలేరు ప్రధానోపాధ్యాయుడు గౌరిశెట్టి రాజన్న హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంగ్లీస్ భాషపై పట్టుసాధించడానికి ఇలాంటి పోటీలు ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులకు బాషపై నైపుణ్యం పెంపొందించడానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. మండల స్థాయిలో జరిగిన ఈ టెస్ట్‌లో స్ట్రీమ్ -1లో వేలేరు పాఠశాల విద్యార్థులు, స్ట్రీమ్ - 2లో గెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ వేలేరు విద్యార్థులు విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అనంతరం జరిగిన డ్రామా పోటీలలో స్ట్రీమ్ -1 కు వేలేరు విద్యార్థులు, స్ట్రీమ్ - 2కు కేజీబీవీ వేలేరు విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో వేలేరు మండల ఎల్టా కన్వీనర్ రామంచ తబిత, కేజీబీవీ ఉపాధ్యాయురా లు ఊర్మిల, పీసర ఇంగ్లీష్ ఉపాధ్యాయులు భాస్కర్, టీఎస్ఆర్ఎస్ ఇంగ్లీ ష్ ఉపాధ్యాయుడు సందీప్‌తోపాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

డీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

ధర్మసాగర్, జనవరి 29: 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కాజీపేట ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, నృత్య పోటీలలో పెద్దపెండ్యాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. క్లాసికల్, కూచిపూడి విభాగంలో ఎ. శ్లోక ద్వితీయ స్థానాన్ని, భారత నాట్యం విభాగంలో సనయ కృతి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగ గెలుపొందిన విద్యార్థులను చైర్మన్ రవికిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుమోల్ శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, డ్యాన్స్ టీచర్ శ్రీదివ్య అభినందించారు.



నృత్యం, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి

మౌలిక సదుపాయాలు కల్పించండి

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శి మందాటి మహేందర్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ శివనగర్ మెట్లబావి వద్ద 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు శ్రీనివాస్‌రావు, రాజు తదితరులు ఫిర్యాదు చేశారు. వరంగల్ గిర్మాజీపేట మాజీ కార్పొరేటర్ ఉష ఇంటి వీధిలోని రహదారిని విస్తరించాలని, దెబ్బతిన్న డ్రెయినేజీలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతూ స్థానికులు రఘోత్తంరావు, సరస్వతి, అశోక్ తదితరులు కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు అనిసూర్ రశీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

హనుమకొండ క్రైం, జనవరి 29 : హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీసుల దాడిలో 2 కిలోల గంజాయి పట్టుబడింది. హనుమకొండ ఎక్సైజ్ సీఐ ఎల్. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. హసన్‌పర్తి గ్రామంలో గంజాయి ఉందన్న సమాచారంతో సోమవారం గ్రామంలో తనిఖీలు చేయగా బరల చంద్రతేజ ఇంట్లో 2 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందుతుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్సై జి. రమ్య, సిబ్బంది బి. రమేశ్, రమేశ్, భద్రయ్య పాల్గొన్నారు



పట్టుబడిన గంజాయి

మనిషిలోని భగవంతుడిని దర్శించడమే నిజమైన భక్తి

కాజీపేట, జనవరి 29: ప్రతీ మనిషిలోని భగవంతుడిని దర్శించడమే నిజమైన భక్తికి నిదర్శనమని పరివ్రాజకాచార్యులు మధుసూదనానంద సరస్వతి స్వామి అన్నారు. ప్రతి వ్యక్తి నిత్యం దేవాలయాలను దర్శిస్తూ దేవత సేవలు చేయడం ద్వారా తమలో ఉండే సమస్త సంకటాలు తొలగిపోతాయన్నారు. సంకట హరచతుర్థి పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్కమూలగణపతి దేవాలయాన్ని సోమవారం మధుసూదనానంద సరస్వతి స్వామి అన్ని దేవతామూర్తులను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషనం చేశారు. అనంతరం దేవాలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి స్మృతులను జ్ఞాపకం చేశారు. అయినవోలు రాధాకృష్ణ శర్మ, అయినవోలు సాయికృష్ణ శర్మలను దీవించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి

ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్న 20 వేల మంది



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 29 : తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చి మహాజాతరకు ముందుగానే వనదేవతలను దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది సమ్మక్క, సారలమ్మల సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం)తో మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రసాదం లేకుండానే...

మహా జాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులకు ప్రసాదం దక్కడం లేదు. దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్న తమకు నిరాశే ఎదురవుతోందని భక్తులు అంటున్నారు. వనదేవతలకు గద్దెల వద్ద బంగారం (బెల్లం) సమర్పించిన అనంతరం దానిని ప్రసాదంగా అందించాల్సి ఉండగా పూజారులు తమకు ఇవ్వడం లేదని అంటున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం ప్రసాదం లేకుండానే తిరిగి వెళ్తున్నామని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 29 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె సోమవారం మేడారంలో పర్యటించారు. గద్దెల పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఇంకొన్ని రోజుల్లోనే మహాజాతర జరగనుందని, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఆమె వెంట ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

రుద్రేశ్వరాలయంలో సంకటహర పూజలు



రుద్రేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న బిత్తిరి సత్తి

హనుమకొండ కల్చరల్, జనవరి 29 : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సోమవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని ఉత్తిష్ట గణపతికి పంచామృతాభిషేకం, నారికేళ నవరసాభిషేకం, హరిద్రా కుంకుమ విలేపనం, గంధాభిషేకం నిర్వహించారు. గణపతి సూక్త మూలయంత్రయూతంగా గరికతోనే అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమెడియన్ బిత్తిరి సత్తి అలీయాస్ రవికుమార్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వరంగల్ నగరానికి ఎన్నోసార్లు వచ్చానని కానీ ఎప్పుడు ఈ ఆలయాన్ని సందర్శించలేదని, చారిత్రక వేయి స్తంభాల ఆలయ సం దర్శన శివప్రీతికర సోమవారం సందర్శించడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.


వర్ధన్నపేట బీఎస్పీ అధ్యక్షుడిగా సామేల్

కేయూ క్యాంపస్, జనవరి 29 : వర్ధన్నపేట నియోజక వర్గ బీఎస్పీ నూతన అధ్యక్షులుగా చింత సామేల్(సీయోను) నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ ప్రకటించారు. మంద శ్యామ్‌చేతలు మీదుగా చింత సామేల్‌కు నియామక పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేశ్, జిల్లా మహిళ కన్వీనర్ రాజేశ్వరి, వర్ధన్నపేట మాజీ అధ్యక్షులు, ఇన్‌చార్జి బష్కె నాగరాజు, చాతల్ల వేణుగోపాల్, సీనియర్ నాయకులు దామెర పరమేశ్వర్, వర్ధన్నపేట మండల అధ్యక్షులు సంకినేని మధు, కృష్ణగౌడ్, మేకల అవినాశ్, మారుపట్ల నవీన్, నదునూరి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో విద్యార్థినులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

సుబేదారి, జనవరి 29: ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో విద్యార్థినులకు సోమవారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల ఫ్యాన్సీ డ్రెస్‌లు ధరించి అలరించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కళాశాల ప్రిన్సిపాల్ అరుణ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, కల్చరల్ కమిటీ విభాగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్



కీళ్ల నొప్పులకు, కీళ్ల మార్పిడి చిట్టచివరి పరిష్కారం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే పరిస్థితి అక్కడి వరకూ వెళ్లకుండా అరికట్టే ఆధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. వాటిలో ప్రధానమైనది రీజెనరేటివ్ మెడిసిన్. మూల కణాలతో కీళ్లలోని మృదులాస్థినీ, కణజాలాన్నీ సహజసిద్ధంగా వృద్ధి చేసే ఈ చికిత్సతో కీళ్ల సమస్యలను తొలగించుకోవచ్చు అంటున్నారు రీజెనరేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ వెంకటేష్ మొవ్వ.

కీళ్ల సమస్యలకు చెక్

కీళ్ల నొప్పులు అనగానే మనకు మోకాళ్లే గుర్తొస్తాయి. మోకీళ్లు అరిగిపోయి, ఎముకలు రెండూ ఒకదానికొకటి రాసుకుంటున్న దృశ్యం మన కళ్ల ముందు మెదులుతుంది. కానీ మన శరీరంలోని కీళ్లన్నీ అరుగుదలకు వీలున్నవే! అలాగే కీళ్ల నొప్పులకు కేవలం మృదులాస్థి అరుగుదల ఒక్కటే కారణం కాదు. టెండాన్లు, లిగమెంట్లలో సమస్యలు కూడా నొప్పులకు దారి తీస్తాయి. క్రీడలు, ప్రమాదాలు, జీవనశైలి అలవాట్లు... ఇలా కీళ్ల సమస్యలకు కారణాలు అనేకం. అయితే సాధారణంగా కీళ్ల ఇబ్బందులను ప్రారంభంలో నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అవగాహన లేమితో ప్రత్యామ్నాయ వైద్య విధానాలను అనుసరించడం, తోచిన చిట్కాలు పాటించడం లాంటివి చేస్తూ, సమస్యను తీవ్రం చేసుకుంటూ ఉంటాం. ఈ పరిస్థితి అంతిమంగా కీళ్ల మార్పిడికి దారి తీయవచ్చు. కాబట్టి కీళ్లలో తలెత్తిన సమస్యను కచ్చితంగా కనిపెట్టి, సమర్థమైన చికిత్సతో తగ్గించుకోవాలి.

సమస్యను బట్టి చికిత్స

మూల కణాలతో సమస్యను చక్కదిద్దే చికిత్సలు మెరుగైన ఫలితాలను అందిస్తాయి. కాబట్టి వాటితో కీళ్ల మధ్య డ్యామేజీని సరిదిద్దే చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్లతో, మరి కొన్ని సందర్భాల్లో మూల కణాలు, ప్లేట్‌లెట్లు.. రెండింటితో సమస్యను సరిదిద్దుకోవలసి ఉంటుంది. కీలు అరిగిపోయినప్పుడు, లిగమెంట్లు, మృదులాస్థి తెగిపోయినప్పుడు కేవలం ప్లేట్‌లెట్లతో చికిత్స చేస్తే సరిపోదు. అక్కడ కణజాలాన్ని వృద్ధి చేసి, మరమ్మతు చేయడం కోసం మూల కణాలు అవసరమవుతాయి. అయితే ఈ మూలకణాలు తమ బాధ్యతను తెలుసుకుని ప్రవర్తించడం కోసం, వాటిని ప్రేరేపించే, గ్రోత్ ఫ్యాక్టర్లు అయిన ప్లేట్‌లెట్లను కూడా జోడించవలసి ఉంటుంది. ఇలా కీళ్లలో కణజాలాన్ని సహజసిద్ధంగా వృద్ధి చేసే రీజనరేటివ్ మెడిసిన్‌తో చికిత్స తీసుకోగలిగితే, సమస్య అక్కడితో సమసిపోవడమే కాకుండా, ముందుముందు కీళ్లు అరిగిపోకుండా వాటిని కాపాడుకోవచ్చు. అయితే మనలో చాలా మంది కీళ్లలో సమస్య ఏదైనా, విపరీతంగా ఇబ్బంది పెట్టి నడవలేని స్థితికి చేరుకునే వరకూ వైద్యులను కలవరు. ఈ ధోరణి వల్ల సమస్య తీవ్రం కావడంతో పాటు, కీళ్ల మార్పిడి తప్పని పరిస్థితి తలెత్తవచ్చు.



పిఆర్‌పికి శాస్త్రీయ ఆధారాలు లేవు

శాస్త్రీయంగా నిరూపణ అయిన చికిత్సలనే వైద్యులు అనుసరించాలి. కానీ ఎలాంటి శాస్త్రీయ ఆధారాలూ లేని కొన్ని చికిత్సలు ప్రస్తుతం ఎంతో ఆదరణ పొందుతున్నాయి. ప్లాస్మా రిచ్ ప్లేట్‌లెట్ చికిత్సతో కీళ్లలోని మృదులాస్థి పెరిగినట్టు ప్రపంచంలో ఎక్కడా మనుషుల మీద అధ్యయనాలు జరిగిన ఆధారాలు లేవు. ఇప్పటివరకూ ప్రచురితమైన అధ్యయనాల్లో కూడా ఎక్కడా ఇది కనిపించదు. కానీ చికిత్స ముందూ తర్వాతా చేపట్టిన ఎమ్మారై పరీక్షల్లో, కేస్ స్టడీస్‌లో మూల కణాలతో మృదులాస్థి పెరుగుతున్నట్టు నిరూపణ అయింది. కాబట్టి ఒకవేళ ఎవరైనా పిఆర్‌పి చికిత్సతో మృదులాస్థి పెంచగలుగుతామని పేర్కొంటున్నప్పుడు, ఈ విషయాన్ని నిర్ధారించే అధ్యయనాలు ఇప్పటివరకూ ఎన్ని ప్రచురితమయ్యాయో చూపించమని అడగాలి. పిఆర్‌పిలో గ్రోత్ ఫ్యాక్టర్లే తప్ప సజీవ మూల కణాలు ఉండవు కాబట్టి, ఈ చికిత్స కేవలం ప్రారంభ ఆర్థ్రయిటిస్, టెండనైటిస్, టెండనోసిస్ లాంటి వాటికే ఉపయోగపడుతుంది.

రీజెనరేటివ్ మెడిసిన్ ఎవరికి?

కీళ్లకు సంబంధించిన అన్ని సమస్యల్లో మూలకణాల చికిత్స అవసరమవుతుంది. ఎర్లీ, మోడరేట్, సివియర్.. ఈ మూడు సందర్భాల్లో మూలకణాలతో కూడిన రీజెనరేటివ్ మెడిసిన్ తీసుకోవచ్చు. ప్రారంభ దశలో నొప్పి మొదలైన వెంటనే లేదా కొన్నేళ్లుగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వాళ్లు ఈ చికిత్సకు అర్హులు. కీళ్లు పూర్తిగా అరిగిపోయి, కీళ్ల మార్పిడి దశకు చేరుకుని, వేర్వేరు ఆరోగ్య కారణాల మూలంగా కీళ్ల మార్పిడి చేసుకోలేని వాళ్లు కూడా రీజెనరేటివ్ మెడిసిన్‌ను ఎంచుకోవచ్చు. అయితే ఈ కోవకు చెందిన వాళ్లకు నూటికి నూరు శాతం ఫలితం కనిపించకపోయినా, 80% మెరుగుదల ఉంటుంది. రీజెనరేటివ్ చికిత్స తీసుకుని ఫలితం సంతృప్తికరంగా లేనప్పుడు కీళ్ల మార్పిడి సర్జరీ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ సర్జరీ వరకూ వెళ్లి అది విఫలమైన తర్వాత రీజనరేటివ్ సర్జరీ చేయించుకున్నా ఉపయోగం ఉండదు. కాబట్టి కీళ్ల మార్పిడి విషయంలో ఆచితూచి అడుగులేయాలి. కీళ్లకు జరిగిన నష్టం, నష్టం తీవ్రత, జీవనశైలి... ఈ మూడు అంశాల ఆధారంగా చికిత్సను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అథ్లెట్స్ లాంటి క్రీడాకారులైతే నూటికి నూరు శాతం ఫలితం కోసం కీళ్ల మార్పిడి చికిత్సనే ఎంచుకోవచ్చు.

ఈ కీళ్ల సమస్యల్లో...

మోకీళ్లతో పాటు, తుంటి కీళ్లు, మోచేతులు, మణికట్టు, వేళ్ల కీళ్లు, కాలి గిలకలు, వెన్నులోని డిస్క్ సమస్యలు, సయాటికా, డిస్క్ బల్జ్, భుజాల్లోని రొటేటర్ కఫ్ సమస్యలు, ఆర్థ్రయిటిస్... ఇలా మస్క్యులోస్కెలటల్ సమస్యలన్నింటికీ మూలకణ చికిత్స సత్ఫలితాలనిస్తుంది. అవసరానికి మించి ఒకే కీలును ఉపయోగించడం, ఒకే కీలు మీద పదే పదే ఒత్తిడి పడుతూ ఉండడం వల్ల కీళ్లలో సమస్యలు మొదలు కావచ్చు. ఎక్కువ సమయాల పాటు కూర్చుని పనులు చేసుకునే ఉద్యోగుల్లో వెన్నులోని డిస్క్‌లో ప్రెషర్ పెరిగి, సమస్య మొదలు కావచ్చు. టెన్నిస్, క్రికెట్, పరుగు.. ఇలా వేర్వేరు క్రీడలను ఆడే క్రీడాకారుల్లో కూడా కీళ్ల సమస్య తలెత్తవచ్చు. చేతులను, చేతి వేళ్లనూ ఉపయోగించవలసిన అవసరం ఎక్కువగా ఉండే గృహిణుల్లో ఆయా కీళ్ల సమస్యలు మొదలు కావచ్చు. అలాగే ఎలాంటి వ్యాయామాలు చేయకుండా విశ్రాంతిగా గడిపేవాళ్లలో కూడా కీళ్ల డీకండిషనింగ్ సమస్యలు తలెత్తుతాయి. జారి పడడం, రోడ్డు ప్రమాదాల వల్ల కూడా కీళ్లు దెబ్బతింటాయి. ఇలా యవ్వనుల్లో క్రీడలు, ప్రమాదాల వల్ల, పెద్దల్లో జీవనశైలి అలవాట్ల వల్ల కీళ్ల సమస్యలు మొదలవుతాయి. మన భారతీయుల్లో శరీరానికి సహజసిద్ధ వ్యాయామం అందే అవకాశాలు తక్కువ. దైనందిన జీవితంలో పరిగెత్తవలసిన అవసరం ఉండదు. అలాగే జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేయగలిగే తీరికా ఉండదు. కాబట్టే మనలో మోకీళ్ల అరుగుదల ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువ.

కీళ్లకు కండరాలే దన్ను ముఖ్యంగా మోకీళ్లే అరిగిపోతూ ఉండడానికీ, ఎముకలు తేలికగా విరిగిపోవడానికీ కారణం వాటికి కండరాలు దన్నుగా మారకపోవడమే! కండరాల క్షీణత కచ్చితంగా ఎముకల అరుగుదలకు దారి తీస్తుంది. చీరలు కట్టుకునే గృహిణులు దూరంగా అడుగులు వేస్తూ నడవలేరు. దాంతో కాళ్ల కండరాలు కీళ్లకు ఆసరానివ్వవు. వ్యాయామాలు చేయని వాళ్లలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి జీవనశైలిని కొనసాగించేవాళ్ల కీళ్లు త్వరగా అరిగిపోకుండా ఉండాలంటే వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. నడకతో కాలి కండరాలు బలపడి, కీళ్ల మీద ఒత్తిడి తగ్గుతుంది. అలాగే ఎముకలు, కీళ్లు దృఢంగా మారడానికి బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి. గుండె వేగాన్ని పెంచే కార్డియాక్ వ్యాయామాలతో పాటు కొంత వెయిట్ ట్రైనింగ్ చేయాలి. బరువును అదుపులో పెట్టుకోగలిగే ఆహార నియమాలు పాటించాలి.



ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

సమస్యను వెంటనే కనిపెట్టి సరిదిద్దుకునేవాళ్లు క్రీడాకారులు, అథ్లెట్స్ మాత్రమే! మిగతా వాళ్లందరూ కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ప్రారంభంలోనే సరిదిద్దుకోగలిగే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఈ లక్షణాలను గమనించుకుంటూ ఉండాలి.

- ఒకే కీలులో పదే పదే నొప్పి తలెత్తుతున్నప్పుడు
- వ్యాయామం చేసే సమయంలో ఒక కోణంలో కాళ్లు లేదా చేతులను లేపలేకపోతున్నప్పుడు...
- దైనందిన జీవితంలో రోజువారీ పనుల్లో ఏదో ఒక పని చేస్తున్నప్పుడు మాత్రమే కీలు సహకరించనప్పుడు... ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను కలవాలి. అలా కాకుండా నొప్పి నుంచి తప్పించుకోవడం కోసం ఆ పనులను మానేస్తే, కాలక్రమేణా సమస్య తీవ్రమై కీళ్లు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంటుంది.

చికిత్స ఇలా...

రోగి కండరాల సామర్థ్యం, కీళ్ల పరిస్థితులను అంచనా వేసిన తర్వాత, పరిస్థితిని మెరుగు పరిచే వ్యాయామాలు, ఆహార నియమాలను సూచించడం జరుగుతుంది. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోయినా, సమస్యను వెంటనే సరిదిద్దవలసిన అవసరం ఉన్న సందర్భాల్లో చికిత్సను మొదలు పెట్టవలసి ఉంటుంది. రీజనరేటివ్ చికిత్స మూడు రోజుల చికిత్స. మొదటి రోజు కీలును పరీక్షించి, లిగమెంట్ ఇంజెక్షన్ ఇచ్చి పంపించేస్తారు. రెండవ రోజు మూల కణాల కోసం తుంటి ఎముక నుంచి ఎముక మజ్జను సేకరించి, ప్రాసెస్ చేసి మూల కణాలను వేరు చేస్తారు. తర్వాత అల్ట్రాసౌండ్ ఇమేజ్ గైడెన్స్ సహాయంతో కీలులో సమస్య ఉన్న చోట మూల కణాలను ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది. ఇదంతా లోకల్ ఎనస్థీషియాతో పూర్తయిపోతుంది. రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. మూడవ రోజు మూలకణాలను ప్రేరేపించడం కోసం గ్రోత్ ఫ్యాక్టర్లయిన ప్లేట్‌లెట్లను ఇంజెక్ట్ చేయవలసి ఉంటుంది. నెల తర్వాత కొందరికి మళ్లీ ప్లేట్‌లెట్లను రెండోసారి ఇంజెక్ట్ చేయవలసి ఉంటుంది. అయితే డిస్క్ సమస్యల్లో, వేలి కీళ్లలాంటి చిన్న పాటి కీళ్లకూ ప్లేట్‌లెట్ల అవసరం ఉండదు. ఈ చికిత్సలో ఎలాంటి కోతలూ ఉండవు కాబట్టి రోగి త్వరగా కోలుకునే అవకాశాలుంటాయి. ప్రొసిజర్ తర్వాత, మూడు నుంచి నాలుగు రోజుల పాటు కదలికలను తగ్గించుకోవాలి. వారం తర్వాత వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయవలసి ఉంటుంది. జీవనశైలి మార్పులను అనుసరించవలసి ఉంటుంది.



డాక్టర్ వెంకటేష్ మొవ్వ
మేనేజింగ్ డైరెక్టర్ అండ్ రీజనరేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్,
రీజెన్ ఆర్థో స్పోర్ట్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

గుడ్ ఫుడ్

లవంగాలు తింటే?

ఉదయాన్నే లవంగం తినడం వల్ల నోట్లో లాలాజలం పెరిగి జీర్ణశక్తి మెరుగవుతుంది. అలాగే లవంగాలు తలతిరుగుడు, కడుపులో మంటలను కూడా తగ్గిస్తాయి. లవంగాలు తినడం వల్ల వయసు పైబడే వేగం కూడా తగ్గుతుంది. లవంగాన్ని నమలినప్పుడు వెలువడే సుగంధం, దాన్లోని యాంటీమైక్రోబియల్ గుణాలు నోటి ఆరోగ్యానికి దోహదపడతాయి. లవంగం నమలడం వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు....



- నోటి దుర్వాసన తొలగిపోతుంది. నోరు తాజాగా ఉంటుంది.
- దీన్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- జీర్ణశక్తిని పెంచడంతో పాటు, వ్యాధినిరోధకశక్తి సామర్థ్యాన్ని పెంచుతాయి.
- లవంగాలతో మలబద్ధకం తొలగడంతో పాటు, వీటిలోని అనాల్జెసిక్ గుణాల వల్ల ఇది సహజసిద్ధ నొప్పి నివారిణిగా కూడా పని చేస్తుంది.
- లవంగాల్లోని హెపటో ప్రొటెక్టివ్ ప్రభావాలు కాలేయ ఆరోగ్యాన్ని పెంచుతాయి. కాలేయంలో కొత్త కణాల ఉత్పత్తిని పెంచడంతో పాటు, థైమాల్, యూజినాల్ మొదలైన చురుకైన కాంపౌండ్స్‌తో కాలేయంలోని విషాలను తొలగిస్తాయి.

ఫిట్‌నెస్

బరువు ఇలా తగ్గాలి



సన్నగా మారాలనే ఉద్దేశంతో ఉపవాసాలు ఉంటారు. వ్యాయామాలు చేస్తారు. అయినా బరువు తగ్గకపోగా, నీరసం, నిస్సత్తువ ఆవరిస్తోందంటే బరువు తగ్గడం కోసం ఎంచుకున్న మార్గాలను మరోసారి విశ్లేషించాలి. మరీ ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి.

కడుపు మాడ్చుకుంటూ...

మహిళల్లో క్యాలరీల కోత హార్మోన్ల హెచ్చుతగ్గులకు దారి తీస్తుంది. నెలసరి క్రమం తప్పేలా చేస్తుంది. పోషకాలు తగ్గడం వల్ల పునరుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల ఉత్పత్తి తగ్గి గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదురు కావచ్చు. టోన్డ్ బాడీ కావాలనుకునే మహిళలు, తీసుకునే, ఖర్చుపెట్టే క్యాలరీల మధ్య సమతూకం పాటించాలి. మరీముఖ్యంగా హార్మోన్లు హెచ్చుతగ్గులు గురి కాని ఆహార నియమాలు పాటించాలి.

కార్డియోతో...

ఎక్కువ మంది కేవలం కార్డియోతోనే బరువు తగ్గవచ్చనే అపోహలో ఉంటారు. శరీరం మీద బరువు పడేలా చేసే వెయిట్ ట్రైనింగ్ వ్యాయామాలు కూడా చేస్తూ ఉండాలి. ఈ వ్యాయామాలతో ఎముకలు దృఢపడతాయి. అలాగే మజిల్ మాస్ పెంచే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాల వల్ల శరీరం క్యాలరీలను శక్తి చేసే వేగం పెరుగుతుంది. ఫలితంగా శరీరంలో పేరుకుని ఉండే అదనపు కొవ్వు కరుగుతుంది.

చేతులెత్తేస్తే...

కొంత మంది మహిళలు కొద్ది వారాల్లోనే ఊహించలేనంత ఫలితాలను ఆశిస్తూ ఉంటారు. వాటిని అందుకోలేనప్పుడు చేస్తున్న ప్రయత్నాలను ఆపేస్తూ ఉంటారు. అలాగే హఠాత్తుగా ఉపవాసాలనూ, తీవ్రమైన వ్యాయామాలనూ మొదలు పెట్టేస్తూ ఉంటారు. ఈ రెండూ శరీర ఆరోగ్యానికి హాని కలిగించేవే! ఏ వ్యాయామమైనా, ఉపవాసమైనా శరీరానికి నెమ్మదిగా అలవాటు చేయాలి. ఒక క్రమపద్ధతిని అనుసరించాలి.

హార్ట్ కేర్

గుండె పదిలంగా...

గుండెకు రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడితే గుండెపోటు వస్తుందనే విషయం అందరికీ తెలిసిందే! గుండె రక్తనాళాల్లో కొవ్వు, కొలెస్ట్రాల్‌తో కూడిన ప్లేక్స్ పేరుకోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. ఇలా ప్లేక్ పేరుకుపోవడాన్ని వైద్య పరిభాషలో 'అథెరోస్క్లెరోసిస్' అంటారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే కొన్ని అలవాట్లను అలవరుచుకోవాలి.

మాదకద్రవ్యాలు: మాదకద్రవ్యాల వాడకంతో గుండెకు రక్తసరఫరా తగ్గుతుంది. రక్తపోటు పెరగడం, రక్తనాళాలు గట్టిపడడం, గుండె గోడలు మందంగా మారడం లాంటి మార్పులు చోటు చేసుకుంటాయి.

ధూమపానం: గుండెకు ధూమపానం ప్రథమ శత్రువు. ఈ అలవాటును మానుకుంటే గుండెపోటు వచ్చే అవకాశాలు 65% తగ్గుతాయి. కాబట్టి గుండెపోటుకు గురి కాకుండా ఉండాలంటే ధూమపానం మానేయాలి.

ఒత్తిడి: ఒత్తిడి ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో పాటు గుండెపోటుకు కూడా దారి తీస్తుంది. కాబట్టి యోగా, ధ్యానం, సరిపడా నిద్ర, నడక లాంటి అలవాట్లతో ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి.



వ్యాయామం: వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జిమ్‌లో వ్యాయామాలు చేయలేని వాళ్లు నడక, ఈత, సైకిల్ తొక్కడం లాంటి వ్యాయామాలతో కూడా గుండె ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు.

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్: ఈ రకమైన ఉపవాసంతో వ్యాయామం చేయడంతో సమానమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ కోసం ఎనిమిది గంటల విండో పీరియడ్ పెట్టుకుని, ఆ వ్యవధిలోగా ఆహారాన్ని తింటూ, 16 గంటల పాటు ఉపవాసం చేయాలి.

ఒమేగా3: ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు ఇన్సులిన్ రెసిస్టెన్స్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్‌లకు దారి తీసేలా చేస్తాయి. కాబట్టి చేపలు, షియా విత్తనాలు, అవిసె గింజలు, వాల్‌నట్స్ లాంటి ఒమేగా3 సమృద్ధిగా దొరికే పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

విటమిన్లు, మినరల్స్: ఈ పోషకాలు ఎక్కువగా దొరికే పదార్థాలను తినాలి. ఇందుకోసం తాజా పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు తీసుకోవాలి.

పీచు ఎక్కువగా: ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా మనం రోజుకు 10 నుంచి 15 గ్రాముల పీచును ఆహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటాం. కానీ ఈ మోతాదును 25 నుంచి 30 గ్రాములకు పెంచుకుంటే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

చక్కెర, పిండిపదార్థాలు: ప్రాసెస్ చేసిన పదార్థాల్లో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. వీటితో గుండెకు కలిగే చేటు ఎక్కువ. కాబట్టి రోజులో మనం తీసుకునే చక్కెర 25 గ్రాములకు మించకుండా చూసుకోవాలి.

హెల్త్ వెల్త్

అయొడిన్ లోపిస్తే?

థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయొడిన్ కీలకం. కాబట్టి ఈ పోషకం లోపిస్తే, మెటబాలిజం సమస్యలు వేధిస్తాయి. మన శరీరం స్వతఃసిద్ధంగా అయొడిన్‌ను తయారు చేసుకోలేదు కాబట్టి మనం ఆహారం ద్వారా సరిపడా అయొడిన్ శరీరానికి అందేలా చూసుకోవాలి. ఈ పోషకం లోపాన్ని ఈ లక్షణాల ద్వారా కనిపెట్టి వెంటనే సరిదిద్దుకోవాలి.

- **మలబద్ధకం:** జీర్ణవ్యవస్థ పనితీరుకు థైరాయిడ్ గ్రంథి తగినంత హార్మోన్‌ను విడుదల చేయాలి. అయొడిన్ లోపంతో హార్మోన్ ఉత్పత్తి తగ్గడం మూలంగా మలబద్ధకం మొదలవుతుంది.
- **గుండె ఆరోగ్యం:** అయొడిన్ తగ్గడం వల్ల గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది. దాంతో తల తిరగడం, నిస్సత్తువలు వేధిస్తాయి.



- **గర్భధారణ:** అయొడిన్ లోపంతో థైరాయిడ్ హార్మోన్ స్రావం తగ్గడం వల్ల గర్భధారణ సాధ్యపడదు. అలాగే గర్భంలోని బిడ్డ నాడీసంబంధ ఎదుగుదలకు కూడా అయొడిన్ అవసరం. కాబట్టి గర్భం దాల్చాలనుకునే మహిళలు, గర్భిణులు థైరాయిడ్ హార్మోన్ సరిపడా ఉత్పత్తయ్యేలా ఆహారంలో అయొడిన్ ఉండేలా చూసుకోవాలి.
- **మెడ వాపు:** అయొడిన్ లోపం ప్రధాన లక్షణం మెడ వాపు. థైరాయిడ్ గ్రంథి వాపు ద్వారా ఈ లోపం బయల్పడుతుంది.
- **డిప్రెషన్:** మానసిక కుంగుబాటు, యాంగ్జయిటీలు కూడా అయొడిన్ లోపం లక్షణాలే!
- **ఆహారంతో:** అయొడిన్ లోపాన్ని అయొడిన్ కలిగి ఉండే ఉప్పుతో సరిదిద్దుకోవచ్చు. హైపోథైరాయిడ్ జీవనశైలి సమస్య కాబట్టి వైద్యుల పర్యవేక్షణలో థైరాయిడ్ హార్మోన్‌ను మాత్రల రూపంలో తీసుకుంటూ ఉండాలి.

మోరింగ మహత్తు

అత్యంత పోషకభరిత మొక్కల్లో మునగ ఒకటి. అమీనో యాసిడ్లు, పీచు, విటమిన్లు, బయోయాక్టివ్ కాంపౌండ్లను కలిగి ఉన్న మునగను ఆరోగ్య ప్రయోజనాల కోసం వాడుకోవచ్చు. వీటి ఆకులతో పొడిని తయారు చేసుకుంటే, వాడుకోగలిగే వెసులుబాటు ఎక్కువగా ఉంటుంది. మోరింగ పొడితో ఒరిగే ప్రయోజనాలు, దాన్ని వాడుకునే విధానాల గురించి తెలుసుకుందాం!

ఆకుల్లో పోషకాలు

మునగ ఆకుల్లో ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, బి విటమిన్స్, పొటాషియం, మెగ్నీషియంలతో పాటు 27 రకాల విటమిన్లు, 46 రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అలాగే క్యాల్షియం, అలాగే శరీర జీవక్రియలు సక్రమంగా సాగడానికి తోడ్పడే సూక్ష్మ పోషకాలు, బయోయాక్టివ్ కాంపౌండ్లు మునగాకుల్లో ఉంటాయి.

ఇన్‌ఫ్లమేషన్‌కు విరుగుడు

ఇన్‌ఫెక్షన్‌కు వ్యతిరేకంగా శరీరానికి రక్షణ కల్పించే క్రమంలో తలెత్తే ఇన్‌ఫ్లమేషన్ వల్ల శరీర కణజాలం దెబ్బతింటుంది. అయితే మోరింగాలో ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడే పోషకాలతో పాటు, ఫైటో న్యూట్రియెంట్స్, యాంటియాక్సిడెంట్లు, యాంటీబ్యాక్టీరియల్ కాంపౌండ్లు ఉంటాయి. ఈ శక్తివంతమైన పోషకాలన్నీ ఫ్రీ ర్యాడికల్స్‌ను లక్ష్యం చేసుకుని శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడతాయి. ఫలితంగా శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది.

లైంగిక శక్తి పెరుగుతుంది

ఒత్తిడితో ఫీల్ గుడ్ హార్మోన్, డోపమైన్ మోతాదు తగ్గి లైంగిక కోరికలు సన్నగిల్లుతాయి. మెదడు, హార్మోన్లు, భావోద్వేగాలు, నాడులు, కండరాలు.. ఇలా భిన్నమైన అంశాల సమ్మేళనంతో కూడిన క్లిష్టమైన ప్రక్రియ లైంగిక క్రియ. ఎంతో కాలంగా ఎన్నో రకాల మూలికలు కామోద్దీపనలుగా ఉపయోగపడుతున్నాయి. వాటిలో మోరింగ ఒకటి. మోరింగతో టెస్టోస్టెరాన్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి, కార్టిసాల్ తగ్గి, లిబిడో పెరుగుతుందని అధ్యయనాల్లో తేలింది. మరీ ముఖ్యంగా పురుషుల్లో ఒత్తిడి మూలంగా క్షీణించే లైంగికాసక్తి మోరింగతో పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

శక్తి పుంజుకుని

మీకు తెలుసా?



కెఫీన్ లేని ఎనర్జీ బూస్టర్‌గా మోరింగ ఉపయోగపడుతుంది. విటమిన్స్, మినరల్స్‌తో పాటు ఐరన్‌ను కూడా కలిగి ఉండే మోరింగ శక్తిని కూడా పెంచుతుంది. మోరింగలోని బి విటమిన్లు, దీర్ఘకాలపు శక్తికి తోడ్పడతాయి. అలాగే కెఫీన్ కలిగి ఉండే డ్రింక్స్ తాగడం మూలంగా తలెత్తే ఆందోళన, చికాకు లాంటివి మోరింగ డ్రింక్‌తో కలగవు.

కాగ్నిషన్, మూడ్

మోరింగలోని ట్రిప్టోఫాన్ అనే పోషకం మెదడులో సెరటోనిన్ స్రావాన్ని పెంచుతుంది. ఈ ఫీల్ గుడ్ హార్మోన్ మోటార్ ఫంక్షన్‌ను పెంచడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది. మోరింగలోని సి, ఇ విటమిన్లు మెదడుకు ఆక్సిడేటివ్ డ్యామేజీ నుంచి రక్షణ కల్పిస్తాయి.

చక్కెర అదుపులో...

దీన్లోని క్లోరోజెనిక్ యాసిడ్, ఐసోథయాసయనేట్స్ రక్తంలోని చక్కెరను అదుపులో ఉంచుతాయి. క్లోరోజెనిక్ యాసిడ్, భోజనం తిన్న వెంటనే కణాల్లోని చక్కెర విడుదల కాకుండా అడ్డుపడి, రక్తంలో చక్కెర మోతాదు పెరగకుండా నియంత్రిస్తాయి. మోరింగ.. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్స్, ఇన్సులిన్ మోతాదుల మీద సానుకూల ప్రభావాన్ని చూపిస్తున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

వృద్ధాప్య ఛాయలు దూరం

మోరింగలోని ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ ముఖం మీద ముడతలు లాంటి వృద్ధాప్య ఛాయలను దూరం చేసి, చర్మాన్ని యవ్వనంగా మారుస్తాయి. మోరింగలోని శక్తివంతమైన కాంపౌండ్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావాలను అందించి, యాంటీ ఏజింగ్ ప్రయోజనాలను కల్పిస్తాయి.

ఇలా తినాలి

- **మార్నింగ్ టీ:** గోరువెచ్చని నీళ్లలో ఒక టీస్పూను మోరింగ పొడిని కలుపుకుని, అవసరమనుకుంటే తేనె, నిమ్మరసం కలుపుకుని తాగాలి. వేడి చేయడం వల్ల మోరింగలోని యాంటీఆక్సిడెంట్లను నష్టపోయే అవకాశాలు ఉంటాయి.
- **స్మూదీల్లో:** యాపిల్, అరటి, పీనట్ బటర్, స్ట్రాబెర్రీ.. వీటితో స్మూదీ తయారుచేసుకున్నప్పుడు, దాన్లో ఒక టీస్పూను మోరింగ పొడిని కలుపుకోవచ్చు.
- **కూరల్లో:** కూరలు, పప్పు వండుకునేటప్పుడు మోరింగను కలపకుండా, వంట పూర్తయిన తర్వాత, మోరింగ్ పొడిని చిలకరించుకోవచ్చు.
- **బ్రేక్‌ఫాస్ట్:** పూరీ, భాజీ, పరాఠా, సలాడ్, ఉడకబెట్టిన గుడ్లు వీటిలో కలుపుకుని తినొచ్చు.
- **స్నాక్స్:** మోరింగ్‌ను దేన్లోనైనా కలుపుకోవచ్చు. కాబట్టి బిస్కెట్లు తయారుచేసే పిండిలో, దోసెల పిండిలో, గోధుమ పిండిలో కలుపుకుని వాడుకోవచ్చు. చట్నీలు, పకోడీల్లో కలుపుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం ● 30 జనవరి 2024
cinema@andhrajyothy.com



మా నమ్మకం నిజమైంది

'సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా మీరు ఎప్పుడూ ప్రేమని పంచుతూనే ఉన్నారు. నేను కనిపించగానే ఆనందంతో నవ్వుతూ ఉంటారు. మీ చిరునవ్వే నాకు ధైర్యం' అభిమానులను ఉద్దేశించి 'నా సామిరంగ విజయోత్సవంలో నాగార్జున అన్న మాటలివి. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం జరిగిన విజయోత్సవంలో యూనిట్ సభ్యులకు నాగార్జున షీల్డ్స్ అందించారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా మొదలు పెట్టిన తర్వాత సంక్రాంతికి వస్తుందనే నమ్మకం బయట ఎవరిలోనూ లేదు. కానీ మా టీమ్ అందరిలో ఆ నమ్మకం ఉంది. అది నిజమైంది. అనుకున్న సమయానికి చిత్రం పూర్తి కావడానికి సంగీత దర్శకుడు కీరవాణి ప్రధాన కారణం' అన్నారు. 'ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ చేసి విజయం సాధించిన దర్శకుడు విజయ్‌కి అభినందనలు. కొత్త ప్రతిభను నమ్ముతూ ఇంత ఫ్రీడమ్ ఇచ్చిన నాగార్జునకు ధన్యవాదాలు. మా మ్యూజిక్ టీమ్ కూడా చాలా కష్టపడింది' అని తెలిపారు కీరవాణి. ఒక ఫ్యాన్ బాయ్ నుంచి కో స్టార్ స్టేజ్ వరకూ నాగార్జునతో షేర్ చేసుకోవడం ఆనందంగా ఉందని నరేశ్ చెప్పారు. దర్శకుడు విజయ్ తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అందరూ తనని 'వరాలు' అని పిలవడం ఆనందంగా ఉందని హీరోయిన్ ఆషికా రంగనాథ్ చెప్పారు.

మరో 200 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప ది రైజ్' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం విదితమే. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది ఆ చిత్రం. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అతి పెద్ద విజయం కాగా, ఈ సినిమాతోనే ఆయన జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా అవార్డ్ పొందారు. దీనికి సీక్వెల్‌గా 'పుష్ప 2 ది రూల్' రూపొందుతోంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రేక్షకులలో చిత్ర యూనిట్ ఇటీవల విడుదల తేదీ ప్రకటించి జోష్ పెంచింది. తాజాగా సోమవారం మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను నిర్మాతలు ఇచ్చారు. మరో రెండు వందల రోజుల్లో 'పుష్ప 2' వస్తుందంటూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.

మహా శివరాత్రికి 'భీమా'



గోపీచంద్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా' విడుదల తేదీని ప్రకటించారు. మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న థియేటర్లకు రానుంది. ఈ సందర్భంగా సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. పోలీసు ఆఫీసర్ గెటప్‌లో ఫెరోషియస్‌గా గోపీచంద్ కనిపించారు. కన్నడ దర్శకుడు ఎ.హర్ష ఈ సినిమాతో తెలుగులోకి పరిచయమవుతున్నారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అజ్జు మహంకాళి, సంగీతం: రవి బస్రూర్, సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ, ఎడిటింగ్: తమ్మిరాజు, ఆన్‌లైన్ ఎడిటర్: కిరణ్.



సమస్యలు చెప్పాం... పరిష్కారాలూ చెప్పమన్నారు

దిల్‌రాజు

'పరిశ్రమలోని సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో గంట పదిహేను నిమిషాల పాటు నిర్మాతలందరం కలిసి చర్చించడం జరిగింది. సమస్యలేకాదు, పరిష్కారాలు కూడా మీరే చెప్పండి.. ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.' అని దిల్ రాజు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్‌రాజు మాట్లాడారు. 'పరిశ్రమలోని సమస్యలపై ఎల్లుండి ఈసీ మీటింగ్ పెడుతున్నాం. సమస్యల పరిష్కారాలతో త్వరలోనే మళ్లీ సీఎంని కలుస్తాం. ఎల్లుండి నిర్వహించే ఈసీ మీటింగ్‌లో తీసుకోబోయే నిర్ణయాలు రాబోవు తరాలకు వారధిలా ఉంటాయి.' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా చెబుతూ 'ఛాంబర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ సంక్రాంతి బరి నుంచి తొలగిన 'ఈగల్' చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. పీపుల్ మీడియా టి.జి.విశ్వప్రసాద్, వివేక్, హీరో రవితేజగార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞత తెలియజేస్తున్నాం. అదే రోజున 'ఊరుపేరు భైరవకోన' సినిమా డేట్‌ను కూడా ఎనౌన్స్ చేశారన్న విషయం ఛాంబర్ దృష్టికి రాగానే, నిర్మాతలు అనిల్ సుంకర, రాజేష్‌గార్లతో మాట్లాడటం జరిగింది. ఛాంబర్ వినతిని మన్నించి వాళ్లు కూడా తమ సినిమా డేట్‌ని ఫిబ్రవరి 16కు మార్చుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్' సినిమాకు ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తాం' అని దిల్‌రాజు తెలిపారు. 'అదే డేట్‌లో 'యాత్ర 2' రిలీజ్‌ను కూడా ఫిక్స్ చేశారు. అయితే, రాజకీయ కారణాల దృష్ట్యా ముందే డేట్ ఫిక్స్ చేసుకోవడం చేత, వాళ్లు విడుదల తేదీ మార్పుకు అంగీకరించలేదు. అలాగే, రజనీకాంత్ ప్రత్యేక పాత్ర పోషించిన 'లాల్ సలామ్' కూడా అదే డేట్‌లో విడుదల కానుంది. ఈ విషయంపై పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ వాళ్లతో చర్చిస్తే, ఆ రెండు సినిమాలవల్ల తమకు ఇబ్బంది లేదని వాళ్లు చెప్పారు' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వి.దామోదరప్రసాద్, సెక్రటరీ టి.ప్రసన్నకుమార్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధి వివేక్ కూచిభోట్ల తదితరులు మాట్లాడారు.

టీనేజ్ డ్రామాతో 'మ్యాజిక్'



ప్రతిభను ప్రోత్సహించడంతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఎప్పుడూ ముందుంటుంది. లాస్టియర్ కొత్తవారితో ఆ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం హిట్ అయింది. ఇప్పుడు మరోసారి అటువంటి మ్యాజిక్ చేయడానికి ఆ సంస్థ సిద్ధమవుతోంది. 'జెర్సీ' చిత్రం తర్వాత దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కొత్తవారితో 'మ్యాజిక్' పేరుతో సెన్సిబుల్ టీనేజ్ డ్రామా రూపొందిస్తున్నారు. తమ కాలేజీలో జరిగే ఫెస్ట్ కోసం నలుగురు టీనేజర్లు ఒక పాటను కంపోజ్ చేయడానికి చేసే ప్రయత్నాలు కథగా ఈ చిత్రం ఉంటుంది.. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే అంశాలు ఎన్నో సినిమాలో ఉన్నాయంటున్నారు.ఈ మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. గిరీశ్ గంగాధరన్ ఫొటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా నీరజ కోన పని చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వేసవిలో తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. సమర్పణ శ్రీకర్ స్టూడియోస్.



ఓ భావోద్వేగ ప్రయాణం

మణికందన్, శ్రీగౌరిప్రియ కన్న రవి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. నజేరత్ పసీలియన్, మగేశ్‌రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మాతలు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. ప్రేమికుల మోడ్రన్ డే రిలేషన్స్ నేపథ్యంలో సాగే సినిమా ఇదని, ప్రేమికులరోజు వీక్‌లో చూసేందుకు ఈ సినిమా మంచి ఆప్షన్ అని, జీవితంలోనే చూసిన అనేక సంఘటనలు ఈ కథకు స్ఫూర్తి అని, మంచి ఎమోషనల్ డ్రైవ్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ట్రూలవర్ ఒక హానెస్ట్ అండ్ ట్రూ ఫిల్మ్ అని, మోడరన్ డే రిలేషన్స్‌లో ఎత్తుపల్లాల గురించి అద్భుతంగా చెప్పిన కథ ఇదని, వాస్తవానికి దగ్గరగా సినిమా ఉంటుందని, తమిళ ప్రేక్షకులకు కూడా ఈ సినిమా ద్వారా పరిచయమవ్వడం ఆనందంగా ఉందని కథానాయిక శ్రీగౌరి ప్రియ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకొని ఎంజాయ్ చేసేలా 'ట్రూలవర్' ఉంటుదని హీరో మణికందన్ చెప్పారు. అతిథులుగా విచ్చేసిన దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్.కె.ఎన్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.

కొరటాలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

కథల కాపీరైట్స్ అంశంపై చిత్రపరిశ్రమలో వివాదాలు తలెత్తడం పరిపాటే. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'గోరింటాకు'(1979) చిత్ర కథ విషయంలోనూ గతంలో ఇటువంటి వివాదమే చోటుచేసుకుంది. కథ నాదేనంటూ రచయిత్రి రంగనాయకమ్మ, 'గోరింటాకు' చిత్ర కథారచయిత్రి రామలక్ష్మిపై కోర్టుకు వెళ్లారు. చివరకు ఆ కేసులో రంగనాయకమ్మ విజయం సాధించారు. దాదాపు అలాంటి వివాదమే మహేశ్‌బాబు 'శ్రీమంతుడు'(2015) సినిమా విషయంలో కూడా ఎనిమిదేళ్లుగా జరుగుతోంది. 'శ్రీమంతుడు' కథ తనదేనని, స్వాతి పత్రికలో ప్రచురితమైన తన కథను కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమా తీశారని శరత్‌చంద్ర అనే రచయిత అప్పట్లో సినీ రచయితల సంఘానికి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ పెద్దల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు.



న్యాయం జరిగేలా లేదని మీడియా ముందు కూడా తన గోడును వెళ్లబోసుకున్నారు. చివరకు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌పై విచారణ జరిపిన కోర్టు కొరటాలపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. దాంతో కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శరత్‌చంద్ర చూపిన ఆధారాలను నిర్ధారిస్తూ రచయితల సంఘం ఇచ్చిన నివేదనకు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, నాంపల్లి కోర్ట్ ఉత్తర్వులను సమర్థించడంతో కొరటాలకు సుప్రీంకోర్ట్ మెట్లెక్కక తప్పలేదు. ఇప్పుడు అక్కడ కూడా కొరటాలకు చుక్కెదురైంది. కొరటాల శివ దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ హృషికేశ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ విశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. సినిమా విడుదలైన 8 నెలల తర్వాత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనలను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదని కొరటాల తరఫున న్యాయవాదైన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదనలను వినిపించగా, సుప్రీం ధర్మాసనం ఆ వాదనలను తోసిపుచ్చింది. రచయితల సంఘం నివేదిక ఆధారంగానే హైకోర్ట్ నిర్ణయం తీసుకుందని, పిటీషనర్ కొరటాల పిటీషన్‌ని పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేందుకు కూడా ఏమీ లేదని సుప్రీం స్పష్టం చేసింది. 'పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటారా? మమ్మల్నే డిస్మిస్ చేయమంటారా?' అని ధర్మాసనం కొరటాల తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించింది. తామే పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటాం అని నిరంజన్‌రెడ్డి చెప్పడంతో సుప్రీం కోర్టు అనుమతి మంజూరు చేసింది.

వినోదం.. విజ్ఞానం.. వెరసి 'హ్యాపీ ఎండింగ్'

'మిగతా పరిశ్రమల్లా సినిమాని ఒక పరిశ్రమగా బయట ఇన్వెస్టర్లు ఎవరూ గుర్తించడంలేదు. ఇక్కడ ఏటా 600 సినిమాలు రిజిస్టర్ అయితే, ప్రపంచానికి తెలిసేది 150 సినిమాలే. తక్కిన 450 సినిమాలు ఏమయ్యాయి? అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. మేకింగ్‌పై అవగాహన లేకుండా థర్డ్ పర్సన్‌ను నమ్మి సినిమాలను నిర్మిస్తున్నారు. ఒక కొత్త హీరోతో కోటి రూపాయలతో తీయాల్సిన సినిమాకు మూడు కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఈ అవగాహనలేమి వల్ల కాస్ట్ ఫెయిల్యూర్ సినిమాలు ఎక్కువైపోయాయి. ఏటా 400 నుంచి 500కోట్ల వరకూ కొత్త నిర్మాతలు ఈ పరిశ్రమలో నష్టపోతున్నారు. అందుకే సినిమా తీయాలనుకునే కొత్త నిర్మాతలకు ప్రొడక్షన్ నుంచి రిలీజ్ వరకూ ఒక బ్రిడ్జ్‌లా ఉండేలా మా సంస్థ పనిచేస్తుంది.' అన్నారు నిర్మాత అనిల్ పల్లాల. యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డిలతో కలసి ఆయన నిర్మించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. యష్ పూరి, అపూర్వరావ్ జంటగా నటించారు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మేకింగ్, డిస్ట్రిబ్యూటింగ్, బిజినెస్.. అంశాలపై పూర్తి అవగాహనతో ఈ రంగంలోకి వచ్చాం. మా వింతగాధ వినుమ, జార్జిరెడ్డి చిత్రాల తర్వాత మేం నిర్మించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తిచేశాం. కొత్త హీరో కాబట్టి ప్రీరిలీజ్ బిజినెస్ గురించి ఆశించలేదు. విడుదల తర్వాత స్పందనను బట్టి బిజినెస్ చేయాలనుకున్నాం' అని తెలిపారు అనిల్ పల్లాల. కథను నమ్మి ఈ సినిమా చేశామని, వర్త్ ఉన్న సినిమా చేశామని అనుకుంటున్నామని, వికీ డోనర్, ఓమైగాడ్ 2 చిత్రంలో ఉన్నటువంటి లేయర్లు, ఎలిమెంట్స్ 'హ్యాపీ ఎండింగ్'లోనూ ఉన్నా ఇబ్బంది లేకుండా ఉంటాయని, వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించే సినిమా ఇదని నిర్మాత పేర్కొన్నారు.





వినోదానికి భావోద్వేగాల మేళవింపు

అభినవ్ గోమఠం, వైశాలి రాజ్ జంటగా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం వచ్చే నెల 23న విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు విడుదల తేదీని సోమవారం నిర్మాతలు ప్రకటించారు. తిరుపతిరావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ నిర్మించారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'హాస్య నటుడిగా, సహాయ నటుడిగా అందరి ప్రశంసలు అందుకున్న అభినవ్ లోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. భావోద్వేగాల మేళవింపుతో లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని రూపొందించాం. ప్రతి పాత్ర చాలా సహజంగా ఉంటుంది. త్వరలోనే టీజర్ విడుదల చేస్తాం' అని చెప్పారు. తరుణ్ భాస్కర్, అలీ రజా, మొయిన్, చక్రపాణి ఆనంద్, నిశల్‌గళ్ రవి తదితరులు ఈ చిత్రంలో నటించారు. కథ: అన్వర్ సాధిక్, మాటలు: రాధామోహన్ గంటి, ఫొటోగ్రఫీ: సిద్ధార్థ స్వయంభూ.

ఉత్తమ నటుడు రణబీర్, ఉత్తమ నటి అలియా

- 12thఫెయిల్ చిత్రానికి ఆరు అవార్డులు
- కలర్‌ఫుల్‌గా జరిగిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక







బాలీవుడ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఆదివారం సాయంత్రం గుజరాత్‌లో కలర్‌ఫుల్‌గా జరిగింది. 2023లో విడుదలైన చిత్రాలకు సంబంధించి విజేతలకు అవార్డులు అందించారు. గత ఏడాది 'పఠాన్', 'జవాన్', 'డంకీ' చిత్రాల వరుస విజయాలతో ముందంజలో ఉన్న షారుఖ్‌ఖాన్ పేరు ఉత్తమ నటుడిగా నామినేషన్స్ లిస్ట్‌లో ఉన్నా, ఫైనల్‌గా మాత్రం 'యానిమల్' లో అద్భుతంగా నటించిన రణబీర్ కపూర్‌కు అవార్డ్ దక్కింది. ఈ సినిమా మీద ఎంత కాంట్రవర్సీ వచ్చినా ఘన విజయం సాధించడం గమనార్హం. ఉత్తమ నటుడు అవార్డ్‌తో పాటు మరో మూడు అవార్డులు ఈ చిత్రానికి దక్కాయి. షారుఖ్ ఖాన్ 'జవాన్' చిత్రం యాక్షన్, వీఎఫ్ఎక్స్‌లకు మాత్రం రెండు అవార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బెస్ట్ యాక్టర్‌గా నామినేట్ అయిన మరో హీరో విక్కీ కౌశల్ 'డంకీ' చిత్రంతో ఉత్తమ సహాయ నటుడి అవార్డ్ పొందారు. ఇక 'రాఖీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన అలియా భట్ ఉత్తమ నటి పురస్కారం పొందారు. ఈ సినిమాలోనే నటించిన షబానా అజ్మీ ఉత్తమ సహాయ నటి అవార్డ్ సాధించారు. ఇటీవల విడుదలైన విజయం సాధించిన '12thఫెయిల్' ఉత్తమ చిత్రంగా ఎన్నిక కావడమే కాకుండా మరో ఐదు అవార్డులు పొందింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన విధు వినోద్ చోప్రా ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. మనోజ్ వాజ్‌పేయి నటించిన 'జోరామ్' క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ పొందింది.. డేవిడ్ ధావన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తారల తళుకు బెళుకులు, నృత్యాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ వేడుక సాగింది.

స్పోర్ట్స్

అండర్-19 ప్రపంచ కప్
సూపర్ సిక్స్ పోరు నేడు
భారత్ X న్యూజిలాండ్
మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ...

హాకీలో క్వార్టర్స్‌కు

ఎఫ్ఐహెచ్ ఫైవ్స్ వరల్డ్‌కప్

మస్కట్: ఎఫ్ఐహెచ్ హాకీ ఫైవ్స్ పురుషుల వరల్డ్ కప్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తమ గ్రూప్-బీలోని ఆఖరి, మూడో మ్యాచ్‌లో భారత్ 13-0 గోల్స్ తేడాతో జమైకాపై భారీ విజయాన్ని సాధించింది. మణిందర్ సింగ్ 4 గోల్స్‌తో చెలరేగగా, మన్‌జీత్, రహీల్ మన్‌దీప్ మోర్ తలా రెండు గోల్స్‌తో అదరగొట్టారు.



సోనమ్ సిల్వర్ షూట్

కైరో (ఈజిప్టు): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల హవా సాగుతోంది. సోమవారం జరిగిన పోటీల్లో యువ షూటర్ సోనమ్ మస్కార్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రజతం సాధించింది. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీపడ్డ సోనమ్ ఫైనల్స్‌లో 252.1 స్కోరు చేసి రెండోస్థానంలో నిలిచింది. జర్మనీ షూటర్ యానా జాన్సెన్‌కు స్వర్ణం, పోలెండ్‌కు చెందిన అనెటాకు కాంస్యం దక్కాయి.

పరువు నష్టం దావాకు అర్హత లేదు..



● ఢిల్లీ హైకోర్టులో ధోనీ

న్యూఢిల్లీ: తనపై వ్యాపార మాజీ భాగస్వాములు వేసిన పరువు నష్టం దావాకు అర్హత లేదని, దానిని కొట్టివేయాలని భారత జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఢిల్లీ హైకోర్టుకు నివేదించాడు. ధోనీతోపాటు కొన్ని మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమ వేదికలు తమ పరువుకు భంగం కలిగించాయంటూ ఎంఎస్ వ్యాపార మాజీ భాగస్వాములు మిహిర్ దివాకర్ ఆయన భార్య సౌమ్య దాస్ హైకోర్టును ఆశ్రయించారు.

ఇలాగైతే కష్టమే!



హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ అందరి అంచనాలను తలకిందులు చేసింది. స్పిన్నర్లకు స్వర్గధామంలా ఉండే ఉప ఖండ పిచ్‌లపై బజ్‌బాల్ గేమ్ పనికిరాదన్న అభిప్రాయాలను తోసిరాజన్న రీతిలో వారి ఆట తీరు సాగింది. చివరకు తమ వ్యూహాన్నే నమ్ముకుని 28 పరుగుల తేడాతో గెలిచి చూపించారు. వాస్తవానికి 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి కూడా భారత ఆటగాళ్లు మ్యాచ్‌ని సమర్పించుకోవడం అభిమానులకు మింగుడుపడలేదు. భారత ప్రధాన ఆయుధమైన స్పిన్‌ను ఒల్లీ పోప్ స్వీప్ షాట్లతో చెడుగుడు ఆడాడు. స్లో టర్నింగ్ పిచ్‌పైనా అశ్విన్, జడేజా, అక్షర్ ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ 400కు పైగా పరుగులు చేయడంతో భారత్ తీవ్ర ఒత్తిడికి లోనుకావాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో గతంలో ఎన్నడూ ఓ జట్టు ఇక్కడ ఇన్ని రన్స్ కొట్టలేదు. ఇక టెస్టులో 200+ ఛేదన అంటే ఏమాత్రం సులువు కాదు. కానీ ఐదు సెషన్లున్న వేళ భారత బ్యాటర్లు కాస్త సహనంతో ఆడాల్సిందన్న అభిప్రాయం అంతటా వ్యక్తమైంది. ఓ అరంగేట్ర స్పిన్నర్‌కు ఏడు వికెట్లు సమర్పించుకుని తెల్లమొహం వేయాల్సి వచ్చింది. యువ ఆటగాళ్లు స్పిన్‌పై ఎదురుదాడికి దిగేందుకు భారీ షాట్లను నమ్ముకుని మూల్యం చెల్లించుకున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే.. రిస్క్ తీసుకోకుండా సింగిల్స్, డబుల్స్‌తోనూ వారిపై ఒత్తిడి పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో ద్రవిడ్, లక్ష్మణ్ ఇలాగే ఆడుతూ ఆదుకునేవారు. ప్రస్తుత జట్టులో కోహ్లీ మాత్రమే అలాంటి ఆటతీరును ప్రదర్శిస్తాడని చెప్పవచ్చు. లెఫ్టామ్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తన బలహీనతకు కూడా ఈ తరహా ఆటతీరుతోనే అధిగమిస్తాడు. స్పిన్‌ను ఆడేటప్పుడు మణికట్టు, పాదాల కదలిక ఎక్కువ ప్రభావం చూపుతుందనే విషయాన్ని యువ ఆటగాళ్లు మరిచిపోరాదని మాజీలు సూచిస్తున్నారు.

గతంలా కాదు..

2021లోనూ ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటించినప్పుడు తొలి టెస్టును గెలిచి.. ఆ తర్వాత మూడింటిని ఓడింది. అయితే ఆ సమయంలో కోహ్లీ, రహానె, పంత్ మిడిలార్డర్‌లో స్పిన్‌ను అద్భుతంగా ఎదుర్కోగలిగారు. కానీ ఈసారి రెండో టెస్టులో ఆ త్రయం లేదు. ఇటు చూస్తే శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్.. స్పిన్ బౌలింగ్‌లో ఇబ్బందిపడుతుంటారు. వాస్తవానికి ఈ ఇద్దరూ గత పది ఇన్నింగ్స్‌లో ఎలాంటి ప్రభావమూ చూపలేదు. ఇక, విశాఖ టెస్టుకు జడేజా, రాహుల్ దూరమవడం మరో దెబ్బ. అటు విజయం రుచి చూసిన ఇంగ్లండ్‌ను నిలువరించడం మనోళ్లకు పెద్ద సవాలే. ఈ మ్యాచ్ కోసం ఎలాంటి పిచ్‌ను రూపొందించినా సమష్టి ఆటతీరును ప్రదర్శిస్తేనే ఫలితం కనిపిస్తుంది. అప్పటి రూట్ సేనలా కాకుండా ప్రస్తుతం మెకల్లమ్ శిక్షణలో ఉన్న ఇంగ్లండ్ జట్టు పూర్తి విభిన్నంగా ముందుకెళ్తోంది. అందుకే 2-0తో వారికి ఆధిక్యం అప్పగిస్తే తిరిగి కోలుకోవడం కష్టమే. ఏదిఏమైనా తమ మైండ్‌సెట్‌తో పాటు బ్యాటింగ్‌లో లోపాలను కూడా రోహిత్ సేన వెంటనే సరిచేసుకుని దాడి ఆరంభించాల్సి ఉంది.


(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

రెండో టెస్టుకు జడేజా, రాహుల్ దూరం

సర్ఫరాజ్‌కు పిలుపు
సౌరభ్, సుందర్‌లకు కూడా..


సర్ఫరాజ్


సౌరభ్


సుందర్

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో అనూహ్య పరాజయం పాలైన మర్నాడే భారత క్రికెట్ జట్టుకు మరో షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు విడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ గాయాలతో విశాఖలో జరిగే రెండో టెస్టుకు దూరమయ్యారు. దీంతో దేశవాళీ క్రికెట్‌లో టన్నులకొద్దీ పరుగులు సాధిస్తున్నా జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న సర్ఫరాజ్ ఖాన్‌కు ఎట్టకేలకు పిలుపొచ్చింది. అలాగే యూపీ లెఫ్టామ్ స్పిన్నర్ సౌరభ్ కుమార్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు కూడా సెలెక్టర్లు టెస్టు జట్టులో చోటు కల్పించారు. ఇప్పటికే విరాట్ వ్యక్తిగత కారణాలతో తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడు. తాజాగా జడ్డూ తొడ కండరాల గాయం, రాహుల్ కుడి కాలి కండరాల నొప్పితో అందుబాటులో లేకపోవడం జట్టుకు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. రంజీల్లో నిలకడగా పరుగులు సాధిస్తున్న సర్ఫరాజ్ ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ లయన్స్‌పై శతకంతో ఆకట్టుకున్నాడు.

రెండో టెస్టుకు భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, శ్రేయాస్, భరత్, ధ్రువ్ జురెల్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్, బుమ్రా, అవేశ్, రజత్, సర్ఫరాజ్, వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్.

ఐదో స్థానానికి టీమిండియా

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు రెండు నుంచి ఐదో స్థానానికి పడిపోయింది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమే ఇందుకు కారణం. ఆసీస్ టాప్‌లో ఉండగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ తర్వాత స్థానంలో టీమిండియా కొనసాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో భారత్ ఆడిన ఐదు టెస్టుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఓ డ్రాతో ఉంది. అటు ఆసీస్‌పై అద్భుత విజయం సాధించిన విండీస్ జట్టు ఇంగ్లండ్‌ను వెనక్కినెట్టి ఏడో స్థానానికి వెళ్లింది.

బుమ్రాకు మందలింపు

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో బుమ్రా తన ప్రవర్తనతో ఐసీసీ మందలింపునకు గురయ్యాడు. ప్రత్యర్థి రెండో ఇన్నింగ్స్ 81వ ఓవర్‌లో పోప్ వికెట్ల మధ్య పరుగు తీస్తున్నప్పుడు బుమ్రా ఉద్దేశపూర్వకంగానే అతడికి అడ్డుగా వెళ్లి ఢీకొన్నాడు. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో మందలింపుతో పాటు అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది.

రింకూ సింగ్ తండ్రి సిలిండర్ల డెలివరీ పనిలోనే..



నెట్‌లో వీడియో వైరల్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో సంచలన బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించిన రింకూ సింగ్.. గతేడాది భారత జట్టులో చోటు దక్కించుకొన్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో అద్భుత ఫినిషర్‌గా రాణిస్తున్న రింకూ పేరు అంతటా మార్మోగి పోతోంది. అయితే, తాజాగా అతడి తండ్రి ఖాన్‌చంద్ సింగ్ వీడియో ఒకటి నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఖాన్‌చంద్ గ్యాస్ సిలెండర్లు డెలివరీ చేస్తుంటాడు. కొడుకు అంతర్జాతీయ క్రికెటర్ అయినా.. చంద్ మాత్రం తన వృత్తిని వీడలేదు. దీంతో 'చేసే పనిని దైవంగా భావిస్తున్నారు, మూలాలు మరువలేదు, మీ ఫ్యామిలీ సూపర్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 'నాన్నను విశ్రాంతి తీసుకోవాలని కోరా. కానీ, ఆయన కష్టపడడాన్నే ఇష్టపడతార'ని రింకూ ఇటీవలే మీడియాతో చెప్పాడు.

60 ఏళ్ల తర్వాత..



● పాక్‌లో భారత డేవిస్ కప్ జట్టు
● అధ్యక్ష తరహా భద్రత

ఇస్లామాబాద్: అరవై ఏళ్ల తర్వాత భారత డేవిస్‌కప్ జట్టు తొలిసారి పాకిస్థాన్‌లో అడుగుపెట్టింది. డేవిస్ కప్ గ్రూప్-1 ప్లేఆఫ్స్‌లో భాగంగా వచ్చేనెల 3, 4 తేదీల్లో పాక్‌తో భారత్ తలపడనుంది. ఆదివారం రాత్రి ఇక్కడకు చేరుకొన్న ఐదుగురు సభ్యుల భారత జట్టుకు అధ్యక్ష తరహా భద్రతను కల్పించారు. ప్లేయర్ల భద్రతపై ఆందోళన వ్యక్తమవడంతో.. ఎక్కడా రాజీపడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు పాకిస్థాన్ టెన్నిస్ సమాఖ్య తెలిపింది. భారత బృందం చుట్టూ నాలుగు లేదా ఐదంచెల భద్రతా వలయం ఉంటుందని చెప్పింది. 1964లో చివరిసారి భారత డేవిస్‌కప్ జట్టు పాక్‌లో పర్యటించింది. 1973, 2019లో తటస్థ వేదికలపై పాక్‌తో తలపడింది. అయితే, ఈసారి వేదికను మార్చాలని అఖిల భారత టెన్నిస్ సమాఖ్య తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యపడలేదు.

కోహ్లీ నామీద ఉమ్మాడు

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఎల్గర్



కేప్‌టౌన్: ఓ టెస్ట్ మ్యాచ్ సందర్భంగా టీమిండియా బ్యాటర్ విరాట్ కోహ్లీ తనపై ఉమ్మాడని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ వెల్లడించాడు. అయితే అతడి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు సహచరుడు ఏబీ డివిల్లీర్స్ జోక్యంతో ఆ సంఘటనపై విరాట్ తనకు క్షమాపణ చెప్పాడని తెలిపాడు. భారత్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్టుల సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఎల్గర్ వైదొలగిన సంగతి తెలిసిందే. ఏ టెస్ట్ సిరీస్ సందర్భంగా ఆ ఘటన చోటుచేసుకున్నదో ఎల్గర్ వెల్లడించలేదు. కానీ అది 2015లో భారత్‌లో సౌతాఫ్రికా జట్టు పర్యటన అని భావిస్తున్నారు. 'అశ్విన్ బౌలింగ్‌ను నేను ఎదుర్కొనే క్రమంలో నాకు, విరాట్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సందర్భంగాలో అతడు నాపై ఉమ్మాడు' అని 'బాంటర్ విత్ ద బాయ్స్' అనే పాడ్‌కాస్ట్‌లో ఎల్గర్ తెలిపాడు. 'ఆ ఉదంతం గురించి తర్వాత తెలుసుకున్న డివిల్లీర్స్..నా సహచరుడిపై ఉమ్మడం సరికాదని కోహ్లీతో అన్నాడు' అని వివరించాడు. 'రెండు సంవత్సరాల తర్వాత సౌతాఫ్రికాలో టూర్ సమయంలో విరాట్ నాకు క్షమాపణ చెప్పాడు. సిరీస్ ముగిసిన తర్వాత మనిద్దరం కలిసి డ్రింక్ చేసేందుకు వెళ్దామని కూడా ప్రతిపాదించాడు. అలా మేం ఇద్దరం తెల్లవారుజామున మూడింటి వరకూ తాగాం' అని ఎల్గర్ వెల్లడించాడు.

ఆంధ్ర ఘన విజయం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర 126 పరుగులతో ఘన విజయం సాధించింది. 320 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 20/0తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్ 193 పరుగులకు ఆలౌటైంది. ప్రశాంత్, నితీశ్ చెరో మూడేసి, పృథ్వీరాజ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఏపీకి ఆరు పాయింట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 431, రెండో ఇన్నింగ్స్‌లో 150/2 డిక్లేర్డ్ స్కోరు చేసింది. ఇక..ఛత్తీస్‌గఢ్ మొదటి ఇన్నింగ్స్‌లో 262 పరుగులు సాధించింది.

హరియాణా గెలుపు

పట్నా: ప్రొ.కబడ్డీ లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో హరియాణా జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరచుకుంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 32-20తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది.

బిజినెస్

'వి హబ్'తో ఆస్ట్రేలియా ఒప్పందం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని 'వి హబ్'తో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఒక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఓమ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ విషయం ప్రకటించారు. ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా మహిళలు, అణగారిన వర్గాలు, ఎల్‌జీబీటీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వి హబ్‌లో వ్యాపార నైపుణ్యాల్లో 'స్టార్ట్ ఎక్స్' పేరుతో 13 వారాల ప్రీ ఇంక్యుబేషన్ కోర్సు అందిస్తారు. వి హబ్‌తో ఒక విదేశీ ప్రభుత్వం ఈ తరహా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారని ఆస్ట్రేలియా హైకమిషనర్ తెలిపారు.

పవర్‌మెక్‌కు రూ.645 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్: రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), నైవేలి ఉత్తరప్రదేశ్ పవర్ లిమిటెడ్ (ఎన్‌యూపీపీఎల్) నుంచి రూ.644.91 కోట్ల విలువ గల ఆర్డర్లు అందుకున్నట్టు పవర్ మెక్ ప్రాజెక్ట్స్ సోమవారం ప్రకటించింది. సెంట్రల్ రైల్వేకు చెందిన మహారాష్ట్రలోని యావత్మాల్-నాందేడ్ కొత్త బ్రాడ్ గేజ్ మార్గం నిర్మాణ ప్రాజెక్టు (రూ.381.34 కోట్లు) ఒకటి కాగా ఘటంపూర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమగ్ర నిర్వహణ, మెయింటెనెన్స్ ప్రాజెక్టు (రూ.263.57 కోట్లు) మరొకటని తెలిపింది.

6.5% పెరిగిన ఐటీసీ లాభం

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఐటీసీ లిమిటెడ్... కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,400.51 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.5,070.09 కోట్లు)తో పోల్చితే లాభం 6.5 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రెవెన్యూలు కూడా రూ.19,020.65 కోట్ల నుంచి రూ.19,484.50 కోట్లకు పెరిగాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▲	57,800 ▲	77,700 ▲
ముంబై	62,515 ▲	57,264 ▲	71,371 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	520	విశాఖపట్నం	565
30 జనవరి		వరంగల్	522
చిత్తూరు	573		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	గోదావరి 113	
వరంగల్	109	విజయవాడ	113
కరీంనగర్	109	గుంటూరు	114
మహబూబ్‌నగర్	109	ఒంగోలు	114
కర్నూలు	109	చిత్తూరు	123
విశాఖపట్నం	110		

బుల్ చెలరేగెన్..



సెన్సెక్స్ 1,241 పాయింట్లు అప్

21,700 ఎగువకు నిఫ్టీ

రిలయన్స్, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో భారీగా లాభపడిన సూచీలు

ఒక్కరోజులో రూ.6 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో భారీగా లాభపడ్డాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. ఇంట్రాడేలో 1,309 పాయింట్లు ఎగిసి 72,000 స్థాయిని దాటిన సెన్సెక్స్.. చివరికి 1,240.90 పాయింట్ల (1.76 శాతం) లాభంతో 71,941.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 385 పాయింట్ల (1.80 శాతం) వృద్ధితో 21,737.60 వద్దకు చేరుకుంది. గత ఏడాది డిసెంబరు 4 తర్వాత సూచీలకిది అతిపెద్ద లాభం. కొనుగోళ్ల హోరుతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.09 లక్షల కోట్ల మేర పెరిగి రూ.377.20 లక్షల కోట్లుగా (4.53 లక్షల కోట్ల డాలర్లు) నమోదైంది.

రిలయన్స్.. రూ.19.60 లక్షల కోట్లు

రూ.2,900 స్థాయికి కంపెనీ షేరు

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రివ్వున ఎగిసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ధర ఒకదశలో 7.18 శాతం వృద్ధితో రూ.2,905 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి షేరు 6.86 శాతం లాభంతో రూ.2,896.15 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.26 లక్షల కోట్ల మేర పెరిగి మొత్తం రూ.19.59 లక్షల కోట్లకు చేరుకుంది. రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ.19 లక్షల కోట్ల మైలురాయిని దాటం ఇదే తొలిసారి. సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ లాభంలో 37 శాతం వాటా రిలయన్స్‌దే. గత మూడు సెషన్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు లాభాల్లో పయనిస్తోంది. ఈ మూడ్రోజుల్లో 9 శాతం పెరిగాయి. ఈ నెలలో ఇప్పటివరకు 12 శాతం వృద్ధి కనబర్చింది.

30లో 25 లాభాల్లో..

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 లాభాల్లో పయనించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు దాదాపు 7 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎల్ అండ్ టీ, కోటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీ షేర్లు మూడు శాతానికి పైగా పుంజుకోగా.. అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్ 2 శాతానికి పైగా పెరిగాయి. త్రైమాసిక ఫలితాల విడుదల నేపథ్యంలో ఐటీసీ షేరు 1.20 శాతం క్షీణించి సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అర శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.68 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.03 శాతం పెరిగాయి. రంగాలవారీ సూచీల్లోనూ ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్ తప్ప మిగతావన్నీ లాభపడ్డాయి. ఎనర్జీ రంగ సూచీ ఏకంగా 5.29 శాతం వృద్ధి చెందగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 4.94 శాతం, పవర్ 3.03 శాతం పెరిగాయి. సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ ఇండెక్స్‌లు రెండు శాతానికి పైగా ఎగబాకాయి. బ్యాంకెక్స్ 1.42 శాతం బలపడింది.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు క్షీణించి 83.16 వద్ద ముగిసింది. ముడి చమురు ధరల పెరుగుదల, ఇంధన దిగుమతిదారులు డాలర్ కొనుగోళ్లకు పాల్పడటం మన కరెన్సీని బలహీనపరిచింది.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 83.05 డాలర్ల వద్ద ట్రేడైంది. ఇరాన్ మిలిటెంట్లకు చెందిన డ్రోన్ అమెరికా సాయుధ దళాలపై దాడి జరిపిన నేపథ్యంలో బైడెన్ సర్కారు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది. ఈ పరిణామంతో ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడవచ్చన్న ఆందోళనలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి.

కలిసివచ్చిన అంశాలు..

- ఆసియా స్టాక్ మార్కెట్లలో ర్యాలీ
- మధ్యంతర బడ్జెట్‌పై సానుకూల అంచనాలు
- ఈ మధ్య భారీగా నష్టపోయిన బ్యాంకింగ్, ఇతర షేర్లలో తిరిగి కొనుగోళ్లకు పాల్పడిన ఇన్వెస్టర్లు
- తాజాగా విడుదలైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ఉండటం

హెరిటేజ్ ఫుడ్స్ లాభంలో 96% వృద్ధి

హైదరాబాద్: హెరిటేజ్ ఫుడ్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.941.10 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.26.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 19.7 శాతం వృద్ధి చెందగా లాభం ఏకంగా 96.4 శాతం వృద్ధి చెందిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల నుంచి వచ్చిన ఆదాయం 23.19 శాతం పెరిగిందని పేర్కొంది. అలాగే పాల విక్రయాల్లో 2.32 శాతం వృద్ధి నమోదైందని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో మంచి పనితీరును కనబరిచామని, వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల విభాగం పటిష్ఠమైన వృద్ధి సాధించటం ఎంతగానో కలిసివచ్చిందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. అంతేకాకుండా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరణ, కొత్త ఉత్పత్తుల విడుదల కూడా ఇందుకు దోహదపడిందన్నారు. కాగా రానున్న రోజుల్లో ఇదే జోరును కనబరచవచ్చని విశ్వసిస్తున్నట్లు బ్రహ్మణి చెప్పారు. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను కంపెనీ రూ.2,843.30 కోట్ల

అజాద్ ఇంజనీరింగ్‌తో రోల్స్ రాయిస్ ఒప్పందం

హైదరాబాద్: రక్షణ రంగానికి అవసరమైన ఏరో ఇంజన్ విడిభాగాలు తయారు చేయడంలో సహకారానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన అజాద్ ఇంజనీరింగ్‌తో రోల్స్-రాయిస్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ దీర్ఘకాలిక ఒప్పందం కింద అజాద్ ఇంజనీరింగ్ కంపెనీ రక్షణ విమానాల ఇంజన్ల విడిభాగాలు తయారు చేసి సరఫరా చేస్తుంది. ఆ రకంగా రోల్స్ రాయిస్‌కు చెందిన సాంకేతికంగా ఆధునికమైన ఏరో ఇంజన్ల ప్రపంచ సరఫరా విభాగంలో ఒక భాగస్వామిగా మారుతుంది. అజాద్ ఇంజనీరింగ్ భాగస్వామ్యంలో తాము భారతదేశంలో సరఫరా వ్యవస్థను విస్తరించాలనుకుంటున్నామని రోల్స్-రాయిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలెక్స్ జినో అన్నారు. దేశంలో తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలన్న తమ లక్ష్యం సైతం దీనితో తీరుతుందని ఆయన తెలిపారు. అత్యంత సంక్లిష్టమైన ఈ విడిభాగాల తయారీని భారత్‌కు తీసుకురావడం తమ సామర్థ్యాలకు నిదర్శనమే కాదు... భారత ఏరోస్పేస్, రక్షణ పరిశ్రమకు అత్యంత కీలకం అని అజాద్ ఇంజనీరింగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాకేశ్ చోప్దార్ అన్నారు. అత్యాధునిక తయారీ విభాగాల్లో నానాటికీ పెరుగుతున్న భారతదేశ శక్తిని ఇది నిరూపిస్తున్నదని ఆయన చెప్పారు.

'కార్వీ' కేసులో ఒత్తిడి చేయొద్దు

ఒత్తిడి చేస్తే దుకాణం మూతే : ఎన్ఎస్‌డీఎల్

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో తమపై దయ చూపాలని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్).. సుప్రీంకోర్టును కోరింది. గత ఏడాది డిసెంబరు 13న సెక్యూరిటీస్ అప్పిలేట్ అథారిటీ ట్రిబ్యునల్ (శాట్) ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఒత్తిడి చేయవద్దని కోరింది. శాట్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాల్సి వస్తే, సంస్థను మూసివేయడం తప్ప తమ క్లయింట్‌కు మరో మార్గం లేదని ఎన్ఎస్‌డీఎల్ తరఫు న్యాయవాది ఆర్యమ సుందరం సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపారు. సెబీ ఆదేశాల ప్రకారం ఎన్ఎస్‌డీఎల్ కార్వీ స్టాక్ బ్రోకింగ్ డీమ్యాట్ ఖాతాలను స్తంభింపచేయడం 'బహిరంగ దారిదోపిడీ' అని శాట్ గత ఏడాది ఇచ్చిన తీర్పులో పేర్కొంది. అంతేకాకుండా ఇందుకు సెబీ, ఎన్ఎస్‌డీఎల్, ఎన్ఎస్ఈ సంస్థలు షేర్లు తాకట్టు పెట్టుకుని కార్వీకి అప్పులిచ్చిన బ్యాంకులకు రూ.1,433 కోట్ల మొత్తాన్ని ఏటా 10 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్ఎస్‌డీఎల్ దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

● తగ్గిన వొడాఫోన్ ఐడియా నష్టాలు

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా (వీఐఎల్).. డిసెంబరు త్రైమాసికంలో రూ.6,986 కోట్ల నికర నష్టాలను మూటగట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.7,990 కోట్లు)తో పోల్చితే నష్టం తగ్గింది. త్రైమాసిక సమీక్షా కాలంలో రూ.755.5 కోట్ల వన్‌టైమ్ ఆదాయం రావటంతో నష్టం తగ్గిందని పేర్కొంది. కాగా ఈ కాలంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.10,620.6 కోట్ల నుంచి రూ.10,673.10 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో ఒక్కో వినియోగదారుడు నుంచి వచ్చిన సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 7.7 శాతం వృద్ధి చెంది రూ.145కు పెరిగింది. ఎంట్రీ లెవల్ ప్లాన్‌లో మార్పులు, సబ్‌స్క్రైబర్ అప్‌డేట్స్‌తో ఇది పెరిగిందని పేర్కొంది.

● ఎన్‌టీపీసీ లాభం రూ.5,209 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.5,208.87 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.4,854.36 కోట్లు)తో పోల్చితే లాభం 7 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం రూ.44,989.21 కోట్ల నుంచి రూ.43,574.65 కోట్లకు తగ్గింది. ఇదే కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.37,007.51 కోట్ల నుంచి రూ.38,782.22 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2.25 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

24 గంటల ట్రేడింగ్‌పై జర జాగ్రత్త

సెబీ చీఫ్ మాధవి



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లో 24 గంటలు ట్రేడింగ్‌ను అనుమతించాలన్న సూచనపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెబీ అయితే ఇప్పటి వరకు దీనిపై ఒక అభిప్రాయానికి రాలేదన్నారు. అలాగే ఏ ఒక్కరి నుంచీ తమకు దీనికి సంబంధించిన ప్రతిపాదనా రాలేదన్నారు. స్టాక్ బ్రోకర్లు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ విషయం స్పష్టం చేశారు. బ్రోకర్లు మాత్రం మదుపరుల అభిప్రాయాలు సేకరించి వచ్చే నెలాఖరులోగా తమ అభిప్రాయం తెలియజేస్తామన్నారు. 24 గంటల ట్రేడింగ్‌ను అనుమతించడం వల్ల కొన్ని అనర్థాలు కూడా ఉంటాయని సెబీ చీఫ్ హెచ్చరించారు. ప్రస్తుత మౌలిక సదుపాయాలతో 24 గంటల ట్రేడింగ్ సాధ్యం కాదని ఆమె తేల్చి పారేశారు. ఈ విషయంలో ఈక్విటీ మార్కెట్లకు, కమోడిటీస్ మార్కెట్‌కు అసలు పోలికే లేదన్నారు. ప్రస్తుతం ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు మాత్రమే రెగ్యులర్ క్యాష్ సెగ్మెంట్‌తో పాటు డెరివేటివ్స్ ట్రేడింగ్‌ను అనుమతిస్తున్నారు.

సంయుక్త సర్వే చేయాల్సిందే!

పోలవరం ముంపుపై తెలంగాణ...కమిటీ ఏర్పాటుకు ఏపీ ఓకే

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల కలిగే ముంపుపై సంయుక్త సర్వే చేయాల్సిందేనని తెలంగాణ స్పష్టం చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని సీడబ్ల్యూసీకి చెందిన కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో)లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సమావేశం శివనందన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఏపీ నుంచి శశిభూషణ్‌కుమార్, సి.నారాయణరెడ్డి; తెలంగాణ నుంచి మోహన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్రమణ్యప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలవరం బ్యాక్ వాటర్ వల్ల కలిగే ముంపుపై సంయుక్త సర్వే చేపట్టాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)తో పాటు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరంతో ముంపు ఉంటుందని తేలిందని, వర్షాకాలంలోపు సంయుక్త సర్వే చేపట్టి, ముంపునకు గురయ్యే ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరింది. దీనిపై తొలుత అభ్యంతరం వ్యక్తం చేసిన ఏపీ, చివరికి అంగీకారం తెలిపింది. సంయుక్త సర్వే లాంఛనాలను పూర్తిచేయడానికి త్రిసభ్య కమిటీ (తెలంగాణ, ఏపీ, పీపీఏలకు చెందిన సీఈలు) ఏర్పాటుకు అంగీకరించింది. ఇక పీపీఏ కార్యాలయం రాజమహేంద్రవరానికి తరలించడానికి సమ్మతి తెలుపుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇచ్చిన లేఖను తెలంగాణ ప్రతినిధులు అందించారు. పీపీఏ క్యాంపు కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లోనే ఉండనుంది. పోలవరం ప్రాజెక్టు గెజిట్ ప్రకారం పీపీఏలో తమ అధికారులను నియమించాలని తెలంగాణ కోరింది.

షకీల్ కుమారుడి కేసులో మాజీ సీఐకి బెయిల్

మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు కోసం గాలింపు

పంజాగుట్ట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పంజగుట్ట ప్రజాభవన్ వద్ద గత నెలలో కారు బారికేడ్లను ఢీ కొట్టిన కేసులో అరెస్టయిన బోధన్ మాజీ సీఐ ప్రేమ్ కుమార్‌కు సోమవారం బెయిల్ లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు నిజామాబాద్ జిల్లా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయికి పారిపోయేందుకు సహకరించారని బోధన్ మాజీ సీఐ ప్రేమ్ కుమార్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 28న అయన్ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా న్యాయమూర్తి ఆయనకు బెయిలు మంజూరు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు అరెస్టు అవగా, పంజగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నా ఎంపికను వివాదం చేయడం సరికాదు: కోదండ

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా తన ఎంపికను వివాదం చేయడం సరికాదని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. రాజ్యాంగ పరంగా సామాజిక సేవ చేసిన వారికి అవకాశం ఇస్తారని, తాను తెలంగాణ ఉద్యమంతోపాటు సుదీర్ఘకాలంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నది అందరికీ తెలుసని చెప్పారు. ఈ అంశాన్ని పదేపదే వివాదం చేయడం సమంజసంకాదని సూచించారు. ఎమ్మెల్సీలుగా ఎంపికైన కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌లు ప్రమాణ స్వీకారం చేసేందుకు సోమవారం శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చాంబర్‌కు వెళ్లారు. ఉదయం 11.30 గంటలకు వెళ్లిన వారు రెండు గంటల పాటు ఎదురు చేసినా ఛైర్మన్ రాలేదు. ఛైర్మన్ గొంతు ఇన్‌ఫెక్షన్, జ్వరం కారణంగా రాలేకపోతున్నట్లు సమాచారం పంపారని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయ ఉద్యోగులు వెల్లడించారు. అయితే బీఆర్ఎస్ అధినాయకత్వం ఒత్తిడి మేరకే మండలి ఛైర్మన్ రావట్లేదన్న ప్రచారం కాంగ్రెస్‌వర్గాల్లో జరిగింది. అనంతరం మీడియాతో కోదండరాం మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9.30 గంటలకు తమ ప్రమాణ స్వీకారానికి అవకాశం ఇవ్వాలని అధికారులను కోరినట్లు చెప్పారు.

అనారోగ్యం కారణంగానే బయటకు రావట్లేదు

కార్యాలయంలో లేనని దుష్ప్రచారం తగదు: గుత్తా

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు తన కార్యాలయానికి వచ్చినా.. తాను లేనంటూ దుష్ప్రచారం చేయడం తగదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గొంతు నొప్పి, జ్వరంతో బాధపడుతున్నందున తాను బయటకు రావడం లేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగానే 26న మండలిలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నా సాయంత్రం జరిగిన గవర్నర్ ఎట్ హోం కార్యక్రమానికి హాజరు కాలేకపోయానన్నారు. ఎమ్మెల్సీ కోదండరాంతోపాటు ఇతర ఎమ్మెల్సీలు ముందస్తు సమాచారం లేకుండా తన కార్యాలయానికి వచ్చారని, ఆ సమయానికి తాను లేకపోవడంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్ గౌడ్ మాత్రం తనను కలిసి 31న ప్రమాణ స్వీకారానికి సమయం ఇవ్వాలని కోరారని, ఆయనతోపాటు ఇతర ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించాన్నారు.

ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియనుండటంతో.. ఆ తర్వాతి రోజు నుంచి ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీల పాలనను చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి మండలాల వారీగా ఆయా గ్రామాలకు అధికారులను ఎంపిక చేశారు. వారంతా ఫిబ్రవరి 2 నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల పరిధిలోని సీనియర్ అసిస్టెంట్, ఆపైస్థాయి అధికారులను, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం(మిషన్ భగీరథ) అసిస్టెంట్ ఇంజనీర్లు, మండల విద్యాధికారులు, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యానవనశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లను రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు.

8 ప్రజారోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), 6 ఆరోగ్య ఉప కేంద్రాలు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల సర్టిఫికెట్(ఎన్‌క్వాస్)కు ఎంపికైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్, అడిషనల్ సెక్రటరీ లేఖ రాశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట, వనపర్తి జిల్లా కమలాద్దీన్‌పూర్ పీహెచ్‌సీలతోపాటు కరీంనగర్ జిల్లా కొండపాక, నల్గొండ జిల్లా వింజమూరు, సూర్యాపేట జిల్లా యండ్లపల్లి, కాసర్లపహాడ్, ఆదిలాబాద్ జిల్లా వాఘాపూర్, నిపణి ఆరోగ్య ఉప కేంద్రాలు ఈ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యాయి. ఈ గుర్తింపు పొందిన ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం మూడేళ్లపాటు నేరుగా నిధులిస్తుంది. ఏటా పీహెచ్‌సీలకయితే రూ.3 లక్షలు, సబ్ సెంటర్లకు రూ.2 లక్షల చొప్పున ఇస్తారు. ఈ నిధులతో ఆయా ఆరోగ్య కేంద్రాలను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆ సవరణలతో సహకార రంగం నిర్వీర్యం

సహకార ధర్మ పీఠం వ్యవస్థాపకుడు భూమయ్య

కేంద్ర ప్రభుత్వం సహకార రంగంలో తీసుకొచ్చిన చట్ట సవరణలు వాటి మౌలిక స్వభావమే మార్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేలా ఉన్నాయని సహకార ధర్మ పీఠం వ్యవస్థాపకుడు సంబారపు భూమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సవరణలపై ప్రజలను చైతన్యపరిచేందుకు, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న సెక్షన్లను ఉపసంహరించుకునేందుకు 2023 డిసెంబరు 28 నుంచి 2024 మార్చి 24 వరకు సహకార్ ధర్మ్ రక్షక్ మహాభారత్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో 60 శాతం ప్రజల స్వతంత్ర ఆర్థిక వ్యవస్థకు మూలమైన సహకార సంస్థలు కేంద్రం చేసిన సవరణల వల్ల ప్రైవేటు రంగం పాలయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

హైకోర్టులో ఎన్నికల పిటిషన్లపై ఈసీ ఆరా

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల అనంతరం హైకోర్టులో దాఖలైన ఎలక్షన్ల పిటిషన్లపై ఎన్నికల సంఘం (ఈసీ) ఆరా తీస్తోంది. వీటికి ఎలాంటి సమాధానాలు ఇవ్వాలనేదానిపై అధ్యయనం చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 24 మంది ఎమ్మెల్యేలపై ఎన్నికల పిటిషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల అఫిడవిట్లు, వ్యక్తిగత వివరాలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన వంటి విషయాలు కాకుండా ఈవీఎంలు, ఓట్ల లెక్కింపుపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తోంది. ఎన్నికల నియమావళి ప్రకారం ఫలితాలు వెల్లడించిన తరువాత 45 రోజుల్లోపు ఓట్ల లెక్కింపు, ఈవీఎంలు, వీవీప్యాట్ల సమస్యలపై ఎలక్షన్ పిటిషన్లు (ఈపీ) దాఖలైతే ఈవీఎంల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని రీబూట్ చేయకుండా అలాగే ఉంచాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలోఉంచుకొని ఏయే నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరచాలన్న దానిపై అధికారులు పరిశీలన జరుపుతున్నారు.

ఎన్నికల మాస్టర్ ట్రైనీలకు శిక్షణ

రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా సోమవారం తొలుత మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వీరు పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓల శిక్షణ ఇస్తారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహించాల్సిన పీఓ, ఏపీఓలకు రెండు వారాల్లోపు శిక్షణలు పూర్తి చేయాలని సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశించారు.

డిస్కమ్‌ల డైరెక్టర్లకు ఉద్వాసన

(మొదటి పేజీ తరువాయి)



చట్టబద్ధంగా జరుగలేదని గుర్తించి.. వారిని తొలగించాలని నిర్దేశించింది. ఈ మేరకు డిస్కమ్‌లను ఆదేశిస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ సోమవారం జీవోనెం.5ను జారీ చేశారు. కొత్త డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. దక్షిణ డిస్కమ్‌లో 2013 ఆగస్టు 2 నుంచి డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్, ఉత్తర డిస్కమ్‌లో 2013 జూలై 31 నుంచి పనిచేస్తున్న బి.వెంకటేశ్వరరావు నియామకం తప్ప మిగిలిన 9 మంది డైరెక్టర్ల నియామకం చట్టవిరుద్ధంగా జరిగిందని ప్రభుత్వం తేల్చింది. 2012 మే 14న జారీ చేసిన జీవోనెం.18తో పాటు అదే సంవత్సరం నవంబరు 24న జారీ చేసిన జీవోనెం.45 ప్రకారం ఒక సంస్థలో డైరెక్టర్లను నియమించడానికి నోటిఫికేషన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించి, నియామక ప్రక్రియను చేపట్టాలి. నియామకం రెండేళ్ల కాలానికే ఉండాలి. ఆ తర్వాత ఏడాది కాలం రెండుసార్లు మాత్రమే పొడిగించడానికి వీలు ఉంటుంది. ఏ డైరెక్టర్ అయినా సరే నాలుగేళ్లకన్నా ఎక్కువ ఉండటానికి వీల్లేదు. దాంతో రెండు డిస్కమ్‌లలో డైరెక్టర్లలో ఒక డైరెక్టర్ తప్ప మిగిలిన వారంతా ఐదేళ్లకు పైగా కాలం నుంచి పనిచేస్తున్నవారే. దాంతో వీరిని తొలగించి, జీవోనెం.12, 45లను అనుసరించి, నియామక ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించారు. వెనువెంటనే నియామక ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగానే దానికి లోబడి 7 మంది డైరెక్టర్లను తొలగిస్తూ దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక ఎన్పీడీసీఎల్ కూడా డైరెక్టర్ల తొలగింపునకు నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటికే ట్రాన్స్‌కో, జెన్‌కోలలో ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ల నియామకం కూడా చట్టవిరుద్ధంగానే జరిగినట్లు ప్రభుత్వం ఈనెల 27న ఉత్తర్వులు ఇచ్చింది. వీరి స్థానంలో పై జీవోలను అనుసరించి, చట్టబద్ధంగా నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు 200 మందికి పైగా తమను డైరెక్టర్లుగా నియమించాలని ప్రభుత్వానికి నివేదించుకున్నట్లు సమాచారం.

62 ఏళ్లలోపు వయస్సు.. 25 ఏళ్ల అనుభవం

ట్రాన్స్‌కో, జెన్‌కో విద్యుత్ సంస్థల్లో కొత్తగా డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇస్తూ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ నిర్ణయం తీసుకున్నారు. ట్రాన్స్‌కోలో డైరెక్టర్(గ్రిడ్ అండ్ ట్రాన్స్‌మిషన్ మేనేజ్‌మెంట్), డైరెక్టర్(ప్రాజెక్ట్), డైరెక్టర్(ఫైనాన్స్)ల కోసం, జెన్‌కోలో డైరెక్టర్(హైడల్), డైరెక్టర్(థర్మల్, ప్రాజెక్ట్), డైరెక్టర్(హెచ్ఆర్ అండ్ ఐఆర్), డైరెక్టర్(కోల్ అండ్ లాజిస్టిక్స్), డైరెక్టర్(ఫైనాన్స్ అండ్ కమర్షియల్) పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసేవారు 62 ఏళ్లలోపు వయసు కలిగి, సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ చేసి, సంబంధిత సబ్జెక్టులో 15 ఏళ్ల అనుభవం కలిగి, రాష్ట్ర/కేంద్రప్రభుత్వరంగంలో 25ఏళ్ల వృత్తిపరమైన అనుభవం కలిగి ఉండాలి. దరఖాస్తులను మార్చి 1లోపు పంపించాలి. సర్వీసులో ఉన్న వారు సంబంధిత విభాగాధిపతి నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి నెలసరి వేతనం రూ.1.50 లక్షలు ఉంటుంది.

గవర్నర్‌ది గలీజ్ ప్రసంగం

కాంగ్రెస్ గల్లీ కార్యకర్తలా తమిళిసై వ్యాఖ్యలు.. అభివృద్ధే ధ్యేయంగా పదేళ్ల పాటు పని చేశాం: కేటీఆర్

రంగారెడ్డి అర్బన్/పరిగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగం గలీజ్‌గా ఉందని, రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేశారంటూ ఓ గల్లీ కాంగ్రెస్ కార్యకర్తలా దివాళాకోరు మాటలు మాట్లాడారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పదేళ్లు కమిట్‌మెంట్‌తో పని చేశామని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపామని అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను కలుస్తున్న నేపథ్యంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కారు ఇప్పటికే నిండిపోయిందని, ఒకరిద్దరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడినా ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీ నుంచి వెళ్లేపోయేవారిని ఆపొద్దని శ్రేణులకు సూచించారు. వారి స్థానంలో కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందామని చెప్పారు. హామీలిచ్చి అమలు చేయని కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలో చీల్చి చెండాడుదామని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 39 సీట్లు వచ్చాయని, 14 సీట్లలో స్వల్ప తేడాతో ఓడామని గుర్తు చేశారు. అందులో సగం గెలిచినా హంగ్ వచ్చేదని, బీఆర్ఎస్ బలం ఏమిటో చూపించేవాళ్లమని పేర్కొన్నారు. ఇది భయంకరమైన ఓటమేమీ కాదని, మూడోవంతు సీట్లిచ్చి బలమైన ప్రతిపక్షంగా పని చేయమని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదేశించారని అన్నారు.



పరిగి బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న కేటీఆర్

మార్పు పేరుతో కాంగ్రెస్ మోసం

కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, నోటికొచ్చిన హామీలిచ్చి ఇరుక్కుపోయిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లను గోస పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతు బంధును రూ.15వేలకు పెంచుతామన్నారు..డిసెంబరు 9న రూ.2లక్షల రైతు రుణ మాఫీపై సంతకం చేస్తామన్నారు. అవి ఇప్పటికీ అమలు కాలేదు" అని మండిపడ్డారు. మరోవైపు రుణాలు రికవరీ చేయాలని మంత్రి తుమ్మల ఆదేశిస్తున్నారని, రైతులపై కాంగ్రెస్ విధానం ఏమిటో స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో వారంలోనే అందరికీ రైతుబంధు అందేదని, ఇప్పుడు వరి నాట్లు వేసినా డబ్బులు ఎందుకు పడలేదో ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో 18ఏళ్లు నిండిన మహిళలు 1.57కోట్ల మంది ఉన్నారని, ఒక్కొక్కరికి నెలకు రూ.2,500చొప్పున ఇవ్వాలంటే నెలకు రూ.4వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఈ పథకం సాధ్యాసాధ్యాలపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ.4వేలకు పెంచడంతోపాటు ఒకే ఇంట్లో పేద భార్యభర్తలు ఇద్దరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిరాయి ఇళ్లలో ఉన్న వారికి కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాల్సిందేనని అన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామన్న సర్కార్.. ఎప్పటి నుంచి అమలు చేస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నిల కోడ్ రాక ముందే హామీలను అమలు చేయాలని, ఇందుకోసం జీవోలు విడుదల చేయాలని సూచించారు. జీవోలు తెస్తే.. కోడ్ వచ్చినా ఇబ్బంది ఉండదన్నారు. రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతానంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారని, ఇలాంటి వారికి బుద్ధి వచ్చేలా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో వేటు వేయాలని అన్నారు.

కేసీఆర్ వస్తే తట్టుకోగలరా?

"అసెంబ్లీలో బావబామ్మర్దుల ప్రశ్నలకే సీఎం రేవంత్ ఉక్కిరిబిక్కిరి అయితాండు.. ఇక అసలైన కమాండర్ కేసీఆర్ వస్తే.. రేవంత్ తట్టుకోగలరా?" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు తాము పట్టుదలతో పనిచేయడం వల్లే దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందన్నారు. రాష్ట్రానికి బీజేపీ ఇచ్చింది, చేసిందేమీ లేదని అన్నారు. ఐటీఐఆర్ రద్దు అంశాన్ని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పలుమార్లు లోక్‌సభలో ప్రస్తావించారని, బండి సంజయ్ ఒక్క మాటైనా మాట్లాడారా? అని నిలదీశారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో మాట్లాడేది బీఆర్ఎస్ నాయకులేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్-బీజేపీ ఒక్కటైతే, కవితపై కేసు ఎందుకు పెడతారని ప్రశ్నించారు. కాగా, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండంలో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకించాలంటూ దామగుండం పరిరక్షణ సమితి సభ్యులు కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పోరాటానికి తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు.

రికార్డు స్థాయిలో సీఎంఆర్ సేకరణ

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సేకరణలో శనివారం రికార్డు సృష్టించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఒకే రోజులో 56 వేల టన్నుల బియ్యాన్ని మిల్లర్ల నుంచి సేకరించినట్లు ఆయన వెల్లడించారు. 2022- 23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 43.73 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించాల్సి ఉండగా 14 నెలల వ్యవధిలో కేవలం 24.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సీఎంఆర్ రూపంలో మిల్లర్లు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, గత డిసెంబర్ నెల రెండో వారం నుంచి ఈ జనవరి నెల 27వ తేదీ వరకు 50 రోజుల్లోనే 14.50 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రికవరీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. రెండు నెలల క్రితం వరకు రోజుకు సగటున 5 నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ సేకరణ మాత్రమే జరిగేదని, అయితే ఇప్పుడు రోజుకు సగటున 30 వేల టన్నుల చొప్పున సేకరణ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

బ్యూటీపార్లర్ పేరుతో మోసం

ఫ్రాంచైజీలంటూ రూ.3 కోట్లు వసూలు

నిజాంపేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బ్యూటీ పార్లర్ పేరుతో ఆకర్షించారు. ఫ్రాంచైజీలిస్తామంటూ ముగ్గులోకి దింపారు. చివరికి అక్క, బావ, మరదలు కలిసి బ్యూటీపార్లర్ పేరుతో మూడు కోట్లు వసూలు చేసి బాధితులను నిండాముంచి పరారయ్యారు. ప్రగతినగర్‌లో నివాసముండే సమీర, ఇస్మాయిల్ దంపతులు, సమీరా చెల్లెలు జెస్సికా కలిసి రోజ్ గోల్డ్ బ్యూటీపార్లర్ పేరుతో యూట్యూబ్‌లో యాడ్స్ చేసి అమాయకుల దృష్టిని ఆకర్షించారు. తమ పార్లర్ ఫ్రాంచైజీకి ఇస్తామని, నెలకి రూ. 35వేలు జీతం కూడా ఇస్తామని మాయ మాటలు చెప్పి నమ్మించారు. వీరి మాటలు నమ్మిన కొందరు మహిళలు మంగళసూత్రాలు అమ్మి మరి ఫ్రాంచైజీ తీసుకున్నారు. ఇలా వసూలు చేసిన సొమ్ముతో వారు పరారయ్యారు. బాధితులు సోమవారం బాచుపల్లి పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియపై టీఎస్‌పీఎస్సీ కసరత్తు షురూ

సాధ్యమైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ క్యాలెండర్ ప్రకటనకు చర్యలు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. పోస్టుల భర్తీకి సంబంధించిన కసరత్తును మొదలుపెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ క్యాలెండర్‌ను ప్రకటించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు కొందరు సభ్యులను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషన్ తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఛైర్మన్‌తోపాటు సభ్యులు టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వస్తూ విధులను నిర్వర్తిస్తున్నారు. నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మళ్లీ ఎలా మొదలుపెట్టాలి? ఇంకా మొదలుపెట్టని పోస్టుల భర్తీని ఎలా చేపట్టాలి? వంటి అంశాలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఆయా పోస్టుల వారీగా నియామకాల స్థాయిలను పరిశీలిస్తున్నారు. వీటిని ముందుకు తీసుకెళ్లడంలో ఎదురయ్యే ఇబ్బందులపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా కోర్టు కేసులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే గ్రూప్-1 పోస్టులకు సంబంధించి సుప్రీం కోర్టులో కేసు ఉంది. అలాగే మహిళా రిజర్వేషన్ అమలుపైనా హైకోర్టులో కేసులున్నాయి. ఇలాంటి న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని కమిషన్ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అంటే వారం పది రోజుల్లో పూర్తి క్యాలెండర్‌ను విడుదల చేసేలా అధికారులు తమ కార్యాచరణను రూపొందిస్తున్నారు.

హామీల అమలు ఏది?.. వీపులు పగుల్తాయ్!

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించారు. గూడూరులో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సందీప్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సభలో సందీప్ ప్రసంగిస్తూ మంత్రికి పలు ప్రశ్నలు సంధించారు. అధికారంలోకి వచ్చాక డిసెంబరు 9నే అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలు ఇచ్చిందని, అది ఏమైందని నిలదీశారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై తప్పుగా మాట్లాడితే వీపులు పగులుతాయ్ అంటూ మంత్రి కోమటిరెడ్డి తీవ్రంగా స్పందించారు. మంత్రి అనుచరులు సందీప్‌పైకి గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ దూసుకెళ్లారు. ఒక దశలో సందీప్‌పై దాడికి యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

నిలదీతలతోనే సందీప్ ప్రసంగం

ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డితో పాటు కోమటిరెడ్డి.. కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని, డిసెంబరు 9న ప్రమాణస్వీకారం చేసిన రోజునే రైతుబంధు రూ.10 వేలకు బదులు రూ.15 వేలకు, పింఛను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచి ఇస్తామని..



జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

అదే రోజు రుణమాఫీ కూడా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అవి ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. హామీలు అమలు చేయాల్సింది పోయి మంత్రి కోమటిరెడ్డి జిల్లా పర్యటనలో పదే పదే గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బొమ్మలరామారం పర్యటనలో రైతు బంధు అడిగిన వారిని చెప్పుతో కొడతానంటూ కోమటిరెడ్డి అన్నట్లు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోందని, ఆయన అలా అనడం సరికాదని వ్యాఖ్యానించారు. సందీప్‌రెడ్డి మాట్లాడుతుండగానే కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహంతో 'సందీప్‌రెడ్డి గో బ్యాక్' అంటూ నినాదాలు మొదలుపెట్టారు. దీంతో మైక్ అందుకున్న మంత్రి కోమటిరెడ్డి.. సందీప్‌పై విరుచుకుపడ్డారు. 'సందీప్‌రెడ్డి పిల్లోడు. తెలియక మాట్లాడుతుండు, తండ్రి మాధవరెడ్డి పేరు చెప్పుకొని జడ్పీ చైర్మన్ పదవి దక్కించుకున్నాడు, లేకపోతే వార్డు మెంబర్‌గా కూడా గెలిచేవాడు కాదు' అని విమర్శించారు. ఆ వెంటనే.. సందీప్.. వ్యక్తిగత దూషణలకు దిగడం ఏమిటంటూ కోమటిరెడ్డిని ప్రశ్నించడంతో వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. మంత్రి అనుచరులు వేదికపైకి దూసుకొచ్చి సందీప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాడికి యత్నించారు. పోలీసులు రక్షణగా నిలబడి సందీప్‌ను సభా ప్రాంగణానికి దూరంగా తీసుకెళ్లారు. అక్కడ సందీప్ విలేకరులతో మాట్లాడుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు వెంబడించడంతో పోలీసులు ఆయన్ను కారులో పంపించేశారు.

సమాధానం చెప్పలేకనే వ్యక్తిగత దూషణలు: సందీప్‌రెడ్డి

రైతుబంధు పెంపు, రుణమాఫీ తదితర వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలుచేయడం లేదని తాను ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పాల్సింది పోయి మంత్రి కోమటిరెడ్డి వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని సందీప్‌రెడ్డి ఆరోపించారు.. గౌరవప్రదమైన మంత్రి పదవిలో ఉన్న కోమటిరెడ్డి హుందాంగా వ్యవహరించాల్సిందిపోయి.. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే ఓ ప్రభుత్వ కార్యక్రమం వేదికగా తాను మంత్రిని ప్రశ్నించానని పేర్కొన్నారు. కోమటిరెడ్డి తీరుపై పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

నేను అలా అనలేదు.. వక్రీకరించారు: కోమటిరెడ్డి

బొమ్మలరామారం పర్యటనలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. రైతుబంధు అడిగిన రైతులను చెప్పుతో కొట్టాలని తాను అనలేదని, ఈ ప్రభుత్వంలో రైతుబంధు రాదని చెప్పేటోన్నే చెప్పుతో కొట్టాలన్నానని వివరణ ఇచ్చారు. తన మాటలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరించి ప్రచారం చేస్తున్నారన్నారు. రేవంత్ చిటికెన వేలుకు కూడా కేటీఆర్ సరిరాడని, అధికారంపోయినా కేటీఆర్ అహంకారం తగ్గలేదన్నారు. 'రేవంత్ కష్టపడి సీఎం స్థాయికి ఎదిగిన నేత. అవినీతి బీఆర్ఎస్ సర్కారును బొందపెట్టి, కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో పండబెట్టిన ఘనత కాంగ్రెస్‌కు, రేవంత్‌కే దక్కుతుంది' అని అన్నారు.

సందీప్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

మంత్రి కోమటిరెడ్డిని నిలదీస్తాం: కేటీఆర్

యాదాద్రి జడ్పీ చైర్మన్‌కు ఫోన్

ఇది నియంతృత్వ పాలన: హరీశ్

భువనగిరి/హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగడాలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. గూడూరు గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవ వేదికపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో నెలకొన్న వివాదంపై జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి ఆరా తీశారు. మంత్రి వ్యవహరించిన తీరును సందీప్‌రెడ్డి కేటీఆర్‌కు వివరించారు. ఈ మేరకు కేటీఆర్ స్పందిస్తూ సందీప్‌రెడ్డికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, మంత్రి కోమటిరెడ్డి ఆగడాలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ నిలదీస్తామన్నారు. మంత్రి తన అహంకార వైఖరిని, నోటి దురుసును మార్చుకుని జడ్పీచైర్మన్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై దుర్భాషలాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు అనే తేడా లేకుండా కోమటిరెడ్డి అందరిపైనా నోరు పారేసుకుంటున్నారని ఆయనపై ఆరోపించారు. జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డితో ఫోన్లో మాట్లాడిన కేటీఆర్.. పార్టీ ఆయనకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కిందిస్థాయి కార్యకర్తనుంచి ఎమ్మెల్యే ఎంపీ వరకు ఎవరికి ఇబ్బంది ఎదురైనా పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేదని, నియంతృత్వం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలను అడ్డుకొని తీరతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో సాటి ప్రజా ప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని, సందీప్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మొన్న రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టండి అన్న కోమటిరెడ్డి.. ఇప్పుడు అధికారిక కార్యక్రమంలో జడ్పీ చైర్మన్‌ను దుర్భాషలాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులంతా కోమటిరెడ్డి పోకడలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని పోలీసులతో నెట్టి వేయించడంపై ఆయన స్పందించారు.

ఫాంహౌస్ ముట్టుకుంటే చీల్చి చెండాడతాం

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామంటూ కాంగ్రెస్ నేత మధుయాష్కీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌ను ముట్టుకుంటే.. చూస్తూ ఊరుకోమని, చీల్చి చెండాడతామని, ముక్కలు ముక్కలు చేస్తామని హెచ్చరించారు.

రేవంత్ కాళ్లు పట్టుకుంటే కోమటిరెడ్డికి మంత్రి పదవి

అప్పట్లో మేం ఉద్యమిస్తే ఆయన వైఎస్ఆర్ బూట్లు నాకారు

ఆయనవి చిల్లర రాజకీయాలు: జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అధికారమదంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆటవికంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరలో పంచాయతీ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డిని పోలీసులతో మంత్రి దగ్గరుండి నెట్టివేయించారని, ఆయన చర్య దుర్మార్గమైనదని విమర్శించారు. ఆయనవి చిల్లర రాజకీయాలని, వాటికి ఎంతమాత్రం భయపడేది లేదన్నారు. మంత్రికి ఈ స్థాయి అహంకారం ప్రజాక్షేత్రంలో పనికిరాదని, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు చైతన్యవంతులని, వారే ఆయనకు బుద్ధిచెబుతారన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తనను మంత్రి పదవి నుంచి తొలగిస్తారని తెలిసే మంత్రి పదవికి కోమటిరెడ్డి రాజీనామా చేశారని, ఆపై దొంగదీక్ష చేపట్టారని విమర్శించారు. అప్పట్లో తాము తెలంగాణ కోసం ఉద్యమం చేస్తే, కోమటిరెడ్డి నాటి సీఎం వైఎస్ఆర్ బూట్లు నాకారని ఆరోపించారు. బెడ్‌రూంలో సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లను కోమటిరెడ్డి పట్టుకున్నారని, అందుకే మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎందుకు ఇవ్వడంలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సందీప్ రెడ్డిని పోలీసులు నెట్టివేసిన చర్యపై ఏసీపీ, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

హౌసింగ్ బోర్డు బకాయిలెన్ని?

» దాని పరిధిలోని జాయింట్ వెంచర్ల పరిస్థితి ఏంటి?

» హౌసింగ్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ శాఖ పరిధిలోని హౌసింగ్ బోర్డుకు ఉన్న బకాయిలన్నింటినీ వసూలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో హౌసింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల కింద ఎంత భూమి ఉంది? ఆ వెంచర్ల పరిస్థితి ఏమిటని అధికారులను అడిగారు. వాటిపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. కాగా.. హౌసింగ్ బోర్డుకు రావాల్సిన బకాయిలు దాదాపు రూ. 1000 కోట్ల దాకా ఉన్నాయని అధికారులు ఆయన దృష్టికి తేగా.. వాటన్నింటినీ వీలైనంత త్వరగా వసూలు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే.. 2004-2014 నడుమ కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని? వాటిలో పూర్తయినవెన్ని? అనే వివరాలను కూడా సీఎం అడిగారు. 2004 నుంచి 2014 వరకు తెలంగాణ ప్రాంతంలో దాదాపు 23,85,188 ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో 19.32 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, 4.53 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు ఆయనకు తెలిపారు. విభజనతో (పోలవరం ముంపు మండలాల్లో) 3,017 ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయని వివరించారు. అదే విధంగా ఏపీ, తెలంగాణ విభజన నేపథ్యంలో షెడ్యూల్ 9లోకి వెళ్లిన భూములు, వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి కూడా వారు ముఖ్యమంత్రికి తెలిపినట్లు సమాచారం. దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ (దిల్) కింద ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న భూములు, వాటి రక్షణకు అవసరమైన అంశాలను.. హౌసింగ్ శాఖ పరిధిలో హైదరాబాద్‌లో, చుట్టుపక్కల ఉన్న భూముల్లో వివాదాల్లో ఉన్న వాటి వివరాలను కూడా వారు సీఎం ముందు ఉంచినట్లు తెలిసింది.



సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్క్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రాష్ట్రం పామాయిల్ హబ్‌గా మారాలి

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట/సత్తుపల్లి, జనవరి 29: పామాయిల్ సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, త్వరలోనే పామాయిల్ హబ్‌గా తెలంగాణ మారాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. భద్రాద్రి జిల్లా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో 90టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న కర్మాగారాన్ని, రూ.40కోట్లతో నిర్మించిన డీమక్ పౌడర్ ప్లాంటును, పవర్ ప్లాంట్ బాయిలర్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పామాయిల్ ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయిల్ ఫెడరేషన్ అధికారులను ఆదేశించారు. పామాయిల్ ధర కనీసం రూ.18వేలు ఉండేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌ను తుమ్మల సందర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేందుకు వీలుగా వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

బీఆర్ఎస్ దోపిడీతోనే ప్రజలు తిరస్కరించారు

» ఇప్పుడు కుటుంబ పాలన అంతమైంది: భట్టి విక్రమార్క



హైదరాబాద్, బౌద్ధనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు పదేళ్లుగా దోపిడీలు, లూటీలకు పాల్పడి ప్రజలకు అన్యాయం చేశారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. సోమవారం నామాలగుండులో నిర్వహించిన సికింద్రాబాద్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ నగర శివారుల్లో భూములను ఆక్రమించుకోవటంతోపాటు తెలంగాణ ప్రజల ఆస్తులను దోచుకుని ఫాంహౌజ్‌లు కట్టుకుందని ధ్వజమెత్తారు. 'మీరు చేసిన దోపిడీల వల్లనే ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు' అని అన్నారు. అదృష్టం కొద్దీ తెలంగాణ రాష్ట్రం కుటుంబ పాలన నుంచి బయట పడిందని, దీన్ని ఓర్వలేక బట్టలూడదీసి కొడతామని మాట్లాడుతున్నారని అన్నారు. 'ఏందీ మీరు కొట్టేది. కాంగ్రెస్ వాళ్లు ప్రజాస్వామ్యవాదులు కాబట్టి సౌమ్యంగా ఉన్నారు. వారంతా తిరగబడితే మీ పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని మాట్లాడుతున్న మీరు పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల సంగతేమిటని ప్రశ్నించారు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉందని భట్టి విక్రమార్క ఓ ప్రకటనలో తెలిపారు.

ఒళ్లు, నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడండి

» లేకుంటే మాడి మసైపోతారు: మంత్రి పొన్నం ప్రభాకర్



సైదాపూర్, భీమదేవరపల్లి, జనవరి 29: ప్రభుత్వాన్ని కూలుస్తామంటున్న నాయకులు ఒళ్లు, నోరు దగ్గర పెట్టుకోవాలని, లేకుంటే మాడి మసై పోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్పంచ్‌లకు అన్యాయం జరిగితే ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని, అయితే బీఆర్ఎస్ హయాంలోనే సర్పంచ్‌లకు అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనాకాకముందే కేటీఆర్ అవాకులు, చవాకులు పేలుతున్నాడని, అభివృద్ధితోనే ఆయన మాటలకు సమాధానం ఇస్తామన్నారు. సర్పంచ్‌లు భయపడవద్దని, న్యాయంగా ఉంటే పెండింగ్ బిల్లులు తప్పకుండా చెల్లిస్తామని చెప్పారు. సోమవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆరెపల్లి, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో మంత్రి మాట్లాడారు. షెడ్డుకు పోయిన కారు తిరిగిరాదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని, కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు వినోద్‌కుమార్ భయపడుతున్నాడన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా శాస్త్రీయంగా నిపుణులతో జిల్లాలు, మండలాల పునర్విభజన చేపడతామన్నారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్ పోస్టులతోపాటు ఇతర పోస్టులకు త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ముందస్తు నిర్బంధాలపై కొత్త అడ్వయిజరీ బోర్డు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వివిధ సందర్భాల్లో ముందస్తు నిర్బంధాల(ప్రివెంటివ్ డిటెన్షన్)పై సలహాలు, సూచనలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త అడ్వయిజరీ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. 2021 నవంబరు 11న అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డు రెండేళ్ల పదవీకాలం పూర్తవడంతో దాని స్థానంలో కొత్త బోర్డును కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బోర్డు ఛైర్మన్‌గా రాష్ట్ర హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్, సభ్యులుగా జిల్లా రిటైర్డు జడ్జి ఎస్.బజరంగ్‌బాబు, జిల్లా రిటైర్డు జడ్జి బి.నాగమారుతి శర్మను ప్రభుత్వం నియమించింది.

గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించండి

» వీఆర్వోలను మళ్లీ నియమించండి : ట్రెసా

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థంగా అందించేందుకు, ప్రభుత్వ భూములు కాపాడేందుకుగాను గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) కోరింది. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి నేతృత్వంలోని సంఘం ప్రతినిధులు సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను ప్రస్తావించారు. మళ్లీ వీఆర్వోలను నియమించాలని, ఇతర శాఖల్లోకి పంపిన వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెసా ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కుమార్, పూర్వ వీఆర్వోల జేఏసీ ఛైర్మన్ గోల్కొండ సతీష్, సెక్రటరీ జనరల్ హరలే సుధాకర్ రావు, కో ఛైర్మన్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తెల్ల రేషన్‌కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ

(మొదటిపేజీ తరువాయి)

నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలి. అందుకోసం ఓ సంయుక్త విధానాన్ని తీసుకురావాలి. వైద్య కళాశాలల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగాలి. వరంగల్, ఎల్బీనగర్, సనత్‌నగర్, అల్వాల్‌లోని టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి. వైద్యుల కొరత లేకుండా మెడికల్ కాలేజీలను ఆస్పత్రులకు అనుసంధానంగా ఉండేలా చూడాలి" అని అధికారులను ఆదేశించారు. కొడంగల్‌లో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు పరిశీలన జరపాలని సూచించారు. "బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. దీనివల్ల ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులపై భారం తగ్గుతుంది. ఎయిమ్స్‌పై పూర్తిస్థాయి నివేదికను తయారు చేయాలి. ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవల కోసం అవసరమైతే నేనే స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి వివరిస్తాను" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా.. ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి విస్తరణలో సమస్యలు

ఈ సమీక్ష సందర్భంగా అధికారులు ఉస్మానియా ఆస్పత్రి విస్తరణలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఉస్మానియా ఆస్పత్రి ఉన్న భవనం వారసత్వ కట్టడం కావడం వల్ల కోర్టులో కేసు కొనసాగుతోందని వివరించారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. న్యాయస్థానం సూచనల ప్రకారం నిర్ణయం తీసుకుందామన్నారు. మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో హౌస్‌కీపింగ్ నిర్వహణ బాధ్యతను పెద్ద ఫార్మా కంపెనీలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద అప్పగించాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో హౌస్‌కీపింగ్ సేవలను మెరుగుపరచాలని సూచించారు. ఉస్మానియా లేదా గాంధీ ఆస్పత్రిలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించాలని ఆదేశించారు.

జీతాలు.. ఆరోగ్యశ్రీ బిల్లులపై..

జూనియర్ డాక్టర్లు, ఆశా వర్కర్లు, స్టాఫ్ నర్సుల జీతాలను ప్రతినెలా క్రమం తప్పకుండా అందించేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 108, 102 సేవల పనితీరుపై ఆరా తీశారు. వీటిద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వాస్పత్రులకు ప్రతినెలా 15వ తేదీలోగా ఆరోగ్యశ్రీ బిల్లులను విధిగా విడుదల చేయాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా వున్న బోధనాస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులకు పెండింగ్‌లో ఉన్న రూ.270 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రతీ మూడు నెలలకోసారి విడుదల చేసేలా ఒప్పందం కుదుర్చుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

ప్రభుత్వం కొత్తగా నియమించిన స్టాఫ్ నర్సులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమం బుధవారం ఎల్బీ స్టేడియంలో జరగనుంది. ఆ ఏర్పాట్లను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర ఉన్నతాధికారులు సోమవారం పరిశీలించారు.

'హెటిరో'కు భూ సంతర్పణపై దర్యాప్తు?

(మొదటిపేజీ తరువాయి)



సాయిసింధు ఫౌండేషన్ పేరుతో ఒక చారిటబుల్ ట్రస్టును నెలకొల్పారు. ఆ ట్రస్టు పేరుతో తాము క్యాన్సర్ జనరల్ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు ప్రభుత్వానికి విన్నవించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఇజ్జత్‌నగర్(హైటెక్స్ వెళ్లే మార్గం)లో 15.48 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలంటూ విజ్ఞప్తి చేశారు. 1989లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి లీజుకు ఇచ్చిన తరహాలోనే.. ఏడాదికి రూ.50 వేల చొప్పున చెల్లించేలా భూమిని కేటాయించాలని కోరారు. అందుకు ప్రతిగా.. తమ ఆస్పత్రిలో కూడా 25% మంది ఇన్‌పేషెంట్లు, 40% మంది ఔట్‌పేషెంట్లకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రతిపాదించారు. అయితే.. అప్పటికే పార్థసారథిరెడ్డి ట్రస్టు అడిగిన స్థలాన్ని వేలం వేయాలని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వనరుల సంస్థ(టీఎస్ఐఐసీ) నిర్ణయించింది. దీంతో.. ఇజ్జత్‌నగర్‌కు బదులుగా.. ఆ పక్కనే ఉన్న ఖానామెట్‌లో స్థలం కేటాయించాలని బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించింది. ఖానామెట్ సర్వేనంబరు 41/14/2లో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏకు అత్యున్నత ప్రాధాన్యత కింద ఆదేశాలు జారీ చేసింది. అయితే.. అప్పట్లో శేరిలింగంపల్లి తహసీల్దార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆ భూమి విలువైనదని.. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.33.7 కోట్ల చొప్పున రూ.505.5 కోట్ల విలువ ఉంటుందని పేర్కొంటూ ప్రభుత్వానికి నోట్ పంపించారు. అప్పటి రాజేంద్రనగర్ ఆర్డీవో కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయినా.. నాటి కేసీఆర్ సర్కారు వెనక్కి తగ్గలేదు. సాయిసింధు ఫౌండేషన్ ట్రస్టుకు ఆ భూములను జీవో-571(లీజులకు సంబంధించిన ఉత్తర్వు) ప్రకారం కేటాయించాలని నిర్ణయించింది. ఆ ఉత్తర్వును 2015లో సవరిస్తూ.. జీవో-218ను విడుదల చేసింది. ఆ సవరణల్లో సామాజిక, స్వచ్ఛంద సంస్థలకు భూమిని లీజుకు ఇస్తే.. సంబంధిత భూమి విలువలో 10శాతాన్ని ఏడాది లీజుగా చెల్లించాలనే విషయాన్ని చేర్చింది. అంటే.. ప్రభుత్వ భూమి విలువ రూ.505.5 కోట్లు కాగా.. అందులో 10%.. అంటే.. రూ.50కోట్ల చొప్పున లీజును చెల్లించాలి. 60 ఏళ్లకు లీజుకు ఇచ్చేలా.. ఐదేళ్లకోసారి లీజు విలువను 10% చొప్పున పెంచుతూ వెళ్లాలని స్పష్టం చేసింది. ఈ జీవోను కూడా ప్రభుత్వం తుంగలోకి తొక్కుతూ.. ఏడాదికి ఎకరాకు రూ.1.47 లక్షల చొప్పున చెల్లించేలా పార్థసారథిరెడ్డి ట్రస్టుకు లీజుకు ఆ భూమిని కట్టబెడుతూ 2018 మార్చి 22న జీవో-59ని విడుదల చేసింది.

హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ..

జీవో-59 ప్రకారం సాయిసింధు ఫౌండేషన్ ట్రస్టుకు భూకేటాయింపుపై 2018లోనే డాక్టర్ ఊర్మిళ పింగ్లే, మరొకరు హైకోర్టులో సవాలు చేశారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న హైకోర్టు.. చవక లీజుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. 2023 జూన్ 5న తుదితీర్పునిస్తూ.. జీవో-59ని రద్దు చేసింది. భూకేటాయింపు పాలసీకి సంబంధించిన జీవో-218ను పునఃసమీక్షించి, నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. "ప్రజల ఆస్తులకు, వనరులకు ప్రభుత్వాలు ట్రస్టీగానే వ్యవహరించాలి. ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టేప్పుడు.. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి" అంటూ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు తీర్పును ఏమాత్రం పట్టించుకోలేదు. పార్థసారథిరెడ్డి ట్రస్టుకు లీజును కట్టబెట్టేందుకే మొగ్గుచూపింది. మరోమారు లీజు నిబంధనలను సవరించింది. ఆ మేరకు 2023 ఆగస్టు 11న జీవో-99 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. అందులో.. "సామాజిక, స్వచ్ఛంద సంస్థలకు భూములను తక్కువ ధరకు ఇచ్చే విచక్షణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది" అనే పదాన్ని చేర్చింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి కొన్ని రోజుల ముందే.. అంటే.. 2023 సెప్టెంబరు 25న జీవో-140 ద్వారా సాయిసింధు ఫౌండేషన్‌కు విలువైన భూమిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఏడాదికి రూ.50 కోట్ల మేర లీజు చెల్లించాలని, ప్రతి ఐదేళ్లకోసారి లీజుమొత్తాన్ని 10% మేర పెంచాలని సర్కారు జారీ చేసిన నిబంధనలు చెబుతున్నా.. 'విచక్షణ అధికారం' పేరుతో బీఆర్ఎస్ సర్కారు ఏడాదికి ఎకరాకు రూ.2 లక్షల చొప్పున.. 15.4 ఎకరాలకు రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇస్తున్నట్లు జీవో-140లో స్పష్టం చేసింది. గతంలో ఈ వ్యవహారం రచ్చగా మారి, హైకోర్టుదాకా వెళ్లడంతో కాస్త జాగ్రత్తపడ్డ బీఆర్ఎస్ సర్కారు.. ఈ జీవోను గోప్యంగా పెట్టడం గమనార్హం.! నిజానికి ఆ భూముల విలువ 2023 కల్లా ఎనిమిదింతలు పెరిగాయి. ఖానామెట్‌లో ఎకరా మార్కెట్ విలువ రూ.300 కోట్ల దాకా ఉంది. ఈ లెక్కన రూ.4 వేల కోట్ల విలువైన భూములను ఏడాదికి రూ.30 లక్షలు చెల్లించేలా.. 60 ఏళ్లకు బీఆర్ఎస్ సర్కారు పార్థసారథిరెడ్డి ట్రస్టుకు ధారాదత్తం చేసింది.

రేవంత్ సర్కారు సీరియస్

గత ప్రభుత్వ హయాంలో ధారాదత్తం చేసిన భూములపై రేవంత్ సర్కారు దృష్టి సారించింది. ఇప్పటికే జీవో-59 కింద ఆమోదించిన దరఖాస్తుల దుమ్ము దులుపుతోంది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా అవన్నీ అ'క్రమబద్ధీకరణలు' అని తేలడంతో.. వెయ్యి దాకా రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను నిలిపివేసింది. మిగతా దరఖాస్తులకూ శల్యపరీక్షలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే పార్థసారథిరెడ్డి ట్రస్టుకు కట్టబెట్టిన భూములపై దృష్టి సారించింది. నేడోరేపో దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

పాలమూరు ప్రాజెక్టులన్నీ

పూర్తిచేస్తాం

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం సచివాలయంలో పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులపై మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి(మహబూబ్‌నగర్), వాకిటి శ్రీహరి ముదిరాజ్(మక్తల్), జి.మధుసూదన్‌రెడ్డి(దేవరకద్ర), డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి(నారాయణపేట)లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనులకు అనుమతినివ్వాలని ఎమ్మెల్యేలు కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పనులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు 2014లోనే అనుమతులు లభించినప్పటికీ... ఎక్కడ రేవంత్‌రెడ్డికి పేరొస్తుందోననే కారణంతో ఆ ప్రాజెక్టును గత ప్రభుత్వం పక్కనపెట్టిందని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి మండిపడ్డారు. పథకాన్ని చేపట్టి ఉంటే లక్ష ఎకరాలకు పైగా నీరందేదని తెలిపారు. కాగా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం మరో రెండు టీఎంసీలు పెంచాలని మంత్రి ఉత్తమ్‌ను కోరామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ చెప్పారు. 2014కు ముందే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 70 శాతం ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయని, 7 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టును పక్కనపెట్టి, రూ. 50వేల కోట్లతో రీ ఇంజనీరింగ్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టారని, రూ.30 వేల కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరాకు ఈ పథకంతో నీరందలేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు.



నర్సారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ దిగ్గజనేత పొద్దుటూరి నర్సారెడ్డి ఇకలేరు

అనారోగ్య సమస్యలతో కన్నుమూత

నిర్మల్, హైదరాబాద్, బంజారాహిల్స్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి (93) ఇకలేరు. తీవ్ర అనారోగ్య సమస్యలతో సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మలక్‌చించోలి గ్రామం నర్సారెడ్డి స్వస్థలం. 1931 సెప్టెంబరు 22న జన్మించారు. ఓయూ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. కొన్నాళ్లు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. స్వాతంత్ర సమరంలో, నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్‌లో చేరారు. మూడుసార్లు నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా.. ఒకసారి ఆదిలాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1973 నుంచి 1978 వరకు నీటిపారుదల, రెవెన్యూ శాఖ మంత్రిగా కొనసాగారు. నర్సారెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే నిర్మల్ జిల్లాలో స్వర్ణ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. గ్రామ అవసరాలకు తన సొంత భూమిని కూడా దానం చేశారు. 1981 నుంచి 1985 సంవత్సరం వరకు ఏపీ శాసనమండలి సభ్యుడిగా పని చేశారు. ఇదే సమయంలో ఆయన అసెంబ్లీ, శాసన మండలి పార్లమెంట్‌కు సంబంధించిన పలు కీలక కమిటీల్లో సభ్యుడిగా కొనసాగారు. నర్సారెడ్డి మృతిపట్ల మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. నర్సారెడ్డి మరణవార్త తెలియడంతో సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాడసానుభూతి తెలియజేశారు. నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని, ఆయన అనుభవాలు తమకు మార్గదర్శకంగా ఉండేవని సీఎం పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా ప్రజలకు మరువలేని సేవలందించారని వ్యాఖ్యానించారు. సీఎంతో పాటు మంత్రి సీతక్క, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తదితరులు.. పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. నర్సారెడ్డి మృతిపట్ల మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు, పొన్నం, జూపల్లి సంతాపం వ్యక్తం చేశారు. కాగా మధ్యాహ్నానికి నర్సారెడ్డి పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం గాంధీభవన్‌కు తరలించారు. అక్కడ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కోదండరెడ్డి, నాగయ్య, కుమార్‌రావు, కమలాకర్ తదితరులు, పార్టీ కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

కల్యాణమస్తు పద్దు రూ.3,200 కోట్లు..?

తులం బంగారం హామీతో పెరిగిన బడ్జెట్.. తమిళనాడు తరహాలో అమలుకు యోచన

» విదేశీ విద్యా నిధి లబ్ధిదారుల పెంపు..?



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్యాణమస్తు పథకం కింద ఆడపిల్లకు నగదు సాయంతో పాటు, బంగారం కూడా కానుకగా ఇచ్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై సర్కారు కసరత్తును ప్రారంభించింది. పథకం అమలుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.3,200 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన బీసీ సంక్షేమ శాఖ.. ఆ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధమవుతోంది. దీని ప్రకారం పెళ్లి చేసుకునే ఆడపిల్లలకు రూ.1,01,116లతో పాటు, తులం బంగారం కూడా అందనుంది. దీంతో ఈ పథకానికి గతం కంటే అధికంగా నిధులు అవసరం కానున్నాయి. గతేడాది ఈ పథకం కోసం ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.2వేల కోట్లను కేటాయించింది. ఒక్కో ఆర్థిక సంవత్సరానికి సుమారు 1.20 లక్షల నుంచి 1.50 లక్షల వరకు దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత(2023-24) ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బీసీ శాఖకు 70వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.3,210 కోట్లను కేటాయించింది. వీటిలో బీసీ శాఖకు రూ.2వేల కోట్లు, ఎస్సీ శాఖకు రూ.500కోట్లు, మైనారిటీ శాఖకు రూ.450కోట్లు, గిరిజన శాఖకు రూ.260 కోట్లను కేటాయించింది.

తమిళనాడు విధానంపై అధ్యయనం..

కల్యాణమస్తు పథకంలో బంగారం సాయాన్ని ఏ విధంగా అందించాలనేదానిపై ప్రభుత్వం యోచిస్తోంది. ఆడపిల్ల పెళ్లికి బంగారం కానుక ఇచ్చే పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం అమలుచేస్తోంది. త్వరలోనే బీసీ సంక్షేమ అధికారులు పథకం అధ్యయనానికి అక్కడికి వెళ్లనున్నట్లు సమాచారం. అయితే ఈలోపు ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలను పంపాల్సి ఉండటంతో.. తులం బంగారం ధరను అంచనా వేసి, ఇప్పటికే అందిస్తున్న నగదుకు దాన్ని కలిపితే ఎంత అవుతుందో.. అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. తులం బంగారం ధరను రూ.60 వేలుగా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఒక్కో లబ్ధిదారుకు రూ.1,61,116 అవసరమవుతాయని బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. తమిళనాడు పథకాన్ని అధ్యయనం చేసిన తరువాత తెలంగాణ ప్రభుత్వం దాన్ని ఏ విధంగా అమలుచేయాలన్నదానిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. తమిళనాడు సర్కారు చదువుకున్న వారికి రూ.50వేలు, 8 గ్రాముల బంగారం.. చదువుకోని, లేదా తక్కువ చదువుకున్న వారికి రూ.25వేల చొప్పున సాయం అందిస్తోంది.

విదేశీ విద్యా నిధి లబ్ధిదారుల పెంపు.?

కాంగ్రెస్ సర్కారు విదేశీ విద్యకు పెద్దపీట వేయనుంది. ఇందు కోసం బీసీ శాఖ పరిధిలో అమలు చేస్తున్న మహాత్మా పూలే విదేశీ విద్యా నిధి పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి లబ్ధిదారుల సంఖ్యను ఐదింతలు పెంచనున్నట్లు సమాచారం. ఈ పథకం కింద ప్రస్తుతం ఒక్కో ఆర్థిక ఏడాదిలో 300 మంది చొప్పున సీజన్‌కు 150 మందికి ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే ఇందులోనే బీసీలు, ఓబీసీలు అంతా దరఖాస్తు చేసుకుంటుండటంతో ఏటా వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరింత మందికి సాయం అందించాలని భావిస్తోంది. ఇందుకోసం 2024-25 బడ్జెట్‌లో రూ.500కోట్ల మేర నిధులు అవసరమవుతాయని ప్రతిపాదన పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. 2023-24 ఫాల్ సీజన్‌కు(ప్రస్తుతం బీసీ శాఖలో ఫాల్ సీజన్‌కు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియ జనవరి 23తో ముగిసింది) దాదాపు 2,600 మేర దరఖాస్తులు వచ్చాయి. కానీ వీటిలో 150 మందికి మాత్రమే అవకాశం ఉంది. ఈ కారణంగానే ఈ పథకంలో లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

కేటీఆర్.. ఇకనైనా వైఖరి మార్చుకో!

» సీఎంపై వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే: మల్లు రవి

» లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై నేడు 'ప్రదేశ్ కమిటీ' భేటీ

న్యూఢిల్లీ/జగిత్యాల టౌన్/హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎన్నుకుంటేనే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని.. కేసీఆర్ వల్ల కాలేదని ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే ప్రజారంజక పాలన అందిస్తూ ముందుకుసాగుతున్న ఓ సీఎంను ఎవరి కాలిగోటికి సరిపోరంటున్నారని ఫైర్ అయ్యారు. కేటీఆర్ ఒక నియంత అని.. అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారన్నారని మండిపడ్డారు. కేటీఆర్ తన వైఖరిని ఇకనైనా మార్చుకోవాలని హితవు పలికారు. కేటీఆర్, హరీశ్ రావుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 'పులి మళ్లీ వస్తోంది.. కేసీఆర్ ఆరు నెలల్లో సీఎం అవుతారు' అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం ఎలా అవుతారో సమాధానం చెప్పాలని నిలదీశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. 50 రోజుల కాంగ్రెస్ పాలనను చూసి బీఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అహంకారంతో మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలని సీఎం రేవంత్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ఆ పార్టీలను దెబ్బ కొట్టాల్సిందే: జగ్గారెడ్డి

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, ఆ పార్టీల వ్యూహాలకు ప్రతి వ్యూహాలను పన్ని వాటిని రాజకీయంగా దెబ్బకొట్టాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన.. గత 9 ఏళ్ల పాలనలో ప్రజలకు బాధలు చెప్పుకొనే స్వేచ్ఛ కూడా లేకుండా కేసీఆర్ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వేచ్ఛ ఉంటుందనే తమ పార్టీకి ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని చెప్పారు. రాష్ట్రంలో కులగణన చేపట్టాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసేది కాంగ్రెస్సేనని.. కులగణన చేశామని కేసీఆర్ అన్నారని, కానీ వివరాలు బయటికి రాకుండా తొక్కిపెట్టారని మండిపడ్డారు.

లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై భేటీ..

లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలోని 17 నియోకవర్గాలకు అభ్యర్థుల ఎంపికపైన ప్రాథమిక కసరత్తు చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ మంగళవారం గాంధీ భవన్‌లో భేటీ కానుంది. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, కమిటీ సభ్యులు పాల్గొంటారు. ఆశావహుల ప్రాథమిక వడపోతకు సంబంధించి మార్గదర్శకాలు, ఎన్నికల వ్యూహంపైనా ఈ కమిటీలో చర్చించనున్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల డీసీసీ అధ్యక్షులు ఆశావహుల జాబితాలను పంపించేశారు. ఆ జాబితాలపైనా కమిటీ.. ప్రాథమికంగా కసరత్తు చేపట్టనుంది.

ప్రతి తెలుగువాడికి దక్కిన గౌరవం

» వెంకయ్యనాయుడికి కంభంపాటి అభినందనలు



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన రావు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు.. వెంకయ్యనాయుడికి దక్కిన ఈ అరుదైన గౌరవం ప్రతి తెలుగువాడికి దక్కిన గౌరవంగా కంభంపాటి పేర్కొన్నారు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో రాష్ట్రపతి మినహా అనేక హోదాల్లో పనిచేసిన వెంకయ్యనాయుడు సమకాలీన రాజకీయ నేతలకు స్ఫూర్తి అని ఆయన కొనియాడారు.

4 గ్రాముల డ్రగ్స్ సీజ్.. యువతి అరెస్టు

నార్సింగ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి డ్రగ్స్ తెప్పించిన ఓ యువతిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె ఓ టాలీవుడ్ నటుడికి స్నేహితురాలని గుర్తించారు. కోకాపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసించే లావణ్య అలియాస్ అన్విత(33) డ్రగ్స్ తెప్పించుకుంటున్నారనే సమాచారంతో మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం ఆమెకు డ్రగ్స్ అందాయనే పక్కా సమాచారం రావడంతో.. నార్సింగ్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆమె ఫ్లాట్‌లో సోదాలు నిర్వహించారు. లావణ్య వద్ద 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఆమెను నార్కోటిక్స్ చట్టం కింద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు నార్సింగ్ ఏసీపీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఆమెకు డ్రగ్స్ అందజేసిన వ్యక్తిని ఉనిత్‌రెడ్డిగా గుర్తించామని చెప్పారు. ఉనిత్‌రెడ్డితోపాటు.. అతని స్నేహితురాలు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కాగా.. లావణ్య నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లోనే ఓ టాలీవుడ్ నటుడు ఉంటున్నారు. అతని కోసమే లావణ్య డ్రగ్స్ తెప్పిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రైల్వే స్టేషన్లలో అదనపు భద్రతకు చర్యలు

» జీఆర్‌పీ అధికారులకు డీజీపీ రవిగుప్తా ఆదేశం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై జరిగే ప్రమాదాలన్నింటిపై ఇక నుంచి సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) అధికారుల్ని డీజీపీ రవిగుప్తా ఆదేశించారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే పండుగలు, సెలవు దినాల్లో రైల్వే స్టేషన్లలో అదనపు భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. రైలు ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్-100, హెల్ప్ లైన్ నెంబర్లు 139, 1512కు సమాచారం అందించాలన్నారు. తెలంగాణలోని రైల్వే ప్రాంతాల భద్రతపై ఉన్నతాధికారులతో డీజీపీ తన కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్లలో అదనపు సిబ్బంది కేటాయింపు, సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా సామగ్రి పెంపు తదితర అంశాలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

హైకోర్టులో ఎమ్మెల్యే పల్లా క్వాష్ పిటిషన్

» భూఆక్రమణ కేసు కొట్టేయాలని వినతి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన భూఆక్రమణ కేసును కొట్టివేయాలని కోరుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు ఫిర్యాదు స్వీకరించి 447, 427, 506 ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. మేడిపల్లికి చెందిన ముచ్చర్ల రాధిక అనే మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇవన్నీ తప్పుడు ఆరోపణలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

వ్యూహం సెన్సార్ సర్టిఫికెట్ రద్దుపై ఆర్జీవీ అప్పీల్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టేయడంపై ఆ సినిమా దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌ను సోమవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం పరిశీలించింది. ఇప్పటికే నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ ఓ అప్పీల్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ మంగళవారం రోజు విచారణకు రానున్న నేపథ్యంలో రెండింటినీ కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

సీఎస్, డీజీపీలకు ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టుకుని లాక్కెళ్లిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. మీడియా కథనాల ప్రకారం ఇది మానవ హక్కుల ఉల్లంఘనే అని అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి , డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దంటూ ఈనెల 24న రంగారెడ్డి జిల్లాలో ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టుకొని లాక్కెళ్లిన ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో కేసును ఎన్‌హెచ్ఆర్సీ సుమోటోగా స్వీకరించింది.

ఔషధ తనిఖీలు తీవ్రతరం చేస్తాం: డ్రగ్స్ డీజీ

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అనుమతులు లేకుండా ఔషధ విక్రయాలు జరిపే దుకాణాలు, వాటిని విక్రయించే అర్హతలేని వ్యక్తులపై ఆకస్మిక తనిఖీలను జరుపుతామని రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను మరింత తీవ్రతరం చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం కలదుర్తి గ్రామంలో అనుమతులు, అర్హతలేని ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.50 వేల విలువైన ఔషధాలను పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే మిర్యాలగూడలో ఔషధ నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న 'ఫెయిర్ అండ్ బ్రైట్ క్రీమ్' స్టాక్‌ను పట్టుకున్నట్లు కమలాసన్ చెప్పారు.

తెలంగాణ-ఏపీ ఆస్తుల పంపకంపై దృష్టి పెట్టండి

» కేంద్ర హోంశాఖ అధికారులకు మల్లు రవి వినతి

న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్ విభజన, ఆస్తుల పంపకానికి సంబంధించి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి కేంద్ర హోంశాఖ అధికారులను కోరారు. తెలంగాణకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం కేంద్ర హోంశాఖ అధికారులతో మల్లు రవి సమావేశమై చర్చించారు. ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్ విభజన, ఆస్తుల పంపకానికి సంబంధించి అంగీకార పత్రాలను ఇటీవలే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఓ నిర్ణయం తీసుకుంటే తెలంగాణ భవన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

'నీట్' సాధనకు 'కోటా' డిజిటల్ బుక్‌లెట్స్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): నీట్- 2024కు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' ఎన్‌సీఈఆర్టీ ప్రీవియస్ ఇయర్స్ ప్రశ్నాపత్రాలు, టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్స్ అండ్ సొల్యూషన్స్, చాప్టర్ల వారీగా ప్రాక్టీస్(డిజిటల్) బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్లు 'కోటా పేజెస్' ఓ ప్రకటనలో తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్‌లను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని, మరింత సమాచారం కోసం "NEET 2024' అని టైపు చేసి 9849016661 నెంబర్‌కు వాట్సప్ మెసేజ్ చేయాలని 'కోటా పేజెస్' సూచించింది.

రాజ్యసభ ఎన్నికలు 27న

(మొదటి పేజీ తరువాయి)

చివరి గడువు. 27వ తేదీన ఉదయం తొమ్మిది గంటలనుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్‌ను నిర్వహించి అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించనుంది. తెలంగాణ, ఏపీ నుంచి చెరో మూడు రాజ్యసభ స్థానాలు ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ కానున్నాయి. తెలంగాణ నుంచి బీఆర్ఎస్‌కు చెందిన బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, జోగినపల్లి సంతోష్‌కుమార్ రాజ్యసభ పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. అలాగే ఏపీ నుంచి టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రకుమార్, బీజేపీకి చెందిన సీఎం రమేష్, వైసీపీకి చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల రాజ్యసభ సభ్యత్వం ఏప్రిల్ 2తో ముగుస్తుంది. మొత్తంగా తెలుగు రాష్ట్రాలలో ఖాళీ అయ్యే 6 సీట్లను ఈసీ భర్తీ చేయనుంది. మిగిలిన సీట్లలో ఉత్తరప్రదేశ్ నుంచి 10, బిహార్‌నుంచి 6, మహారాష్ట్ర.నుంచి 6, మధ్యప్రదేశ్‌నుంచి 5, పశ్చిమ బెంగాల్‌నుంచి 5, గుజరాత్, కర్ణాటకలనుంచి చెరో 4, ఒడిశా, రాజస్థాన్‌లలో మూడు సీట్ల చొప్పున రాజ్యసభ స్థానాలు భర్తీ కానున్నాయి. ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌నుంచి ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనుంది.

మూడింటిలో రెండు కాంగ్రెస్‌కు.. ఒకటి బీఆర్ఎస్‌కు

తెలంగాణ నుంచి ఖాళీ కానున్న మూడు రాజ్యసభ సీట్లలో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్లు, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి ఒక సీటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థి ఎన్నిక కావడానికి అవసరమైన ఓట్లను నిర్ధారించే సూత్రాన్ని బట్టి.. ఒక్కో రాజ్యసభ సీటుకు 30 ఓట్లు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం సీపీఐతో కలుపుకొని కాంగ్రెస్ పార్టీకి 65 సీట్లు ఉండగా.. బీఆర్ఎస్ పార్టీకి 39 సీట్లు ఉన్నాయి. ఈ లెక్క ప్రకారం కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా రెండు సీట్లను, బీఆర్ఎస్ పార్టీ ఒక సీటును గెలుచుకునేందుకు వీలుంటుంది. మూడో సీటుకూ అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకోవాలనుకుంటే మాత్రం.. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేల వలసలను ఆ పార్టీ ప్రోత్సహించాల్సి వస్తుంది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని.. ఆయన నివాసానికి వెళ్లి కలుస్తుండడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ సమస్యలపై కలుస్తున్నామని వారు చెబుతున్నా.. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ చేయి చేజారుతున్నారన్న ప్రచారమూ జరుగుతోంది. ఎంఐఎం అధినాయకత్వమూ క్రమంగా కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతుందన్న ప్రచారం నేపథ్యంలో పదిమందికి పైగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరైనా.. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా మూడో సీటూ కాంగ్రెస్ పార్టీకే దక్కే చాన్స్ ఉందనీ చెబుతున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు జరిగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంత రిస్కు తీసుకుంటుందా అన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఒక సీటు అధిష్ఠానానికి

కాంగ్రెస్‌కు దక్కనున్న రెండు రాజ్యసభ సీట్లలో ఒకటి అధిష్ఠానానికి టీ కాంగ్రెస్ అప్పగించనుంది. తెలంగాణ యేతర అభ్యర్థిని ఆ సీటుకు పార్టీ అధిష్ఠానం ఎంపిక చేయనుంది. మిగిలిన ఒక్క సీటుకు రాష్ట్రం నుంచి పోటీ తీవ్ర పోటీ నెలకొని ఉంది. బీఆర్ఎస్ పార్టీకి దక్కనున్న సీటులో కేసీఆర్ కుటుంబ సభ్యుడైన సంతోష్‌కుమార్‌నే మళ్లీ అభ్యర్థిగా ఎంపిక చేస్తారా.. లేక మరెవరినైనా నియమిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

రాష్ట్రంపై కేంద్రం కనికరం చూపేనా?

కొత్త బడ్జెట్‌లో కోరిన గ్రాంట్లు ఇచ్చేనా?.. ఇప్పటికే కేంద్రం దృష్టికి పలు డిమాండ్లు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది. ఇదివరకటి బీఆర్ఎస్ ప్రభుత్వం విషయంలో అనుసరించిన విధానాన్ని కాకుండా తమ పట్ల కాస్త మెతక వైఖరిని అవలంబించాలని కోరుకుంటోంది. గురువారం (ఫిబ్రవరి 1న) కేంద్రం ప్రవేశపెట్టబోయే నూతన బడ్జెట్‌లో రాష్ట్రానికి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులను ఆశిస్తోంది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇది పూర్తిస్థాయి బడ్జెట్ కాకాపోయినా.. రాష్ట్రానికి ఇతోధికంగా నిధులు కేటాయించాలని అడుగుతోంది. ఈమేరకు ఇప్పటికే పలు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి వెళ్లి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి రావాల్సిన, కావాల్సిన, మేలు చేసే అంశాలపై పలు డిమాండ్లను వారి ముందుంచారు. రేవంత్ ఢిల్లీ వెళ్లి కలవడంతో ప్రధాని మోదీ కూడా సానుకూలంగానే స్పందించారు. దీంతో బడ్జెట్‌లో రాష్ట్రానికి సానుకూల కేటాయింపులు ఉండే అవకాశం ఉందన్నచర్చ జరుగుతోంది. పైగా ఇది ఎన్నికల ఏడాది కావడంతో.. దక్షిణాదిన ఎక్కువ సీట్లు గెలుచుకోవాలని భావిస్తున్న బీజేపీ, అలా గెలుచుకోవడానికి ఎక్కువగా అవకాశం ఉన్న తెలంగాణకు వరాలు కురిపించి, ఇక్కడి ఓటర్ల మనసు చూరగొనే ప్రయత్నం చేయొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వినతులు, డిమాండ్లు..

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ఒక్క సాగునీటి పారుదల ప్రాజెక్టుకు కూడా కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వలేదు. ఈ దృష్ట్యా 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర సర్కారు కేంద్రాన్ని కోరుతోంది. అయితే, 2014 తర్వాత దేశంలోని ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా కల్పించలేదని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా ఇతర పథకాల కింద 60 శాతం నిధులిస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది.



- విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి' కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులివ్వాలని అడుగుతోంది. రాష్ట్రంలోని తొమ్మిది పాత ఉమ్మడి జిల్లాలకు ఒక్కో జిల్లాకూ రూ.50 కోట్ల చొప్పున ఏటా రూ.450 కోట్లు రావాలని వివరిస్తోంది. ఇలా 2021-22 నుంచి 2023-24 వరకు మూడేళ్లకు గాను మొత్తం రూ.1800 కోట్ల గ్రాంటు అడుగుతోంది.
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నెల్లూరుకు మెగా లెదర్ పార్కును మంజూరు చేసిందని గుర్తు చేస్తోంది. తెలంగాణలోని కరీంనగర్, జనగాం జిల్లాల్లోనూ లెదర్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూములున్నాయని, ఈ పార్కులను మంజూరు చేస్తే.. భూములు కేటాయిస్తామని చెబుతోంది.
- పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇచ్చిందని, దానికి గ్రీన్ ఫీల్డ్ హోదా ఇవ్వాలని కోరుతోంది. బ్రౌన్ ఫీల్డ్ నుంచి గ్రీన్ ఫీల్డ్‌కు మారితే గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300 కోట్ల నిధులు వస్తాయని చెబుతోంది.
- మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని.. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కూడా తుది అనుమతులు మంజూరు చేయాలని అడుగుతోంది. కేంద్రం తుది అనుమతులు మంజూరు చేస్తే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయని ఆశిస్తోంది.
- కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం రూ.2,233.54 కోట్లు ఇవ్వాల్సిందిగా సిఫారసు చేసిందని.. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని అడుగుతోంది.
- యూపీఏ హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) సెంటర్ మంజూరైంది. అప్పటి కేంద్ర మంత్రి ఆనంద్ శర్మ సెంటర్ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే.. రాష్ట్ర విభజన తర్వాత ఎన్ఐడీని విజయవాడకు తరలించారని, ఈ నేపథ్యంలో తెలంగాణకు ఎన్ఐడీని మంజూరు చేయాలని ప్రభుత్వం కోరుతోంది.
- తెలంగాణకు జాతీయ చేనేత సాంకేతిక కేంద్రం(ఐఐహెచ్‌టీ)ను మంజూరు చేయాలని కోరుతోంది.
- రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, ఎస్‌హెచ్ఆర్సీ భవనాలనువినియోగించుకున్నందుకు రూ.408కోట్లు ఇప్పించాలని తెలంగాణ కోరుతోంది.
- తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90కోట్ల చొప్పున అదనంగా కేటాయించాలని అడుగుతోంది.
- రాష్ట్రంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించామని.. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద ఈ ఇళ్లను నిర్మించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతోంది.
- మెట్రో రైలు రెండో దశ పనులకు నిధులివ్వాలని కూడా రాష్ట్ర సర్కారు కేంద్రాన్ని కోరుతోంది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

» ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు: భట్టి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నమధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తుందని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. చిన్న, మధ్య తరగతి ఐటీ కంపెనీలు, యానిమేషన్, గేమింగ్, విఎఫ్ఎక్స్ కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించేలా బడ్జెట్ కేటాయింపులుంటాయని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖలు రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రై పోర్టుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల భూ కేటాయింపులపై దృష్టిసారించాలన్నారు. లిడ్‌క్యాప్ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. లెదర్ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు మధ్య పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటుతో రోడ్డు కనెక్టివిటీ పెరిగి రవాణా సమస్యలేకుండా ఉండటంతోపాటు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కల్పన పెంచడమే లక్ష్యంగా నూతన ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకురాబోతున్నట్లు చెప్పారు. తొమ్మిది జిల్లాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ జోన్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జీఎస్‌డీపీలో పరిశ్రమల నుంచి 65శాతం ఆదాయం సమకూరుతోందని, పరిశ్రమలకు బడ్జెట్‌లో సముచితంగా నిధులు కేటాయిస్తే 75 శాతానికి పెంచుతామన్నారు.జిల్లాల్లో ఏర్పాటవుతున్న ఐటీ హబ్‌లో కంపెనీలను ఏర్పాటు చేసేలా తోడ్పాటు అందిస్తామన్నారు.

సర్పంచ్‌ల ఆందోళన న్యాయమైనదే

» బీఆర్ఎస్ హయాంలోనే సర్పంచ్‌ల ఆత్మహత్యలు

» పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి: సంజయ్

» కేసీఆర్ అవినీతిపై విచారణ ఏమైంది?: కిషన్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/గంగాధర: రాష్ట్రంలో సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళన న్యాయమైనదేనని ఎంపీ బండి సంజయ్ అన్నారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి సర్పంచ్‌ల ఆందోళనకు మద్దతు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పది ఎంపీ స్థానాలు గెలుచుకుంటామని చెప్పారు. కేటీఆర్ మాటలను బీఆర్ఎస్ వాళ్లే పట్టించుకోవడం లేదన్నారు. కేటీఆర్ ముస్లింల గురించి మాట్లాడుతున్నాడని.. హిందూ ధర్మం గిట్టని ఆయన మసీదు పెట్టుకోవాలని.. ఆయనకు రాజకీయాలెందుకని ప్రశ్నించారు. దేవుడిని నమ్మని నాన్‌లోకల్ వినోద్ కుమార్‌కు ప్రజలు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. 317 జీవోతో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని సంజయ్ విమర్శించారు. 317 జీవోను సవరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సీఎస్.. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సమ్మయ్యను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్

హయత్‌నగర్: కేసీఆర్ కుటుంబం అంత అవినీతి కుటుంబం దేశంలో ఎక్కడా లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అవినీతిపై విచారణ, సీబీఐ దర్యాప్తు చేయిస్తానన్న కాంగ్రెస్.. ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని రక్షించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సోమవారం హయత్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్‌జీవోల సంపర్క్ అభియాన్ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. దేశంలో అంతరించిపోతున్న కళలను కాపాడేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగానే 'పీపుల్స్ పద్మ' అవార్డుల అందజేత కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమం కింద చింతకింద సుదర్శన్, వనం రామయ్య, గడ్డం సమ్మయ్య, మొగులయ్య అవార్డులు అందుకోవడం హర్షణీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పలువురు కళాకారులు కిషన్‌రెడ్డిని కలిశారు.



జీవో 317 బాధిత నర్సుల ధర్నా

» న్యాయం చేయాలంటూ సచివాలయం వద్ద బైఠాయింపు

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలంటూ జీవో నంబరు 317 బాధిత నర్సులు ధర్నాకు దిగారు. సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహిస్తున్నప్పుడు.. బాధిత నర్సులు గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. 317 జీవోను సమీక్షించి, పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిందని గుర్తుచేశారు. రెండు రోజుల్లో రాష్ట్రంలో 6,953 మంది స్టాఫ్‌నర్సులకు భర్తీ నియామక పత్రాలను సీఎం చేతుల మీదగా అందజేయబోతున్నారు. వాటిని భర్తీ చేస్తే ఖాళీలన్నీ నిండిపోతాయని, దాంతో తాము సొంత జిల్లాలకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతామ బాధిత నర్సులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలోగానే తమకు న్యాయం చేయాలని సర్కారును డిమాండ్ చేశారు. తమకు అనుకూలంగా గతంలో హైకోర్టు సైతం తీర్పు ఇచ్చినట్లు వారు గుర్తు చేశారు. నర్సుల ధర్నాతో సుమారు గంటన్నరసేపు సచివాలయ గేటు వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ధర్నా చేస్తున్న వారిలో ఐదుగురిని సీఎం దగ్గరికి తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మార్టగేజ్‌తో మడతెట్టేస్తాడు..!

శివబాలకృష్ణ లీలలు..

» 10% మార్టగేజ్ రూల్ చూపి.. రిజిస్ట్రేషన్ లేకున్నా పొసెషన్‌లోకి

» ఏసీబీ దర్యాప్తులో వెలుగులోకి

» 10 రోజుల కస్టడీకి పిటీషన్

» ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఏసీబీ దర్యాప్తులో రోజుకో సంచలనం వెలుగులోకి వస్తోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో నిర్మించే బహుళ అంతస్తులకు సంబంధించి, అనుమతులు తీసుకునే సమయంలోనే.. 10% హెచ్ఎండీఏకు మార్టగేజ్ చేయాలనే నిబంధన ఉంది. సెట్‌బ్యాక్‌లను వదిలి, పర్మిషన్‌లో పేర్కొన్న ప్రకారమే నిర్మాణ పనులన్నీ పూర్తయితేనే.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) ఇస్తారు. ఓసీ ఉంటేనే హెచ్ఎండీఏ ఆ మార్టగేజ్‌ను విడుదల చేస్తుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకున్న శివబాలకృష్ణ.. మార్టగేజ్‌తోనే అసలు మతలబు నడిపినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహుళ అంతస్తుల భవనాల్లో.. ఫ్లాట్ల నిర్మాణాన్ని బట్టి.. తన వంతు వాటాను తీసుకునేవాడు. విల్లాల నిర్మాణంలోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు ఏసీబీ నిర్ధారించింది. అలా వాటా తీసుకున్న ఫ్లాట్, ఇళ్లకు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోకుండా.. తన వారిని వాటిల్లో దింపేస్తాడు. ఆ ఫ్లాట్లు, ఇళ్లు బిల్డర్లు/నిర్మాణ సంస్థ పేరిటే ఉన్నా.. ఎవరికీ విక్రయించే అవకాశం లేకుండా చేస్తాడు. అంతా అనుకున్నట్లు జరిగాక.. తన వాళ్ల పేరిట వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తాడు. ఇదే తరహాలో.. ఓ నిర్మాణ సంస్థ పేరిట ఉన్న విల్లాలో శివబాలకృష్ణ సన్నిహితులు ఇంటీరియర్ డిజైన్ చేస్తున్న విషయాన్ని ఏసీబీ గుర్తించింది. ఇలా శివబాలకృష్ణ తన సర్వీసులో ఆదాయానికి మించి విల్లాలు, ఫ్లాట్లు, స్థలాలను సేకరించాడని ఏసీబీ గుర్తించింది. దీన్ని బట్టి అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు..! రెవెన్యూ సంబంధిత అంశాల్లో స్పష్టత కోసం సంబంధిత శాఖలో పనిచేసి, పదవీ విరమణ చేసిన అధికారుల సహకారం కోసం ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

మూడేళ్ల తర్వాత తొలి కస్టడీ..!

శివబాలకృష్ణను అధికారులు గత వారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అరెస్టు సమయంలో ఆయన గానీ, కుటుంబ సభ్యులు గానీ విచారణకు సహకరించలేదని ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో శివబాలకృష్ణను 10 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సోమవారం ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌కు అనుకూలంగా తీర్పునిస్తే.. ఏసీబీ అధికారులు ఓ నిందితుడిని కస్టడీకి తీసుకుని, విచారించడం గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి అవుతుంది. 2020లో రూ.1.10 కోట్ల లంచం కేసులో పట్టుబడ్డ కీసర తహసీల్దార్ నాగరాజు, అదే కేసులో మరికొందరు నిందితులను కస్టడీకి తీసుకుని, విచారించారు. అయితే.. నాగరాజు చంచల్‌గూడ జైలులో కిటికీ చువ్వలకు ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత ఇదే కేసులో మరో నిందితుడు ధర్మారెడ్డి బెయిల్‌పై బయటకు వచ్చి, చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మూడేళ్లుగా నిందితులను కస్టడీలోకి తీసుకోలేదు. శివబాలకృష్ణ కేసు తీవ్రమైనది కావడంతో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు శివ బాలకృష్ణ అరెస్టుతో ఆయన బాధితులు ఒక్కొక్కరుగా ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. తమను ఎలా ఇబ్బందులకు గురిచేశారో వివరిస్తున్నారు. పుప్పాల్‌గూడలోని సర్వేనంబరు 447లో తమకు చెందిన 6 ఎకరాల 36 గుంటల స్థలం విషయంలో శివ బాలకృష్ణ అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తు సూర్యప్రకాశ్ అనే వ్యక్తి సోమవారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు.

సాక్షిలో నాకూ సగం వాటా ఉంది

» ఎవరు కాదన్నా.. నేను వైఎస్ షర్మిలారెడ్డినే: షర్మిల



కడప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏ సాక్షిలో అయితే నా గురించి ఇంత దూషణలు చేస్తున్నారో ఇదే సాక్షిలో నాకు భాగం ఉందని, ఈ మేరకు అప్పట్లోనే రాజశేఖరరెడ్డి నిర్ణయించారని వైఎస్ షర్మిల అన్నారు. ఆడపిల్ల అన్న ఇంగితం కూడా లేకుండా జోకర్ల చేత ఇష్టం వచ్చినట్లు తన గురించి మాట్లాడిస్తున్నారని జగన్‌ను ఉద్దేశించి నిప్పులు చెరిగారు. తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, జగన్‌ను జైల్లో పెట్టించాలని అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీని తన భర్త అనిల్ కోరారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన వదిన భారతీరెడ్డితో కలిసే సోనియా వద్దకు తన భర్త వెళ్లారని, వారు చెప్పేది నిజమే అయితే భారతీరెడ్డితో ఈ విషయం చెప్పిస్తారా అని సవాల్ విసిరారు. సోమవారం కడపలో కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 'నా భర్త ఎప్పుడు సోనియా వద్దకు వెళ్లినా... మా వదిన భారతీరెడ్డితో కలిసే వెళ్లారు. మరి.. 'షర్మిలను సీఎం చేయండి' అని నా భర్త భారతీరెడ్డి ముందే సోనియాకు చెప్పారా? లేక వెనుక చెప్పారా? దీనికి భారతీరెడ్డి సాక్ష్యం చెబుతారా? అసలు ఈ విషయాన్ని ప్రణబ్ ముఖర్జీ ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగంగా చెప్పారా? ఇప్పుడు ఆయన లేరు. కనీసం... ఆయన కుమారుడితోనైనా చెప్పిస్తారా? ఇక మీ కుట్రలకు అడ్డూ అదుపూ ఉండదా?' అని మండిపడ్డారు. 'నేను రాజశేఖరరెడ్డి బిడ్డను. పులి కడుపున పులి పుడుతుంది. నా ఉనికి ఇదే. ఎవరు కాదన్నా, ఎవరు అవునన్నా, ఎవరు గీపెట్టినా, నేను వైఎస్ షర్మిలారెడ్డి. ఆంధ్రరాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికే ఇక్కడకు వచ్చా. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. ఏం పీక్కుంటారో పీక్కోండి. ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరు. ఇక్కడున్నది రాజశేఖరరెడ్డి బిడ్డ.. ఖబడ్దార్. మళ్లీ చెబుతున్నా.. ఇది నా పుట్టిల్లు' అని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

● ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.



అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఇప్పటికే ఈ గురుకులాలల్లో చదువుతున్నవారికి ఒక ఏడాది సడలింపు వర్తిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉండాలి.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. మేథమెటిక్స్ నుంచి 25; ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.

● ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టుల నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. ఇవి కూడా పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

ముఖ్య సమాచారం

- ఐఐటీ/మెడికల్ అకాడమీల్లో చేరాలనుకొనే అభ్యర్థులు ముందుగానే దరఖాస్తులో తెలపాలి.
- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మార్చి 2 నుంచి
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

ఇందిరాగాంధీ ట్రైబల్ వర్సిటీలో హిందీ సర్టిఫికెట్ కోర్సు

అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ(ఐజీఎన్‌టీయూ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కమ్యూనికేటివ్ హిందీ'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. వర్సిటీ నిర్వహించే ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 45 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. హిందీపై ఆసక్తి ఉన్నవారు, రీసెర్చ్ స్కాలర్స్ ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ నుంచి 50, హిందీ లాంగ్వేజ్‌నుంచి 30 మార్కులకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రైటింగ్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీసం 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19
- **ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 24
- **ఫలితాలు విడుదల:** మార్చి 4
- **వెరిఫికేషన్:** మార్చి 12
- **తరగతులు ప్రారంభం:** మార్చి 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.igntu.ac.in

జాబ్ కార్నర్

ఎన్‌టీపీసీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్...ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్)

ఖాళీలు: బీఈ, బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.55,000

వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ స్క్రీనింగ్, షార్ట్‌లిస్టింగ్, సెలెక్షన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://www.ntpc.co.in/jobsntpc

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ **ఖాళీలు:** 28

విద్యార్హతలు: కనీసం 75 శాతం మార్కులతో గ్రాడ్యుయేట్ డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

వయోపరిమితి: 30 సంవత్సరాలు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: యూఆర్/ఓబీసీ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 9

వెబ్‌సైట్: https://www.ircon.org/

అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

పన్నుల నుంచి తప్పించుకొనుట

● ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేటివ్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) వంటి వాటిలో ఉన్న అనేక దేశాలు 80వ దశకం నుంచి కార్పొరేట్ ట్యాక్స్‌లను సగానికి పైగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం కొన్ని దేశాలు అతి తక్కువ కార్పొరేట్ పన్నులు విధిస్తున్నాయి. మరి కొన్ని దేశాలు ట్యాక్స్ హెవెన్స్‌గా మారాయి. దీని వల్ల పలు దేశాలకు పన్ను రాబడి తగ్గింది. అంతేకాదు, పన్నులు విధిస్తున్న దేశాల్లోని సంపన్నులు పన్నుల ఎగవేతకు పాల్పడడానికి డొల్ల కంపెనీల స్థాపనకు కారణమవుతున్నాయి.

● 1980లో ఓఈసీడీ దేశాల్లో కార్పొరేట్ ఆదాయ పన్ను 48 శాతం ఉండగా 2022 నాటికి అది 23 శాతానికి తగ్గింది. 2020-23 మధ్య కాలంలో 141 దేశాల్లో సర్వే చేయగా 111 దేశాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఇదే సమయంలో కార్పొరేట్ల ఆదాయం కొన్ని రెట్లు పెరిగింది. ఈవిధంగా సంపన్నులపై పడని పన్నుల భారం ప్రభుత్వ సంక్షేమ వ్యయాల కోసం సామాన్యులు, పేదలపై పడుతూ ప్రపంచ వ్యాప్తంగా వారి వాస్తవ ఆదాయాలను మరింత తగ్గిస్తోంది.

ప్రభుత్వ రంగ వ్యవస్థల ప్రైవేటీకరణ

● అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లోకి ప్రైవేట్ రంగాన్ని అనుమతించడంతో వాటిని సైతం కార్పొరేట్స్ లాభార్జన కోసం వినియోగించుకుంటున్నాయి. ప్రపంచ బ్యాంక్ వంటి నిధి వితరణ సంస్థలు కూడా ప్రైవేట్ భాగస్వామ్య పథకాలకు రుణాలు మంజూరు చేస్తూండడంతో పెద్ద ఎత్తున ప్రజాధనం కార్పొరేట్ సంస్థల పెట్టుబడిగా పరిణమిస్తోంది.

● విద్య వంటి ప్రజాశ్రేయస్సు రంగంలో కూడా కార్పొరేట్ ప్రవేశంతో ఆ సేవలు పొందలేని పేదలకు, వాటిని పొందే ధనికులకు మధ్య నైపుణ్యాలు, విద్యా ప్రమాణ పరమైన అంతరాలు మరింత పెరిగి ఆర్థిక అసమానతలను సుస్థిరం చేస్తున్నాయి.

వాతావరణ విఘాతం

● ప్రపంచ కుబేరుల అధీనంలోని అనేక సంస్థలు శిలాజ ఇంధనాలు, ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడడం వల్ల కర్బన ఉద్గారాలు ఎత్తున విడుదలై పర్యావరణ హననానికి కారణమవుతున్నాయి.

● ప్రపంచ జనాభాలో 2/3 వ వంతు పేదలు విడుదల చేస్తున్న కాలుష్యానికి సమానమైనదాన్ని కేవలం ఒక శాతం ఉన్న సంపన్నులు విడిచి పెడుతున్నారు

సూచించిన పరిష్కారాలు

● ప్రపంచ దేశాల మధ్య ఆదాయ అసమానతల నివారణకు ఐక్యరాజ్యసమితి, జీ 20 వంటి వేదికల ద్వారా గ్లోబల్ రూల్స్‌విధానాల రూపకల్పనకు కృషి జరగాలి.

● కార్పొరేట్ శక్తులకు దీటుగా ప్రభుత్వ రంగం విద్య, వైద్యం, మౌలిక సేవల రంగాల్లో పునరుత్తేజం తేవాలి.

● ప్రజా రవాణా, పునరుత్పాదక శక్తి వనరులు, రుణ వితరణ రంగాల్లో కార్పొరేట్ నియంత్రణ శక్తులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందుబాటులో ఉండాలి. మార్కెట్ నియంత్రణ, ధరల నియంత్రణకు ప్రభుత్వ వ్యవస్థల పాత్ర, పరిధి పెరగాలి.

● ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలి.

● పేటెంట్ రూల్స్‌ను సరళీకరించి గుత్తాధిపత్య ధోరణుల స్థానంలో ప్రజాస్వామ్యయుత ఉద్యమతత్వం, వాణిజ్యం పాదుకొల్పాలి.

● కార్మికుల, మహిళల, అణగారిన వర్గాల సాధికారతకు; పర్యావరణ పరిరక్షణకు; అసమానతల నిర్మూలనకు కార్పొరేట్ సెక్టార్ దోహదపడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి.



● ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పర్యావరణ డ్యూ డెలిజెన్స్, మానవ హక్కుల అమలు దిశగా ప్రభుత్వాలు చట్టాలను, విధానాలను రూపొందించాలి.

● సీఈఓ, యాజమాన్య లాభాలు, ప్రతిఫలాలపై క్యాపింగ్ విధించడం; కార్పొరేట్ ఆదాయ పన్ను పెంచడం, పర్మనెంట్ యాక్సెస్ ప్రాఫిట్ ట్యాక్స్, పర్మనెంట్ వెల్త్ ట్యాక్స్ విధించడం వంటి చర్యలు చేపట్టాలి.

● ప్రజలలో ఉద్యమతత్వం పెంచడం, సహకార సంఘాల ఏర్పాటు, చిన్న సంస్థలకు రుణ వితరణ పెంచడం, లాభాల్లో ఉద్యోగులకు వాటాలనిచ్చే న్యూ జనరేటివ్ కంపెనీల ప్రోత్సాహం, కనీసం జీవన వేతనాలను ఇచ్చే సంస్థలకే ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇవ్వ డం, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నిధులు వెచ్చించే ప్రాజెక్టుల్లో బహుళ జాతి కంపెనీలు చొరబడకుండా చూడడం, పన్నులు సక్రమంగా చెల్లించే సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం వంటి చర్యల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు దోహదపడవచ్చు.

> భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్లు పోషకాహారాన్ని అందించవచ్చు.

ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్ట్: సర్వైవల్ ఆఫ్ ద రిచెస్ట్-ద ఇండియా స్టోరీ'

భారతీయ ఆర్థిక అసమానతలపై ఆక్స్‌ఫామ్ ఇండియా విడుదల చేసిన నివేదిక- లింగ, వర్గ, ప్రాంతాలపరంగా పేద-ధనిక వ్యత్యాసాలను విశ్లేషించింది. అసమానతల్లో ఇటీవలి ధోరణులు, వాటికి కారణాలు, నివారణ చర్యలు కూడా పేర్కొంది.

భారత్‌లో ఆర్థిక అసమానతల తీరు

● దేశ సంపదలో 60 శాతం వరకు కేవలం అయిదు శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతం కాగా ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉంది.

● 2020-22 మధ్య రెండేళ్లలో భారత బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 166కు పెరిగింది. ఇదే సమయంలో ప్రపంచంలోనే అత్యధికమంది(228.9 మిలియన్లు) పేదలు భారతదేశంలో ఉన్నారు.

● 2012 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో సృష్టించిన సంపదలో 40 శాతం దేశంలోని ఒక శాతం సంపన్నుల చేతుల్లోకి చేరగా కేవలం 3 శాతం సంపద ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా చేతుల్లోకి చేరింది.

● దేశంలోని వందమంది అత్యంత సంపన్నుల సంపద విస్తృతంగా 660 బిలియన్ డాలర్లు/54.12 లక్షల కోట్లుగా ఉంది. ఇది ఏడాది కాలానికి సరిపోయే దేశ బడ్జెట్ నిధులకు సమానం.

● భారతదేశంలో 2018 నుంచి 2022 మధ్య పేదల సంఖ్య మాత్రం 190 మిలియన్‌ల నుంచి 350 మిలియన్‌లకు పెరిగింది. 2022లో అయిదేళ్లలోపు బాలల మరణాల్లో 65 శాతం కేవలం పేదరికం, పోషకాహార లోపం వల్ల సంభవించాయి.

● కరోనా విజృంభించిన సమయంలో దిగువ 50 శాతం మంది జనాభా తమ సంపదలో క్షీణతను చవిచూశారు. 2020 జాతీయాదాయంలో వారికి దక్కింది కేవలం 13 శాతం మాత్రమే. ఇది వారిపై రుణభారం పెరగడానికి, పోషకాహార లోపానికి, అనారోగ్య మరణాలకు దారితీసింది. ఇదే సమయంలో ఎగువ 30 శాతం మంది సంపన్నులు 90 శాతం సంపదను చేజిక్కించుకున్నారు. మరీ ముఖ్యంగా ఎగువ 10 శాతం మంది సంపన్నుల చేతిలో 80 శాతం సంపద కేంద్రీకృతం కాగా ఎగువ 5 శాతం మంది సంపన్నుల చేతిలో అయితే దేశ సంపదలో సగానికిపైగా అంటే 62 శాతం వరకు వచ్చి చేరింది. ఇక టాప్ ఒక శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతమైన సంపదను దిగువ 50 శాతం మంది ప్రజల మొత్తం సంపదతో పోలిస్తే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అంటే మొత్తం దేశ సంపదలో 40.6 శాతం వరకు కేవలం ఒక శాతం టాప్ సంపన్నుల చేతిలో ఉంది.

● ఈ ఆర్థిక అసమానతల ధోరణులు కరోనా సమయంలో మరింత పెరిగాయి. కరోనా విజృంభణ నుంచి 2022 నవంబరు వరకు బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. అంటే రోజుకు 3,608 కోట్ల రూపాయాల సంపద జమ అయింది.

లింగ, సామాజిక అసమానతలు

● భారతీయ పురుష కార్మికులు సంపాదించే ప్రతి రూపాయి వేతనానికి మహిళ కార్మికులు కేవలం 60 పైసలు మాత్రమే సంపాదిస్తున్నారు. ఈ వ్యత్యాసాలు గ్రామీణ, షెడ్యూల్డ్ క్యాస్ట్ వర్గాల్లో అధికంగా ఉన్నాయి. పట్టణ, ఉన్నత వర్గాలు పొందుతున్న ఆదాయాల్లో గ్రామీణులు 55 శాతం, షెడ్యూల్డ్ క్యాస్ట్‌ల వారు సగం కన్నా తక్కువే పొందుతున్నారు.

ఆర్థిక అసమానతలు పెరగడానికి కారణాలు

● భారతదేశంలో 2019లో కార్పొరేట్ పన్ను శ్లాబ్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్త పరిశ్రమలపై మరింత తక్కువగా 15 శాతం పన్ను విధించారు. ఈ కొత్త పన్ను విధానాల వల్ల దేశం 1.84 లక్షల కోట్ల రూపాయలు కోల్పోయింది. అయితే ఆదాయం పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని; పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలను పెంచడం వల్ల ఈ పరోక్ష పన్నులు సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపాయి.

● ఆదాయంలో శాతంగా చూసుకుంటే భారతదేశంలో దిగువ 50 శాతం మంది ప్రజలు, టాప్ 10 శాతం మంది సంపన్నులతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నారు.

● ఆహార, ఆహారేతర పదార్థాలపై విధించే పన్నుల్లో 64 శాతం వరకు దిగువ 50 శాతం జనాభా నుంచే సమకూరుతోంది.

● ప్రభుత్వానికి జీఎస్‌టీ ఆదాయాలపరంగా చూస్తే 2/3 వంతుకు కొద్దిగా తక్కువ భాగం దిగువ 50 శాతం మంది నుంచి; 1/3 శాతం వరకు మధ్య 40 శాతం జనాభా నుంచి సమకూరుతుండగా టాప్ 10 శాతం మంది నుంచి కేవలం మూడు శాతం నుంచి నాలుగు శాతం వరకు లభిస్తోంది.

● ఈ విధంగా సంపన్నుల సంపదపై కన్నా సామాన్య పేద వర్గాల ఆదాయాలపై పన్నులు అధికంగా ఉండి వారి తలసరి వ్యయార్హ ఆదాయం తగ్గి ఆదాయ అంతరాలు మరింత పెరుగుతున్నాయి.

● భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్లు పోషకాహారాన్ని అందించవచ్చు.

● అదేవిధంగా దేశంలో అత్యంత సంపన్న వ్యక్తి గౌతమ్ అదానీపై 2017-21 మధ్య అన్ రియలైజ్డ్ గెయిన్స్‌పై ఒకసారి పన్ను విధించడం ద్వారా వచ్చే 1.79 లక్షల కోట్లతో దేశంలోని 50 లక్షల ప్రైమరీ స్కూల్ టీచర్లకు ఏడాదిపాటు ఉపాధి, వేతనాలు ఇవ్వొచ్చు.

● టాప్ 10 బిలియనీర్లపై 5 శాతం చొప్పున పన్ను విధిస్తే షెడ్యూల్ ట్రైబ్‌ల ఆరోగ్య సంరక్షణపై అయిదేళ్లకు ఖర్చయ్యే మొత్తం లభిస్తుంది.

భారత్‌లో అసమానతల నిర్మూలనకు ఇచ్చిన సూచనలు

● దేశంలోని సంపన్నుల నికర సంపదపై శాశ్వత ప్రాతిపదికన పన్నులు విధించాలి. విధాన రూపకర్తలను ప్రభావితం చేయగల సంపన్న వర్గాలు మరింత సంపన్నులుగా మారే విషవలయాన్ని ఛేదించాలి.

● సామాన్యులు వినియోగించే కనీసావసర వస్తువులపై జీఎస్‌టీ పన్ను స్లాబ్‌లను తగ్గించడం, విలాస వస్తువులపై భారీగా పన్నులు విధించడం ద్వారా పేదలపై పన్ను భారం తగ్గి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

● వైద్య రంగంపై 2025 నాటికి జీడీపీలో 2.5 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలి. అదేవిధంగా విద్యపై 6 శాతం కేటాయించాలి. విద్య-వైద్య సౌకర్యాలు విస్తరింపజేయాలి. పేద, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి.

● దేశంలోని అవ్యవస్థీకృత ఆర్థిక రంగంలో ఉన్న 90 శాతం శ్రామిక శక్తి ఆకస్మిక ఆర్థిక ఒడుదొడుకులను, ద్రవ్యోల్బణాలను తట్టుకొనే స్థితిలో లేనందున వారికి సాంఘిక భద్రత కల్పించడం సహా పర్యవేక్షణ, ట్రాకింగ్, పరిరక్షణ విధానాల ద్వారా వారిని ఆదుకోవాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్



గాడిద గర్వభంగం

అనగనగా ఓ వ్యాపారి. ఆ వ్యాపారి ఇంట్లో ఓ గాడిద, ఓ కుక్క ఉండేది. కుక్కను ప్రేమగా చూడటంతో గాడిదకు అసూయపుట్టేది. అన్నీ తనకే కష్టాలని బాధపడేది. ఆ కష్టాలను ఇతరులకు చెబుతూ ఉపశమనం అయ్యేది. గాడిద కష్టాలని అందుకు అంటారన్నమాట.

ఆ వ్యాపారి మంచి కళాకారుడు కూడా. బొమ్మలు తయారు చేసి రంగులు పూసి మంచి ధరకు అమ్మేవాడు. ఒక రోజు ఓ మంచి బొమ్మను తయారు చేశాడు. పండుగ రోజు ఓ ధనికుడు ఇంటికి తీసుకెళ్లి ఆ బొమ్మను ఇద్దామనుకున్నాడు. ఆ పెద్ద బొమ్మను యథావిధిగా గాడిద మీద తీసుకెళ్లాలనుకున్నాడు. పండగ రోజు ఉదయాన్నే గాడిద మీద బొమ్మను తీసుకుని వ్యాపారి వెళ్తున్నాడు. అరే.. బొమ్మ ఎంత బావుందోనని ఊర్లోని పిల్లా, పెద్దలు చూస్తున్నారు. ఒకటే గుంపు. మెచ్చుకోలు. ఆహా.. ఈ గుంపు ఇలా చప్పట్లు కొడుతుందంటే.. నా గొప్పతనం వల్లనే అనుకుంది. వాస్తవానికి ఆ బొమ్మకు కానీ తన పనికి మెచ్చుకోలని ఆ గాడిదకు తెలీదు.

ఆ ఊరిలోని కొందరు కళాకారులు ఆ బొమ్మచూసి ఆశ్చర్యపోయారు. డ్యాన్సులేశారు. ఆ కళాకారుడు, వ్యాపారి అయిన వ్యక్తికి బహుమతి ఇచ్చారు కొందరు ఆసాములు. ఆ ఆనందం తట్టుకోలేక గాడిద గట్టిగా ఆనందంతో అరవసాగింది. వాస్తవానికి గాడిద అరుపు విని అందరూ బెంబేలెత్తారు. గాడిద మాత్రం తన కంఠ స్వరం గొప్పదన్నట్లు ఒకటే అరుపు. దాన్ని మచ్చికచేసుకుని.. గాండ్రింపు తగ్గించటానికి నానా యాతన పడ్డాడు ఆ వ్యాపారి. చేసేదేమిలేక చివరకి ఒక పెద్ద కర్రను తీసుకుని కాళ్లకు గట్టిగా బాదాడు. కాళ్లకు మంటలు ఒకవైపు.. మరో వైపు గాడిద మెడ తాడును మరో మనిషి పట్టుకున్నాడు. పరిగెత్తితే కొడతారని భయపడి.. మెల్లగా నడిచింది గాడిద. తన గర్వభంగం అలా అణిగిపోయింది.




ఏవి ఎన్ని?


చుక్కలు కలిపి రంగులు వేయండి



10 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 216

6			3		1			
							2	1
4	2			5		9		
5	6							
	7		6	3	9		4	
							7	2
		7		9			6	8
8	3							
			8		6			4

సుడోకు - 215 సమాధానం

9	6	3	7	1	4	5	8	2
7	5	8	3	9	2	1	6	4
1	2	4	8	6	5	3	9	7
6	9	5	4	2	7	8	3	1
8	7	1	5	3	6	2	4	9
4	3	2	1	8	9	6	7	5
3	4	7	2	5	8	9	1	6
2	8	9	6	4	1	7	5	3
5	1	6	9	7	3	4	2	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.